

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 226

సోమవారం 1-5-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పంజాబ్ బల్లే.. బల్లే

ఆఖరి బంతికి చెన్నైపై గెలుపు.. రాణించిన ప్రభు, లివింగ్‌స్టోన్ - 12లో



ఇవి తెలిస్తే నో టెన్షన్

హెల్త్ ఇన్సూరెన్స్‌ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం -13లో



మాల్దీవులకు భారత్ కానుక

కీలక మిత్ర దేశమైన మాల్దీవులకు భారత్ గస్తీ నౌక, ల్యాండింగ్ క్రాఫ్ట్‌లను త్వరలో కానుకగా ఇవ్వనుంది.

వివరాలు 6లో ▸



రాహుల్‌ను చూసి నేర్చుకోండి

దేశం కోసం తుపాకీ తూటాలకు ఎదురొడ్డటా నికైనా సిద్ధంగా ఉన్న రాహుల్‌ను చూసి మోదీ నేర్చుకోవాలని ప్రియాంక సూచించారు.

వివరాలు 6లో ▸



బ్యాక్టీరియా మేఘాలు!

ప్రమాదకరమైన బ్యాక్టీరియాను మోసుకొచ్చే మేఘాలు కూడా ఉన్నాయని కెనడా, ఫ్రాన్స్ పరిశోధకులు చెబుతున్నారు.

వివరాలు 6లో ▸



నకిలీ వెబ్‌సైట్లు తొలగింపు

సైబరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీసులు ఇప్పటివరకు 100కు పైగా నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను తొలగించారు.

వివరాలు 14లో ▸

ఏది నిజం?

చదువుపై ఇష్టం... రామోజీకి కష్టం!

- ప్రభుత్వ విద్యపై వరుసగా 'ఈనాడు' విషపు గుళికలు
- అసలు కార్పొరేట్ మాఫియాను పెంచి పోషించిందే చంద్రబాబు
- వారి కారణంగానే విద్యార్థులపై ఒత్తిడి; ఫలితమే ఆత్మహత్యలు
- వాటిని కూడా ప్రభుత్వానికి అంటగడుతూ రామోజీ దుష్ప్రచారం
- రాష్ట్రంలో పునాది స్థాయి నుంచీ విద్యను సమూలంగా మార్చిన ప్రభుత్వం.. పిల్లలను స్కూళ్లకు పంపించేందుకు వీలుగా తల్లులకు 'అమ్మ ఒడి'
- ఇష్టంతో చదివేలా గోరుముద్ద, విద్యాకానుక సహా విద్యార్థులకు పలు పథకాలు
- 'నాడు–నేడు' కింద సకల సౌకర్యాలతో ప్రభుత్వ బడులు
- ఇంగ్లిష్ మీడియం, ద్విభాషా పుస్తకాలతో సహా మారిన పాఠ్యాంశాలు
- 6వ తరగతి నుంచి డిజిటల్ క్లాస్‌రూమ్‌లు; 4వ తరగతి నుంచే ఈ–కంటెంట్.. 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు.. ఎడ్యుటెక్ దిగ్గజం బైజూస్ నుంచి పాఠాలు


4 లో

అట్టడుగు వర్గాలకు సాయంలో..

ఏపీ అద్వితీయం

దేశంలోకెల్లా ఇక్కడే ఎస్సీ కుటుంబాలకు భరోసా.. కేంద్రం కితాబు

- దేశవ్యాప్తంగా మొత్తం 34.68 లక్షల కుటుంబాలకు తోడ్పాటు
- ఇందులో రాష్ట్రంలోనే 33.57 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం
- పట్టణ పేదలకు సాయంలోనూ ఏపీదే అగ్రస్థానం
- గత ఆర్థిక ఏడాది డిసెంబర్ వరకు 98,447 వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు
- అలాగే, గత డిసెంబర్ వరకు ఉపాధి హామీ కింద కూలీలకు రూ.3,898.20 కోట్ల వేతనాలు
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ నివేదిక
- 2022–23 ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు పథకాల అమలు పురోగతిపై నివేదిక
- ఆంధ్రప్రదేశ్ 'చాలామంచి' పనితీరు కనబర్చినట్లు కితాబు



సాక్షి, అమరావతి: ఎస్సీ ఉప ప్రణాళిక అమలుతో పాటు ఎస్సీ కుటుంబాలకు సహాయం చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రం అమలుచేయని విధంగా ఎస్సీ ఉప ప్రణాళికను గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఏపీ అమలుచేసినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. 2022–23 మూడో త్రైమాసికం వరకు (ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వివిధ పథకాల అమలు పురోగతిపై నివేదికను ఆ శాఖ శనివారం విడుదల చేసింది. ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా ఆ కుటుంబాలకు సాయం అందించడం, రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, పట్టణ పేదలకు సాయం అందించడంలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'చాలామంచి' పనితీరు కనబరించిందని

మిగతా 2వ పేజీలో ▶

సాత్విక్–చిరాగ్ జోడీ కొత్త చరిత్ర

12 లో

కిడ్నీ రాకెట్ కేసులో
ఆరుగురు అరెస్టు

- ఐదుగురు దళారులు, ఓ వైద్యుడిని అదుపులోకి తీసుకున్న విశాఖ పోలీసులు
- ఇద్దరి కిడ్నీ తొలగించినట్టు గుర్తింపు
- గతంలో అరెస్టైన వెంకటేష్ అసలు సూత్రధారి
- అతడితో పాటు ఇద్దరు వైద్యుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు
- వివరాలు వెల్లడించిన విశాఖ సీపీ త్రివిక్రమ్ వర్మ


విశాఖలోని తిరుమల ఆస్పత్రి

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసును పోలీసులు ఛేదించారు. ఇందులో దళారులుగా వ్యవహరించిన ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అసలు సూత్రధారితో పాటు సర్జరీ చేసిన ఇద్దరు వైద్యుల కోసం ప్రత్యేక బృందాల ద్వారా గాలిస్తున్నట్లు విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. విశాఖ పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 2019లో మహారాణిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కిడ్నీ రాకెట్ నడిపి ఏ4గా అరెస్టై.. 40 రోజుల పాటు విశాఖ జైలులో ఉన్న నార్ల వెంకటేష్ తాజా వ్యవహారంలోనూ అసలు సూత్రధారి అని వివరించారు. ఇతడే మొత్తం రాకెట్‌ను నడిపించాడని పేర్కొన్నారు.

డబ్బు ఆశ చూపి..

మధురవాడ వాంబే కాలనీకి చెందిన జి.వినయ్ కుమార్ ఒక సప్లయిస్ షాప్‌లో వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీను అనే వ్యక్తికి ప్రమాదం జరిగితే వినయ్ కుమార్ పరామర్శించడానికి వెళ్లాడు. అక్కడ అతడికి కామరాజు, ఎలీనా అనే వ్యక్తులను శ్రీను, అతడి భార్య కొండమ్మ పరిచయం చేశారు. మాటల సందర్భంలో కిడ్నీ ఇస్తే రూ.8.5 లక్షలు ఇస్తామని

మిగతా 5వ పేజీలో ▶

రాజమహేంద్రవరంలో

మరో 'మార్గదర్శి'

- టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని కుటుంబీకుల 'జగజ్జనని చిట్‌ఫండ్స్'లో భారీగా అక్రమాలు
- ఆమె మామ ఆదిరెడ్డి అప్పారావు, అతని కుమారుడు అరెస్టు
- 1982 చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలు
- చందాదారుల సొమ్ము దారిమళ్లింపు
- అక్రమ డిపాజిట్ల సేకరణ.. చిట్టీల నిర్వహణలో భారీగా అవకతవకలు
- నకిలీ ఖాతాలు సృష్టించి మోసానికి పాల్పడిన సంస్థ
- 49 మంది సబ్‌స్క్రైబర్ల వివరాలను తనిఖీచేసి, సీఐడీకి ఆధారాలిచ్చిన అసిస్టెంట్ రిజిస్ట్రార్
- చిట్స్ చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడి

2 లో

నేటి నుంచి 'సీఎం కప్' ఫైనల్స్

రాష్ట్రంలో 'సీఎం కప్' క్రీడా పోటీలు తుది దశకు చేరుకున్నాయి. తిరుపతి వేదికగా ఐదు రోజుల పాటు ఫైనల్స్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాట్లు పూర్తి చేసింది. 14 క్రీడాంశాల్లో మే 1 నుంచి 5 వరకు జరిగే పోటీల్లో 3,768 మంది క్రీడాకారులు తలపడనున్నారు.


14 లో

మండు వేసవిలో మెండుగా ముహూర్తాలు



మండు వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. మే, జూన్ నెలల్లో దాదాపు 24 శుభముహూర్తాలు ఉన్నట్టు పండితులు ప్రకటించారు. ఇప్పటికే శుభముహూర్తాలను ఎంపిక చేసుకున్న వారు కళ్యాణ మండపాలు బుక్ చేసుకోవడం, ఆహ్వాన పత్రికలు పంచడంలో నిమగ్నమయ్యారు.

14 లో



టీడీపీ నేతల వీరంగం

పులివెందుల నియోజకవర్గంలో వెంచర్‌ను దున్నేసిన బీటెక్ రవి, ఆయన అనుచరులు

200 మందికి పైగా వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన టీడీపీ నేతలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత వ్యాపారులు

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో కొందరు వ్యాపారులు వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌ను టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆయన అనుచరులు ఆదివారం ట్రాక్టర్లతో దున్నేశారు. బీటెక్ రవి, సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు కలిసి వెంచర్ వద్దకు వచ్చి మారణాయుధాలు పట్టుకుని కేకలు వేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో గోవిందు రామయ్య అనే వ్యక్తికి చెందిన 1.05 ఎకరాల భూమిని రమణ, సుబ్బయ్య అనే వ్యాపారులు కొనుగోలు చేసి రెండు రోజుల కిందట

మిగతా 3వ పేజీలో ▶


నాగలగుట్టపల్లె వద్ద వెంచర్‌లో గుమికూడిన టీడీపీ నాయకులు


టీడీపీ నేతలు దున్నిన వెంచర్

మన్ కీ బాత్... నా ఆధ్యాత్మిక ప్రయాణం

ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆదివారంతో 100 వారాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'ఇది నాకు ఒక ఆరాధన, ఒక వ్రతం. ప్రజలనే దేవుళ్ల నుంచి నాకు లభించిన ప్రసాదమే ఈ మన్ కీ బాత్' అని మోదీ అన్నారు.

6 లో

63.33 లక్షల మందికి రూ.1,747.38 కోట్లు

- 1వ తేదీ తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ
- శనివారం సాయంత్రానికే వలంటీర్ల చేతికి చేరిన పింఛన్ల డబ్బులు

2 లో

63.33 లక్షల మందికి రూ.1,747.38 కోట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 63,33,349 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, పలు రకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సోమవారం (మే 1వ తేదీ) తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం అంతా సిద్ధం చేసింది. పింఛన్ల పంపిణీకి గాను రూ.1,747.38 కోట్లను ప్రభుత్వం శనివారమే విడుదల చేసి ఆయా గ్రామ వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. శనివారం సాయంత్రానికే సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి ఆ నిధులను డ్రా చేసి వలంటీర్లకు అందజేసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. వలంటీర్లు సోమవారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేపడతారని ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు చెప్పారు. పింఛన్ల పంపిణీలో ఏ సమస్యలు ఉత్పన్నమైనా అప్పటికప్పుడు వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయిలో సెర్ప్ కార్యాలయంలోనూ, జిల్లాల పరిధిలోని ఆయా డీఆర్‌డీఏ పీడీ కార్యాలయాల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

శ్రీసిటీని సందర్శించిన క్లీన్ టెక్ స్టార్టప్‌ల సీఈవోలు



వరదయ్యపాలెం(తిరుపతి జిల్లా): కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) కౌన్సిలర్ విన్నీ నేతృత్వంలో దేశంలోని కొన్ని ప్రధాన క్లీన్ టెక్ స్టార్టప్‌ల సీఈవోల బృందం ఆదివారం శ్రీసిటీని సందర్శించింది. వీరికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, స్థిరమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి తీసుకున్న చర్యల గురించి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ వివరించారు. శ్రీసిటీలోని అగ్రశ్రేణి వ్యాపార, విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సరికొత్త అవకాశాల సృష్టికి ఎలా దోహదపడవచ్చనేది తమ ఉత్పత్తులు, సేవల ప్రదర్శన ద్వారా స్టార్టప్‌ల ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియజేశారు. తమ ఉత్పత్తులకు అదనపు ఫీచర్లను అభివృద్ధి చేయడానికి ఇక్కడి విద్యాసంస్థలతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నామని తెలిపారు. వీరి పర్యటనపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ దేశ ప్రగతికి దోహదపడేలా మరింత స్థిరమైన అభివృద్ధి సాధించే దిశగా కొత్త మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ స్వచ్ఛత లక్ష్యానికి దోహదపడేలా తమ సొంత మార్గాల్లో క్లీన్ టెక్ స్టార్టప్‌లు పర్యావరణాన్ని కాపాడేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ బృందంలో ఎయిర్ మాస్టర్ టెక్నాలజీస్ ఇండియా, ఎర్త్ ఫోకస్, ఫ్లెక్స్ జెన్ టెక్నాలజీస్, గ్రీన్ టర్న్ ఐడియా ఫ్యాక్టరీ, నెబిస్కిల్యాబ్స్ వెర్మీ గోల్డ్ ఎకో టెక్, బ్రిడ్జ్ థింక్స్ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు ఉన్నారు.



డిజిటల్ రోడ్లు రాబోతున్నాయ్!

సౌకర్యవంతమైన ప్రయాణానికి సాంకేతిక పరిజ్ఞానం

- పైలట్ ప్రాజెక్ట్‌గా ఢిల్లీ-ముంబై జాతీయ రహదారిపై అమలు
- హైదరాబాద్-బెంగళూరు హైవే కూడా డిజిటల్‌గా రూపాంతరం
- రహదారి వెంట ప్లగ్ అండ్ ప్లే విధానంలో 5జీ, 6జీ నెట్‌వర్క్ సేవలు
- ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్‌తో డిజిటల్ రహదారుల అనుసంధానం
- రోడ్డుకు ఇరువైపులా ఐటీ, ఐటీ అనుబంధ పరిశ్రమలకు అవకాశాలు

■ హైదరాబాద్‌లోని ఓ ఐటీ కంపెనీలో పనిచేసే సంతోష్ అనంతపురం జిల్లాలోని స్వగ్రామానికి బయలుదేరాడు. మధ్యలో కంపెనీ నుంచి ఫోనొచ్చింది. అర్జెంటుగా క్లయింట్‌తో మాట్లాడమని. దగ్గరలోనే రహదారి వెంట ఏర్పాటైన ప్లగ్ అండ్ ప్లే వర్క్ స్టేషన్‌లోకి వెళ్లి క్లయింట్‌తో మాట్లాడిన సంతోష్ క్లయింట్‌కు గల అనుమానాలను నివృత్తి చేశారు. తన హెడ్‌కు ఇదే విషయాన్ని కమ్యూనికేట్ చేశాడు. కంపెనీ నుంచి సంతోష్‌కు అభినందనలు వెల్లువెత్తాయి.

■ హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్తున్న రమేష్‌కు ఓ అలర్ట్ వచ్చింది. ఆ రహదారిలో యాక్సిడెంట్ అయ్యిందని.. రాకపోకలు స్తంభించిపోయాయని.. రోడ్డు క్లియర్ అయ్యేందుకు మరో గంట సమయం పడుతుందని అందులోని సారాంశం. దీంతో రమేష్ ప్రత్యామ్నాయ మార్గంలో తన ప్రయాణం కొనసాగించి సకాలంలో ఇంటికి చేరుకున్నాడు. ఇవేకాదు.. రానున్న రోజుల్లో డిజిటల్ రోడ్ల ఏర్పాటుతో మరింత సౌకర్యవంతమైన ప్రయాణంతోపాటు దారి వెంట మారుమూల ప్రాంతాల్లో కూడా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి 5జీ, 6జీ సేవలు లభించనున్నాయి.

(కేజీ రాఘవేంద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం):

దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల వెంట 10 వేల కిలోమీటర్ల మేర ఆప్టిక్ ఫైబర్ కేబుల్స్ (ఓఎఫ్‌సీ) ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించింది. తొలి విడతతో ప్రయోగాత్మకంగా 1,367 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఢిల్లీ-ముంబై జాతీయ రహదారితోపాటు 512 కిలోమీటర్ల మేర హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారులను డిజిటల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ప్రత్యేకంగా నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్) పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) కూడా ఏర్పాటు చేసింది. జాతీయ రహదారి పక్కన 3 మీటర్ల మేర డెడికేటెడ్ కారిడార్‌లో ఓఎఫ్‌సీ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి సైతం డిజిటల్ రోడ్డుగా మారనుంది. డిజిటల్ రోడ్ల ఏర్పాటుతో ఈ రహదారి వెంట 5జీ, 6జీ నెట్‌వర్క్ సేవలు లభించడంతోపాటు రహదారి వెంట ఉన్న మారుమూల ప్రాంతాలకు కూడా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. ఈ కేబుల్ నెట్‌వర్క్‌ను ఎక్కడికక్కడ వినియోగించుకునేందుకు ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తద్వారా ఈ రహదారి వెంట ఐటీ, ఐటీ అనుబంధ కంపెనీల ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఏర్పడుతుంది.

ఐటీ కంపెనీల ఏర్పాటుకూ అనుకూలం

జాతీయ రహదారి వెంట ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు అవకాశాలు పెరుగుతాయి. హైదరాబాద్-బెంగళూరు రహదారి వెంట ఉన్న తెలుగు రాష్ట్రాల్లో గల జడ్చర్ల, కర్నూలు, అనంతపురం, గుత్తి, హిందుపూర్ వంటి ప్రాంతాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు అవకాశం ఉండనుంది. డిజిటల్ రోడ్ల వల్ల టైర్-2, 3 పట్టణాల్లో కూడా ఐటీ కంపెనీల ఏర్పాటుకు అవకాశం ఏర్పడుతుంది.

ప్రయోజనాలివీ..!

- జాతీయ రహదారి వెంట వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ తెలిసే అవకాశం ఉండటంతో రోడ్డు ప్రమాదాలు తగ్గనున్నాయి. వాహనం నడిపే డ్రైవర్లకు అవసరమైన, కచ్చితమైన సమాచారం అందుతుంది.
- రియల్ టైం డేటాను ప్రయాణికులకు అందించడం ద్వారా ప్రయాణాన్ని ప్లాన్ చేసుకునేందుకు మరింత మెరుగ్గా అవకాశం కలుగుతుంది. ప్రమాదాలను నివారించే అవకాశం ఏర్పడుతుంది. పక్కా సమాచారం అందటం వల్ల ప్రయాణ సమయం కూడా తగ్గనుంది.
- డ్రోన్లను వినియోగించుకునే వీలు కలుగుతుంది. తద్వారా రిమోట్ ఏరియాల్లో సమాచారాన్ని కూడా పొందవచ్చు. ప్రతిసారి ఏవైనా పనులు చేపట్టే సంస్థ సైట్ విజిట్స్‌ను తగ్గించుకోవచ్చు. డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు ఏరియల్ సర్వే చేసే వీలవుతుంది.
- డ్రైవర్ అవసరం లేకుండా రోడ్లపై పరుగులు పెట్టనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా నడిచే వాహనాల వినియోగానికి ఈ రహదారులు మరింత అనువుగా ఉండనున్నాయి.
- ఈ రహదారులు మొత్తం కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించే వీలుంది. తద్వారా జాతీయ రహదారి వెంట ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే స్పందించే వీలు కలుగుతుంది.



అడ్వాన్స్‌డ్ ఆషామాషీ కాదు

- జూన్ 4న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష
- కష్టపడకపోతే గట్టెక్కడం తేలిక కాదంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ ఫలితాల తర్వాత ఇప్పుడు అందరి దృష్టీ అడ్వాన్స్‌డ్‌పై ఉంది. దేశవ్యాప్తంగా 2.5 లక్షల మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఈ పరీక్ష జూన్ 4వ తేదీన జరగనుంది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయ్యింది. అయితే కష్టపడకపోతే అడ్వాన్స్‌డ్‌లో గట్టెక్కడం అంత తేలికైన విషయమేమీ కాదని నిపుణులు అంటున్నారు. మంచి ర్యాంకు సాధిస్తేనే ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఇంజనీరింగ్ చేసే అవకాశం దక్కుతుందని, ఇందుకోసం పూర్తిస్థాయిలో సబ్జెక్టులపై పట్టు సాధించాల్సి ఉంటుందని చెబుతున్నారు. 99 పర్సంటైల్ వచ్చిన వాళ్ళ సంఖ్య ఈసారి వేలల్లో ఉంది కాబట్టి అడ్వాన్స్‌డ్‌లో నెట్టుకురావాలంటే ప్రిపరేషన్ గట్టిగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు.

గణితంపై దృష్టి పెట్టాల్సిందే

జేఈఈ మెయిన్స్‌లో గణితం పేపర్ ప్రతి ఏటా కఠినంగానే ఉంటోంది. అడ్వాన్స్‌డ్‌లో ఇది మరింత కష్టంగా ఉంటోంది. ప్రతి సబ్జెక్టుకూ 120 మార్కులుంటాయి. అయితే గణితంలో 20 మార్కులు సాధించడం గగనమవుతోంది. గత సంవత్సరం అడ్వాన్స్‌డ్ రాసిన వాళ్ళల్లో ఈ మేరకు సాధించినవారు కేవలం 1,200 మంది మాత్రమే ఉన్నారు. ఇక రసాయన శాస్త్రంలో 20 మార్కులు దాటిన వాళ్ళు 2 వేలు, భౌతిక శాస్త్రంలో 4 వేల మంది ఉన్నారు. అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన 2.5 లక్షల మందిలో ఐఐటీ సీట్లకు కేవలం 55 వేల మందినే ఎంపిక చేస్తారు. అందువల్ల వడపోత కఠినంగానే ఉంటుంది. ఈసారి ఎక్కువ మంది జేఈఈ మెయిన్స్ రాయడంతో కటాఫ్ కూడా పెరిగింది. కాబట్టి వడపోతకు వీలుగా అడ్వాన్స్‌డ్ పేపర్లు కాస్త కఠినంగానే ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

బోంబేదే హవా

ఐఐటీల్లో బోంబేకే విద్యార్థులు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఇందులో సీటు కోసం పోటీ పడుతుంటారు. తొలి 50 ర్యాంకుల్లో 46 మంది బోంబేలోనే చేరడం గమనార్హం. మొదటి వెయ్యి ర్యాంకుల్లో 246 మంది ఇక్కడ ప్రవేశం పొందారు. గత ఏడాది 3,310 మంది బాలికలకు ఇందులో సీట్లు దక్కాయి. ఇక అత్యధికంగా తిరుపతి ఐఐటీలో 20.7 శాతం మంది సీట్లు పొందారు. అతి తక్కువగా ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 17.7 మంది సీట్లు పొందారు. విదేశీ విద్యార్థులు 145 మంది అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైతే 66 మందే ప్రవేశాలు పొందారు.

అట్టడుగు వర్గాలకు సాయంలో.. ఏపీ అద్వితీయం

▶ మొదటి పేజీ తరువాయి

ఆ నివేదిక కితాబిచ్చింది. లక్ష్యాల్లో 90 శాతానికి పైగా అమలుచేసిన రాష్ట్రాలను చాలా మంచి పనితీరు కనబరిచినట్లు, 80–90 శాతం మేర అమలుచేసిన రాష్ట్రాలు 'మంచి పనితీరు' కనబరిచినట్లు.. అలాగే 80 శాతం లోపల అమలుచేసిన రాష్ట్రాల పనితీరు బాగోలేని రాష్ట్రాలుగా నివేదిక వర్గీకరించింది.

ఏపీలో 33.57 లక్షల కుటుంబాలకు సాయం..

ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలోని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మొత్తం 34,68,986 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించినట్లు ఆ నివేదిక పేర్కొంది. అయితే.. అందులో ఒక్క ఏపీలోనే ఏకంగా 33,57,052 కుటుంబాలకు సహాయం అందించారు. అలాగే, గతంలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు విడుదల చేసిన నివేదికలో ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా 29,10,944 కుటుంబాలకు సాయం అందించగా.. అదే ఇప్పుడు ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు విడుదల చేసిన నివేదికలో ఆ సంఖ్య 33,57,052కు పెరిగింది. అంటే.. మూడునెలల వ్యవధిలో అదనంగా 4,46,108 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించింది. మిగతా మరే ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ లక్ష మంది ఎస్సీ కుటుంబాలకు కూడా సహాయం చేయలేదని నివేదిక స్పష్టంచేసింది. ఒక్క కర్ణాటకలో మాత్రమే 22,884 కుటుంబాలకు ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా సాయం అందించగా మిగతా రాష్ట్రాలు అంతకన్నా తక్కువగా వేల, వందల సంఖ్యలోనే సహాయం అందించాయి.

పట్టణ పేదలకు సాయంలో కూడా..

అలాగే, గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పట్టణాల్లోని 5,98,194 పట్టణ పేద కుటుంబాలకు సాయం అందించగా అందులో ఒక్క ఏపీలోనే 5,05,962 పేద కుటుంబాలకు సాయం అందించినట్లు నివేదిక వెల్లడించింది.

2022-23లో మూడో త్రైమాసికం నాటికి పట్టణ పేద కుటుంబాలకు అందించిన సాయం వివరాలు..

ఆంధ్రప్రదేశ్	5,05,962
త్రిపుర	61,054
గుజరాత్	10,545



ఇదే గతంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఇచ్చిన నివేదికలో రాష్ట్రంలోని పట్టణ ప్రాంతంలోని 3.47 లక్షల మందికి సాయం అందించినట్లు పేర్కొనగా ఇప్పుడు డిసెంబర్ వరకు ఇచ్చిన నివేదికలో ఆ సంఖ్య 5,05,962 కుటుంబాలకు పెరిగినట్లు పేర్కొంది. అంటే మూడు నెలల వ్యవధిలో పట్టణాల్లోని 1.58 లక్షల పేద కుటుంబాలకు అదనంగా సాయం అందించినట్లు తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో పేదలకు సాయం అందించడంలోనూ ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

'వ్యవసాయ' విద్యుత్ కనెక్షన్లలోనూ అగ్రగామి..

రాష్ట్రంలో రైతుల వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలోనూ ఆంధ్రప్రదేశ్ 'చాలామంచి' పనితీరు కనబరిచినట్లు నివేదిక తెలిపింది. 2022–23లో 24,852 విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా మూడో త్రైమాసికం నాటికి (ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) లక్ష్యానికి మించి 98,447 వ్యవసాయ పంపు సెట్లకు ఏపీ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు నివేదిక తెలిపింది. మరే ఇతర రాష్ట్రంలోనూ ఇంత పెద్ద సంఖ్యలో విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయలేదు. ఉపాధి హామీ కింద రాష్ట్రంలో గత ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 1,78,182 మందికి కొత్తగా జాబ్‌కార్డులను మంజూరు చేసినట్లు నివేదిక పేర్కొంది. అలాగే, ఆ సమయంలో కూలీలకు వేతనాల రూపంలో రూ.3,898.20 కోట్లు చెల్లించినట్లు నివేదిక వెల్లడించింది. ఏపీలోని 55,607 అంగన్‌వాడీలతో పాటు 257 ఐసీడీఎస్‌లు నూరు శాతం పనిచేస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

శభాష్.. సాత్విక్..!

సాక్షి, అమలాపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురానికి చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తిరుగులేని ప్రదర్శనతో అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ వేదికపై సత్తా చాటుతున్న విషయం తెలిసిందే. దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా చాంపియన్‌షిప్ పోటీల్లో విన్నర్‌గా నిలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. ఈ టోర్నీలో ఇప్పటి వరకూ దేశం తరఫున ఎవరూ డబుల్స్ విభాగంలో పతకం సాధించలేదు. 52 ఏళ్ల కలను సాత్విక్ జోడీ నిజం చేసింది. డబుల్స్ విభాగంలో తన సహచరుడు చిరాగ్ శెట్టితో కలసి సాత్విక్ ఈ ఘనత సాధించారు.

విజయాల పరంపర కొనసాగిస్తూ..

- గత ఏడాది జనవరిలో సాత్విక్, చిరాగ్ జోడీ ఇండియన్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచింది.
- 2022 మే నెలలో జరిగిన థామస్ కప్‌లో భారత్ జట్టు విజేతగా నిలవగా.. ఇందులో సాత్విక్ కీలక భూమిక పోషించారు. ఈ టోర్నీలో ప్రపంచంలో అత్యుత్తమ జోడీగా నిలిచిన మలేషియా జట్టు ఆషాన్, కెవిన్ జోడీపై సంచలన విజయం సాధించారు. థామస్ కప్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం.
- గత ఏడాది టోక్యోలో జరిగిన బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో చిరాగ్ శెట్టితో కలసి కాంస్య పతకం సాధించారు.
- ఇండియన్ ఓపెన్ (సూపర్–500), ఫ్రెంచ్ ఓపెన్ (సూపర్–750), ఈ ఏడాది స్విస్ ఓపెన్(సూపర్–300)లో డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచారు.
- తాజాగా ఆసియా చాంపియన్ షిప్ పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించి 16 నెలల్లో ఏడు అంతర్జాతీయ టోర్నీలలో పలు పతకాలు సాధించాడు.

క్రీడాభివృద్ధికి తన వంతుగా..

సాత్విక్ తన సొంతగడ్డ అమలాపురంలో షటిల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి తనవంతు సాయం అందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉడెన్ కోర్టు నిర్మించి, వాటిపై సింథటిక్ మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.5 లక్షల విరాళం అందించారు. కరోనా సమయంలో పలువురికి ఆర్థికంగా సహాయం అందించడంతో పాటు ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చారు.

52 ఏళ్ల కల నిజం చేశారు

సాత్విక్ జోడీ చరిత్ర సృష్టించారు. 52 ఏళ్ల కలను నిజం చేశారు. చాలా ఆనందంగా ఉంది. సెమీస్‌కు వెళ్లి పతకం ఖాయమైనప్పుడే చాలా సంతోషం అనిపించింది. అటువంటిది ఏకంగా స్వర్ణ పతకాన్నే సాధించారు. ఇంతకన్నా ఆనందం మరేముంటుంది. – కాశీవిశ్వనాథ్, సాత్విక్ తండ్రి

మోదీ ట్వీట్

ప్రధాని నరేంద్ర మోదీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీని ట్విట్టర్ ద్వారా అభినందించారు. ఆసియా చాంపియన్‌షిప్‌లో చారిత్రక విజయం సాధించిన వారిద్దరూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

విజేతలకు సీఎం అభినందన

సాక్షి, అమరావతి: బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో పురుషుల డబుల్స్‌లో విజేతగా నిలిచిన సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. సాత్విక్–చిరాగ్ ద్వయం భవిష్యత్‌లోనూ విజయ పరంపరను కొనసాగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

అభినందనల వెల్లువ

సాత్విక్ విజయం సాధించడం పట్ల రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధులు అభినందించారు. అమలాపురంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాత్విక్ తల్లిదండ్రులు కాశీ విశ్వనాథ్, రంగామణి దంపతులను సత్కరించారు.

రాజమహేంద్రవరంలో మరో మార్గదర్శి

టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కుటుంబీకుల 'జగజ్జనని చిట్‌ఫండ్స్'లో భారీగా అక్రమాలు

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం: మార్గదర్శి తరహాలో మరో భారీ మోసం వెలుగుచూసింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జగజ్జనని చిట్స్ పేరుతో టీడీపీ నేతలు ఆర్థిక నేరానికి పాల్పడిన విషయం బట్టబయలైంది. 1982 చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలు ఉల్లంఘించి, ఇష్టానుసారం డిపాజిట్లు సేకరించి, వాటిని ఇతర వ్యాపారాలకు, వడ్డీలకు మళ్లించి అక్రమాలకు తెర తీసిన విషయం సీఐడీ దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది. దీంతో ఆ చిట్‌ఫండ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు–ఏ1, డైరెక్టర్‌గా ఉన్న ఆయన కుమారుడు ఆదిరెడ్డి శ్రీనివాస్–ఏ2 (రాజమహేంద్రవరం సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త)లను సీఐడీ అధికారులు రాజమహేంద్రవరంలో ఆదివారం అరెస్టుచేశారు. వీరితోపాటు మరో డైరెక్టర్ అయిన ఆదిరెడ్డి అప్పారావు కుమార్తె ఆదిరెడ్డి వెంకట జ్యోత్స్నలపై ఐపీసీ సెక్షన్లు 420, 409, 120బి, 477 (ఎ) రెడ్‌విత్ 34, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్–5, కేంద్ర చిట్‌ఫండ్ చట్టం –1982 కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. జగజ్జనని చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడుతున్నట్టు సీఐడీ విభాగానికి కొన్నినెలల క్రితమే ఫిర్యాదులొచ్చాయి. అక్రమాలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో చిట్ రిజిస్ట్రార్ ఈ విషయంపై సీఐడీకి ఫిర్యాదు చేశారు. దాంతో సీఐడీ అధికారులు ఈ ఏడాది మార్చిలో జగజ్జనని చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో భారీగా ఆర్థిక అక్రమాలు వెలుగుచూశాయి. వీటిపై సంస్థ బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) సరైన వివరణ కూడా ఇవ్వలేకపోవడంతో సీఐడీ అధికారులు కేసును లోతుగా విచారించి అవకతవకలను నిర్ధారించారు.

యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలు..

జగజ్జనని చిట్ ఫండ్స్ కంపెనీ కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీఐడీ తనిఖీల్లో బట్టబయలైంది. ఆ కంపెనీ ఎండీ, డైరెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా చందాదారుల సొమ్మును మళ్లించి సొంత ఆస్తులు భారీగా కూడబెట్టుకున్నట్లుగా ఆధారాలను గుర్తించారు. సీఐడీ అధికారులు గుర్తించిన కొన్ని అంశాలివీ..



సీఐడీ కార్యాలయం వద్ద టీడీపీ ఎమ్మెల్యే భవానీ

- చిట్‌ఫండ్స్ కంపెనీలు ఇతర వ్యాపారాలు చేయడం చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. కానీ, జగజ్జనని సంస్థ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల సేకరణ, అక్రమంగా రుణాలు మంజూరు చేస్తూ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తోంది. 2018 నుంచి 2023 వరకు భారీగా అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు.. వాటిపై వడ్డీలు చెల్లించినట్లు గణాంకాలతో సహా వెల్లడైంది. అదే రీతిలో చందాదారుల సొమ్ముతో భారీగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. తద్వారా భారీ ఆదాయాన్ని ఆర్జించినట్లు వెల్లడైంది.
- చిట్టీల నిర్వహణలో జగజ్జనని చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడుతోంది. ప్రతి చిట్టీలోనూ యాజమాన్య వాటా టికెట్లతోపాటు మరికొన్ని టికెట్లను కూడా కంపెనీ తమ పేరిట ఉంచుతోంది. కానీ, ఆ టికెట్లపై ప్రతినెలా చెల్లించాల్సిన చందాను చెల్లించడంలేదు. ఇతర చందాదారులు పాడిన చిట్టీ పాటల ద్వారా వచ్చే డివిడెండ్‌ను తమ ఖాతాలో జమ చేసుకుంటోంది. ఇక ఆ టికెట్ల చిట్టీ పాటల ప్రైజ్‌మనీని కూడా జమచేసుకుంటోంది. ఒక చిట్టీ గ్రూప్‌లోని చందా సొమ్మును మరో చిట్టీ గ్రూప్‌లో బుక్ అడ్జస్ట్‌మెంట్ల ద్వారా కనికట్టు చేస్తోంది. అంటే ఒక్క రూపాయి కూడా చందా చెల్లించకుండా అక్రమంగా ఆర్థిక ప్రయోజనం పొందుతోంది.
- చిట్టీ పాటల నిర్వహణలో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారు. 2022 మే నుంచి ఆగస్టు వరకు సంస్థ నిర్వహించిన చిట్టీ పాటల వేలం రికార్డులను పరిశీలించగా ఈ వ్యవహారం వెలుగుచూసింది. చిట్టీ పాట పాడిన వారికి ఇచ్చే మొత్తాన్ని (ప్రైజ్ మనీ) వాస్తవానికి చిట్టీ పాట నిర్వహించిన తేదీ కంటే ముందే చెల్లించినట్లు బ్యాంకు రికార్డులు వెల్లడించాయి. అంటే చిట్టీ పాటల నిర్వహణ కంటే ముందే ఆ మొత్తాన్ని కొందరికి చెల్లిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. జగజ్జనని చిట్‌ఫండ్స్ నిర్వహిస్తున్న చిట్టీ పాటలు పూర్తిగా బోగస్ అని నిరూపితమైంది.
- ప్రతినెలా 41 చిట్ గ్రూపులను నిర్వహిస్తూ రూ.7,61,50,000 వార్షిక టర్నోవర్‌తో వ్యాపారం చేస్తున్నట్లుగా రికార్డుల్లో సంస్థ చూపిస్తోంది. కానీ, ఆ సంస్థ కాకినాడలోని అసిస్టెంట్ చిట్స్ రిజిస్ట్రార్‌కు సమర్పించిన చిట్ వేలం రికార్డులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఆ సంస్థ ప్రతినెలా క్రమం తప్పకుండా చిట్ వేలాన్ని నిర్వహించడంలేదన్నది వెల్లడైంది. 2022, జనవరి నుంచి 2023 జనవరి వరకు రికార్డులను పరిశీలిస్తే ఒక్కనెల తప్ప మిగిలిన అన్ని నెలల్లోనూ తక్కువ చిట్ వేలమే నిర్వహించింది.
- ఈ కంపెనీ టర్నోవర్‌కు బ్యాంకులో జమచేస్తున్న చందా మొత్తాలు భిన్నంగా ఉన్నాయి. ప్రతినెలా రూ.7.61 కోట్ల టర్నోవర్ అని కంపెనీ చెబుతోంది. అంటే.. డివిడెండ్ మొత్తం మినహాయించుకుంటే ప్రతినెలా రూ.5కోట్లు చొప్పున ఏడాదికి చందా మొత్తాలే రూ.60కోట్లు జమచేయాలి. కానీ, జమచేస్తున్న మొత్తం ఆ దరిదాపుల్లో కూడా లేదు.
- చిట్టీల వేలం సొమ్ము చెల్లింపు ముసుగులో జగజ్జనని చిట్‌ఫండ్స్ నల్లధనాన్ని చలామణిలోకి తెస్తోంది. 49 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ మొత్తం రూ.11,76,82,000 చెల్లింపులను పరిశీలించారు. వాటిలో 21 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ రూ.4,68,45,753ను బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మిగిలిన 28 చిట్టీల వేలం పాటల ప్రైజ్‌మనీ రూ.7,08,36,247ను నగదు రూపంలో చెల్లించినట్లు చెప్పారు. నగదు రూపంలో చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. అంటే.. నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చినట్లు వెల్లడైంది.
- చిట్‌ఫండ్ కంపెనీ అన్ని వ్యవహారాలు నగదులోనే నిర్వహిస్తోంది. అంటే చందాల వసూళ్లు, చిట్ పాట మొత్తం చెల్లింపులన్నీ నగదులోనే నిర్వహిస్తోంది. ఇది ఆదాయపన్ను చట్టానికి విరుద్ధం.
- బ్యాంకు ఖాతాల్లో సంస్థ భారీగా నగదు డిపాజిట్లు కూడా చేస్తోంది. చిట్ వసూళ్లతో ఆ డిపాజిట్లు సరిపోలడంలేదు. ఎక్కువగా బ్యాంకు డిపాజిట్లు నగదు రూపంలోనే చేస్తున్నారు.
- చందా చెల్లించడంలేదని చెబుతున్న చిట్‌ల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా నిర్వహించడంలేదు.
- మరోవైపు.. జగజ్జనని చిట్‌ఫండ్స్ వేలానికి సంబంధించిన మినిట్స్ రికార్డులకు బ్యాంకు లావాదేవీలు భిన్నంగా ఉన్నాయి. మచ్చుక్కి 11 చిట్టీ పాటల మినిట్స్‌ను సీఐడీ అధికారులు పరిశీలించారు. అందులో పేర్కొన్న మొత్తం కంటే వాస్తవంగా బ్యాంకు ద్వారా చెల్లించిన మొత్తం తక్కువగా ఉంది. అంటే.. చందాదారులను ఆ చిట్‌ఫండ్స్ సంస్థ మోసం చేస్తోందని వెల్లడైంది.
- చిట్‌ఫండ్ చట్టంలో పేర్కొన్న రికార్డులను జగజ్జనని చిట్‌ఫండ్స్ నిర్వహించడంలేదు. అలాగే, చట్టంలో పేర్కొన్న వార్షిక బ్యాలన్స్ షీట్ పార్ట్–1, పార్ట్–2లనూ సమర్పించడంలేదు.

అడ్డం తిరిగిన అప్పారావు..

తనను అరెస్టు చేసేందుకు వీల్లేదంటూ సీఐడీ అధికారులతో ఆదిరెడ్డి అప్పారావు వాదనకు దిగారు. జీఎస్టీ ఎగవేత విషయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ చర్యలను నియంత్రిస్తూ గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను చూపుతూ తనను అరెస్టు చేయడం అన్యాయమని వాదించారు. దీంతో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. ఆయనకు సీఐడీ అధికారులు స్పష్టతనిచ్చి అరెస్టుచేశారు.

సీఐడీ కార్యాలయం వద్ద హైడ్రామా

టీడీపీ నేతలు ఆదిరెడ్డి అప్పారావు, శ్రీనివాస్‌ల అరెస్టు నేపథ్యంలో రాజమహేంద్రవరం సీఐడీ కార్యాలయం వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. టీడీపీ శ్రేణులు ఒక్కసారిగా పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. రాజమహేంద్రవరంలో జరగబోయే మహానాడును అడ్డుకునేందుకే ఇలాంటి చర్యలకు దిగుతున్నారని మాజీమంత్రి జవహర్ విమర్శించారు. అప్పారావు, శ్రీనివాస్‌ను అన్యాయంగా అరెస్టుచేశారని మాజీ హోం మంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వ్యాఖ్యానించారు. సీఐడీ కార్యాలయంలో భర్త, మామను ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ పరామర్శించారు.

అనుమతి లేకుండా ఆఫీసులు

రాజమహేంద్రవరంలోని వీఎల్ పురం, తిలక్ రోడ్డులోని డోర్ నంబర్ 79/2–4/3 చిరునామాతో చిట్‌ఫండ్ కార్యాలయం నిర్వహించేందుకు జగజ్జనని చిట్‌ఫండ్స్ అనుమతి తీసుకుంది. కానీ, అనుమతి లేకుండా 86–26–13/1 తిలక్ రోడ్డు చిరునామాతో ఉన్న భవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తోంది. దీనిపై చిట్ రిజిస్ట్రార్‌కు ఎలాంటి సమాచారం కూడా ఇవ్వలేదు. అలాగే, జగజ్జనని చిట్‌ఫండ్స్ రాజమహేంద్రవరంలో చిట్‌ఫండ్ వ్యాపారం నిర్వహించేందుకు అనుమతి తీసుకుంది. అందుకు విరుద్ధంగా కాకినాడ జగన్నాథపురంలో అనధికారికంగా మరో బ్రాంచి కార్యాలయాన్ని నిర్వహిస్తోంది. ఇది ఖాతాదారులను మోసం చేయడమే అవుతుంది.

మార్గదర్శిలో కొనసాగుతున్న సీఐడీ సోదాలు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు ఆదివారం కూడా సోదాలు కొనసాగించారు. మొత్తం 37 బ్రాంచీల్లో సోదాలు చేశారు. రికార్డులను పరిశీలించిన అధికారులు.. నిధుల అక్రమ మళ్లింపు, అక్రమ లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. రికార్డుల నిర్వహణపై సంబంధిత బ్రాంచి మేనేజర్లను ప్రశ్నించడంతో పాటు ఫోరెన్సిక్ ఆడిట్‌ను కొనసాగించారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	39.4	26.2
కడప	38.7	26.4
కర్నూలు	37.4	24.4
విశాఖపట్నం	37.2	24.2
మార్కాపురం	37.0	25.0
నెల్లూరు	35.9	28.5
ఏలూరు	35.0	27.0
విజయనగరం	35.0	27.0
శ్రీకాకుళం	35.0	24.0
విజయవాడ	34.0	25.0
తిరుపతి	32.0	25.0

క్లుప్తంగా...

విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు

విజయవాడ విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం

విమానాశ్రయం(గన్నవరం): ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా విజయవాడ (గన్నవరం) విమానాశ్రయంలో ఆదివారం పలు విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. మధ్యాహ్నం రెండున్నర గంటల తర్వాత ఆకాశం పూర్తిగా మేఘావృతమై వర్షం మొదలైంది. దీంతో విమానాలు రన్‌వేపై ల్యాండింగ్‌కు అవసరమైన విజిబులిటీ లేకపోవడంతో హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం సుమారు అరగంటకుపైగా గాలిలోనే చక్కర్లు కొట్టింది. అనంతరం బెంగళూరు, షిర్డీ నుంచి వచ్చిన విమానాలకు కూడా ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. తర్వాత వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో మూడు విమానాలు సురక్షితంగా రన్‌వేపైకి ల్యాండ్ కావడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

కర్నూలు(అర్బన్)/ఎమ్మిగనూరు: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. ఆయన పాదయాత్ర ఆదివారం కర్నూలు జిల్లా ముగతి గ్రామం నుంచి ఎమ్మిగనూరు వరకు కొనసాగింది. ఎస్సీ, వాల్మీకి సామాజికవర్గ నాయకులు, కాంట్రాక్టు లెక్చరర్లతో లోకేశ్ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.33 వేల కోట్లు దారి మళ్లించారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే చర్మకారులు, డప్పు కళాకారులకు పెన్షన్లు ఇస్తామని చెప్పారు. రాయలసీమలోని వాల్మీకులను మాత్రమే ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం తప్పుడు తీర్మానం చేసిందని, సత్యపాల్ కమిటీ నివేదిక మేరకు వాల్మీకులకు న్యాయం చేస్తామన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లకు సకాలంలో వేతనాలు అందించి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నియోజకవర్గంలో క్యాష్ కేశవరెడ్డిగా మారాడని, ఆయన కుమారుడు, అల్లుడు దోపిడీ బ్రాంచ్‌లు ఏర్పాటు చేశారన్నారు. కడిమెట్లలో 100 ఎకరాల అటవీ భూములను కబ్జా చేశారని, చెన్నకేశవస్వామి మాన్యం భూములు 30 ఎకరాలు స్వాహా చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు.

బిలియనీర్లు C/O బుల్లి పట్టణాలు



దేశవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్ల సంపద దాటిన వారి సంఖ్య 1,103

వీరిలో 178 మంది బిలియనీర్లు చిన్న పట్టణాల నుంచే

- వారి సంపద విలువ రూ.6,37,800 కోట్లు
- రాష్ట్రంలోని నాలుగు పట్టణాల్లో ఆరుగురు బిలియనీర్లు
- విశాఖలో ముగ్గురి ఆస్తుల విలువ రూ.7,100 కోట్లు
- విజయవాడ, భీమవరం, తిరుపతిలలో ఒక్కొక్కరు
- ఐఐఎఫ్‌ఎల్ హూరన్ ఇండియా రిచ్ లిస్ట్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: సంపద సృష్టిలో చిన్న పట్టణాలు పెద్ద నగరాలతో పోటీపడుతూ తగ్గేదేలేదంటున్నాయి. దేశవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లకు పైగా సంపద కలిగిన వారిలో 178 మంది చిన్న పట్టణాల్లోనే నివసిస్తున్నట్టు ఐఐఎఫ్‌ఎల్ హూరన్ ఇండియా రిచ్ లిస్ట్–2022 నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లపైగా సంపద కలిగిన వారు 1,103 మంది ఉండగా.. అందులో 178 మంది చిన్న పట్టణాలకు చెందిన వారేనని వెల్లడించింది. ఈ 178 మంది కలిసి రూ.6,37,800 కోట్ల సంపదను సృష్టించారు. అత్యధికంగా గుజరాత్‌లో 38 మంది బిలియనీర్లు చిన్న పట్టణాల్లో ఉంటే.. తమిళనాడులో 29 మంది బిలియనీర్లు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు పట్టణాల్లో ఆరుగురు బిలియనీర్లు ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. చిన్న పట్టణాల్లో అత్యధికంగా గుజరాత్‌లోని సూరత్‌లో 19 మంది బిలియనీర్లు నివసిస్తున్నారు. ఈ 19 మంది కలిసి రూ.51 వేల కోట్ల సంపద సృష్టించారు. ఆ తర్వాత తమిళనాడులోని కోయంబత్తూర్‌లో 14మంది కలిసి రూ.38,200 కోట్ల సంపద కలిగి ఉన్నారు. రాజస్థాన్‌లోని రాజ్‌కోట్‌లో ఏడుగురు, పంజాబ్‌లోని లుథియానాలో ఏడుగురు బిలియనీర్లు ఉన్నారు. నగరాల్లో చూస్తే ఒక్క ముంబైలోనే అత్యధికంగా 283 మంది బిలియనీర్లు నివసిస్తున్నారు. ఆ తర్వాత స్థానంలో ఢిల్లీలో 185 మంది, బెంగళూరులో 89 మంది బిలియనీర్లు నివసిస్తున్నారు. హైదరాబాద్‌లో 64 మంది, చెన్నైలో 51 మంది బిలియనీర్లు నివసిస్తున్నారు.

మన రాష్ట్రంలో ఆరుగురు

మన రాష్ట్రం విషయానికి వస్తే.. విశాఖలో అత్యధికంగా ముగ్గురు బిలియనీర్లు ఉన్నారు. ఆ ముగ్గురి సంపద విలువ రూ.7,100 కోట్లు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో రూ.వెయ్యి కోట్ల సంపదతో ఒకరు, విజయవాడలో రూ.3,600 కోట్ల సంపద కలిగిన ఒకరు, తిరుపతిలో రూ.2,800 కోట్ల సంపదతో ఒకరు ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.

పట్టణాల్లో సూరత్.. త్రిసూర్

సంపద విలువ పరంగా చూస్తూ సూరత్, త్రిస్సూర్, కోయంబత్తూర్ పట్టణాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. సూరత్‌లో 19 మంది బిలియనీర్లు రూ.51 వేల కోట్ల సంపదను కలిగి ఉంటే త్రిస్సూర్‌లో నలుగురు బిలియనీర్లు రూ.40 వేల కోట్ల సంపద కలిగి ఉన్నారు. కోయంబత్తూర్‌లో 14 మంది రూ.38,200 కోట్ల సంపదను, హరిద్వార్‌లో ఒకరే రూ.32,400 కోట్ల సంపదను కలిగి ఉన్నారు. కేరళలోని పట్టణాల్లో బిలియనీర్ల సగటు సంపద విలువ ఇతర రాష్ట్రాల కంటే అత్యధికంగా ఉంది. ఎర్నాకుళంలో నలుగురు కలిసి రూ.18,800 కోట్లు, కొట్టాయంలో ఒకరే రూ.8,600 కోట్లు, తిరువనంతపురంలో ముగ్గురు కలిసి రూ.10,800 కోట్ల సంపద కలిగి ఉన్నారు.

టాప్ 5 పట్టణాల్లో ఇలా..

పట్టణం	బిలియనీర్ల సంఖ్య	సంపద విలువ (రూ.కోట్లలో)
సూరత్	19	51,000
కోయంబత్తూర్	14	38,200
లూథియానా	7	29,700
రాజ్‌కోట్	7	16,000
ఆగ్రా	6	6,500

మెంటార్లు యుద్ధవీరులుగా పనిచేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా 1,000 మంది రైతు శాస్త్రవేత్తల తయారీకి రంగం సిద్ధం
- రైతు సాధికారసంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్



మాట్లాడుతున్న విజయకుమార్

సాక్షి, అమరావతి/కొరిటెపాడు(గుంటూరు): పులివెందులలో ఏర్పాటుచేసిన ఇండో–జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకోలాజికల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (ఐజీజీఏఏఆర్‌ఎల్) ద్వారా రానున్న నాలుగేళ్లలో 1,000 మంది రైతు శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకువెళ్తున్నామని రైతు సాధికారసంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వ్యవసాయ కాలుష్యం తగ్గించి పర్యావరణంలో సమూల మార్పులు తీసుకువచ్చే క్రమంలో మెంటార్లు యుద్ధవీరులుగా మారాలని సూచించారు. గుంటూరులోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం మెంటార్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మెంటార్ ప్రకృతి వ్యవసాయంలో సంపూర్ణ అవగాహన పొంది వాతావరణ మార్పుల సమయంలో కీలకపాత్ర పోషించాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రైతు శాస్త్రవేత్తలకు మెంటార్లు అందుబాటులో ఉంటూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా విస్తరించి ఆదర్శవంతమైన మోడళ్లను తయారు చేయాలని సూచించారు. రైతు సాధికారసంస్థ సీనియర్ కన్సల్టెంట్లు మురళీధర్, డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తల కోర్సు 4 సంవత్సరాల 2 నెలలు ఉంటుందని, ఈ కోర్సు పూర్తయ్యేనాటికి రైతు శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉంటారని చెప్పారు. రైతు సాధికారసంస్థ ప్రతినిధులు జాకీర్ హుస్సేన్, ధర్మేంద్ర, విశ్వేశ్వరరావు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెంటార్లు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'కు బీజేపీ నేతలు

సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం 100వ ఎపిసోడ్‌ను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర శాఖ ఆదివారం పలుచోట్ల ప్రత్యక్ష ప్రసారాలకు ఏర్పాట్లు చేసింది. మచిలీపట్నంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి, మంగళగిరిలో చేనేత కార్మికులతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు 'మన్ కీ బాత్'ను వీక్షించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, భీమవరం, ఏలూరు, కర్నూలు, అనంతపురం, ఒంగోలు తదితర ప్రాంతాల్లో పలువురు నేతలు పాల్గొన్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

గ్రంథాలయాల్లో సైటేషన్‌కు గడువు పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పౌర గ్రంథాలయాల్లో సైటేషన్ కోసం రచయితలు, ప్రచురణకర్తల నుంచి పుస్తకాలను ఆహ్వానిస్తూ ఇచ్చిన గడువును పొడిగిస్తున్నట్టు గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. తొలుత ఏప్రిల్ 26లోగా పుస్తకాల కాపీలను పంపించాలని కోరగా.. రచయితలు, ప్రచురణకర్తలు సకాలంలో అందించలేదు. అయితే కొందరు రచయితలు, ప్రచురణకర్తల విజ్ఞప్తి మేరకు మే 15 వరకు గడువును పెంచారు.

శిఖరాగ్ర మండలి భేటీకి కేంద్రం కసరత్తు

- కృష్ణా, గోదావరి బోర్డుల గెజిట్ నోటిఫికేషన్ల అమలే అజెండా
- కేంద్రం ఆదేశాల మేరకు ఈ నెల 10న కృష్ణా బోర్డు సర్వసభ్య సమావేశం

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ల అమలే ప్రధాన అజెండాగా శిఖరాగ్ర మండలి (అపెక్స్ కౌన్సిల్) మూడో సమావేశం నిర్వహించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. తక్షణమే కృష్ణా, గోదావరి బోర్డుల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి ఏపీ, తెలంగాణ ఉన్నతాధికారులతో చర్చించి.. అపరిష్కృత అంశాలపై నివేదిక ఇవ్వాలని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఇటీవల ఆదేశించారు. ఈ నేపథ్యంలో మే 10న కృష్ణా బోర్డు, ఆ తర్వాత గోదావరి బోర్డు సర్వసభ్య సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఈ సమావేశాల్లో చర్చించిన అంశాల ఆధారంగా ఇరు బోర్డులు ఇచ్చే నివేదికను బట్టి అపెక్స్ కౌన్సిల్ తుది అజెండాను కేంద్రం ఖరారు చేయనుంది. తుది అజెండా ఖరారయ్యాక ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, కేసీఆర్‌తో చర్చించి.. వారి వీలును బట్టి మే నెల చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నిర్ణయించారు.

తెలంగాణ అడ్డుపుల్ల వేయడంతో..

రాష్ట్రాల విభజన నేపథ్యంలో కృష్ణా, గోదావరి జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చూసేందుకు 2014లో కృష్ణా, గోదావరి బోర్డులను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ.. వీటి పరిధిని ఖరారు చేయకపోవడంతో రెండు బోర్డులకు ఎలాంటి అధికారాలు లేకుండా పోయాయి. దాంతో వివాదాలు సద్దుమణగడం లేదు. శ్రీశైలానికి 2021 జూన్‌లో వరద ప్రవాహం రాకున్నా కృష్ణా బోర్డు అనుమతి లేకుండా తెలంగాణ సర్కార్ విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు నీటిని వదిలేయడం వల్ల కృష్ణా జలాలు కడలి పాలయ్యాయి. ఏపీ హక్కులను తెలంగాణ హరిస్తుండటంతో బోర్డుల పరిధిని నిర్దేశించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దాంతో బోర్డులు ఏర్పాటైన ఏడేళ్ల తర్వాత 2021 జూలై 15న వాటి పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ నోటిఫికేషన్లు ఆరు నెలల్లోగా అంటే 2022 జనవరి 15నాటికే అమల్లోకి రావాల్సి ఉంది. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లలో అవుట్‌లెట్లను బోర్డు పరిధిలోకి తెచ్చేందుకు తొలుత రెండు రాష్ట్రాలు అంగీకరించినా.. ఆ తర్వాత తెలంగాణ అడ్డం తిరిగింది. గోదావరి బేసిన్‌లో శ్రీరాంసాగర్ నుంచి సీతమ్మసాగర్ వరకూ అన్ని ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తుండగా.. పెద్దవాగును మాత్రమే తీసుకోవాలని తెలంగాణ సర్కార్ కోరుతోంది. అనుమతి లేని ప్రాజెక్టులకు అనుమతి కోసం రెండు రాష్ట్రాలు కృష్ణా, గోదావరి బోర్డులకు డీపీఆర్‌లను సమర్పించాయి. గోదావరిలో నీటి లభ్యత తేల్చి, రెండు రాష్ట్రాలకు వాటాను తేల్చే వరకూ తెలంగాణ ప్రాజెక్టుల డీపీఆర్‌లను పరిశీలించవద్దని ఏపీ ప్రభుత్వం ఇటు గోదావరి బోర్డుకు, అటు కేంద్ర జల్ శక్తి శాఖకు విజ్ఞప్తి చేసింది. కానీ.. ఈ సమస్యలు అపరిష్కృతంగా ఉండటం, రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో గెజిట్ నోటిఫికేషన్ల అమలును మరో ఆరు నెలలు అంటే 2022 జూలై 15 వరకూ కేంద్రం పొడిగించింది. ఆ గడువు కూడా ముగిసిపోయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు కన్పించలేదు. ఈ నేపథ్యంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించి.. గెజిట్ నోటిఫికేషన్లను అమలు చేయడం ద్వారా జల వివాదాలకు ముగింపు పలికేందుకు అపెక్స్ కౌన్సిల్ మూడో సమావేశాన్ని నిర్వహించేందుకు కేంద్రం సిద్ధమైంది.

టీడీపీ నేతల వీరంగం

▶ మొదటి పేజీ తరువాయి

వెంచర్ వేశారు. దీంతో స్థానిక టీడీపీ నేతలు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డిలు బీటెక్ రవిని పిలిపించుకుని వెంచర్‌ను ట్రాక్టర్‌తో దున్నేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వందల మంది టీడీపీ కార్యకర్తలు మారణాయుధాలతో బీభత్సం సృష్టించారు. ఈ విషయం తెలుసుకున్న రామయ్య, రమణ, సుబ్బయ్య వెంచర్ వద్దకు వచ్చే సరికి అందరూ వెళ్లిపోయారు. దీంతో వారు చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్కే వ్యాలీ, వేంపల్లె, పులివెందుల రూరల్, అర్బన్ సీఐలు గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, బాలమద్దిలేటి, రాజు, చక్రాయపేట ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

కేసు నమోదు చేస్తాం: సీఐ గోవిందరెడ్డి

నాగలగుట్టపల్లె వద్ద వెంచర్‌ను దున్నివేసిన ఘటనపై బీటెక్ రవి, మహేశ్వరరెడ్డితోపాటు మరి కొందరిపై తమకు ఫిర్యాదు అందిందని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఘటనలో ఎవరెవరు పాల్గొన్నారో విచారించి కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



'అన్నం మానండి, సాయంత్రం చపాతీ తినండి, ఉదయం మిల్లెట్స్ బెటర్..' మధుమేహంతో బాధపడే వారికి ఇలాంటి సూచనలు, సలహాలు సాధారణమే. అయితే వేర్వేరు ఆహారపు అలవాట్లు ఉన్న రోగులందరికీ ఒకే రకమైన డైట్ చార్ట్ సరైనదేనా? అంటే కానేకాదు అంటున్నారు వైద్య నిపుణులు. ప్రాంతాల వారీగా, జీవనశైలులకు అనుగుణంగా కస్టమైజ్డ్ (కావలసిన విధంగా) డైట్ చార్ట్ రూపొందించాల్సిందే అంటున్నారు. దీని కోసం దేశవ్యాప్తంగా విస్తృత అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. ఇందులో వేలాదిగా వైద్యులు, రోగులు భాగం పంచుకోనున్నారు.

అలవాట్లకు అనుగుణంగా ఆహారం

- ప్రాంతాల వారీగా ఆహార అలవాట్లు, జీవనశైలి పరిగణనలోకి..
- ట్రాన్స్‌కల్చరల్ డయాబెటిస్ న్యూట్రిషన్ ఆల్గోరిథమ్ దిశగా అడుగులు
- టైప్ 2 డయాబెటిస్, ప్రీడయాబెటిస్‌లకు గొప్ప ఉపశమనం!

మధుమేహ రోగులకు కస్టమైజ్డ్ డైట్ ప్లాన్ ఉండాలంటున్న నిపుణులు

ఒకే రకమైన డైట్ చార్ట్ సరికాదని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: 'మన దేశపు ఆహారపు అలవాట్లలో ఉన్న విస్తృతమైన వ్యత్యాసాల కారణంగా, మధుమేహాన్ని నియంత్రించడానికి అందరికీ ఒకే రకంగా సరిపోయే డైట్ చార్ట్ లేదని తాజాగా పరిశోధకులు తేల్చారు. దీని ఫలితంగానే ట్రాన్స్‌కల్చరల్ డయాబెటిస్ న్యూట్రిషన్ అల్గోరిథం (టీడీఎన్‌ఏ) పుట్టింది..' అని చక్కెర వ్యాధి నిపుణులు డాక్టర్ ఒసామా హమీద్, పోషకాహార నిపుణులు డాక్టర్ ఇర్ఫాన్ షేక్ చెప్పారు. ఈ టీడీఎన్‌ఏపై అవగాహన కార్యక్రమాలకు రాష్ట్రంలో శ్రీకారం చుట్టిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీఎన్‌ఏ అనేది టైప్ 2 డయాబెటిస్, ప్రీడయాబెటిస్‌లకు గొప్ప ఉపశమనంగా మారుతుందని వీరు పేర్కొన్నారు.

ప్రాంతాల వారీగా...

వివిధ ప్రాంతాల ప్రజల విభిన్న ఆహారపు అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాలను అధ్యయనం చేసి ఆయా ప్రాంతాల్లోని రోగుల్లో మధుమేహ నియంత్రణకు అవసరమైన ఆహారపు అలవాట్లను (ఆహార ప్రణాళిక) సూచించేదే టీడీఎన్‌ఏ. ఈ ఆల్గోరిథమ్‌ను రూపొందించడానికి, భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ, పశ్చిమ, మధ్య, తూర్పు, ఈశాన్య జోన్లుగా విభజించారు. ఆయా ప్రాంతాల ఆహారపు అలవాట్లు పరిగణనలోకి తీసుకుని మధుమేహానికి పరిష్కారాలు అన్వేషించాలనేది ఈ విభజన ఉద్దేశం.ఉదాహరణకు.. కేరళలోని తక్కువ ఆదాయ వర్గాల్లో ఎక్కువగా కనిపించే మధుమేహానికి కారణం.. వీరు ఎక్కువ కార్బోహైడ్రేట్, తక్కువ ప్రోటీన్ తీసుకోవడమట. ఆ ప్రాంతంలో కాసావా (కర్ర పెండలం) ఎక్కువగా తీసుకుంటారు. ఈ కాసావా ప్రోటీన్ ద్వారా కాలేయంలో శరీరానికి తగ్గట్టుగా ఫిల్టర్ కావాలి. అయితే శరీరంలో ఉన్న తక్కువ స్థాయి ప్రోటీన్ల కారణంగా ఇది జరగడం లేదు. ఇది ప్యాంక్రియాస్ (క్లోమ గ్రంథి)లో కాల్షియం ఏర్పడటానికి, అంతిమంగా మధుమేహానికి దారి తీస్తోందని తేల్చారు. ఇలాంటి పలు అధ్యయన ఫలితాల నేపథ్యంలో ప్రాంతాల వారీ డైట్ చార్ట్ (టీడీఎన్‌ఏ) తయారీ ఆవశ్యకత ఏర్పడింది.

అందరూ చేయాల్సిందిదే...

చక్కెర వ్యాధి పెరగడానికి ప్రధాన కారణాల్లో.. ప్రోటీన్లతో పోలిస్తే కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం, ఫాస్ట్ ఫుడ్ అధిక వినియోగం వంటివి ఉన్నాయి. ఈ నేపథ్యంలో మధుమేహులు టీడీఎన్‌ఏ పాటించడంతో పాటు ఆహారాన్ని నిదానంగా తీసుకోవడం, అర్ధరాత్రి అత్యధిక కేలరీలతో కూడిన ఆహార వినియోగాన్ని తగ్గించడం, ఎక్కువగా ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్‌లను మానేయడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం లాంటివి తప్పకుండా చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

మధుమేహం విస్తృతి తెలంగాణలో ఎక్కువ

ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) నివేదిక ప్రకారం, గత మూడు దశాబ్దాలుగా దేశంలో మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య 150% పెరిగింది. ఇక తెలంగాణ రాష్ట్రంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల విస్తృతి 16.6% కాగా, ముంబై (7.5%), చెన్నై (13.5%), బెంగళూరులో 11.7% మేర పెరుగుదల ఉంది. డయాబెటిస్ నియంత్రణలో లేకపోతే పెరిగిన గ్లూకోజ్ స్థాయిలు గుండె జబ్బులు, దృష్టి లోపం, మూత్రపిండాల రుగ్మతలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. మధుమేహం నియంత్రణలో జీవనశైలిలో మార్పులదే కీలక పాత్ర. అలాగే ప్రత్యేకమైన పోషకాహార సప్లిమెంట్స్ కూడా చాలా అవసరం.

– డాక్టర్ ఇర్ఫాన్ షేక్, మెడికల్ అఫైర్స్ హెడ్ అబాట్ న్యూట్రిషన్

నియంత్రణే ముఖ్యం..

మధుమేహులు దశాబ్దాలుగా కొనసాగిస్తూ వస్తున్న ఆహారపు అలవాట్లను మానుకుని ఆరోగ్యకరమైన ఆహారం వైపు మళ్లక తప్పదు. అయితే దీనికి కట్టుబడి ఉండే రేటు 38% కంటే తక్కువ. ఈ నేపథ్యంలో రోగుల జీవనశైలి, ఆహారపు అలవాట్ల చరిత్రకు అనుగుణంగా రూపొందించే ప్రత్యేకమైన ఆహార జాబితాయే టీడీఎన్‌ఏ. బరువు తగ్గడం, గ్లైసెమిక్ నియంత్రణ, నిర్వహణలో ఇది రోగికి తోడ్పడుతుంది

– డాక్టర్ ఒసామా హమీద్, మెడికల్ డైరెక్టర్ జోస్లిన్ డయాబెటిస్ సెంటర్

మన దగ్గర రైస్ వినియోగమే సమస్య

డయాబెటిస్ నియంత్రణలో డైట్ అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంత మాత్రాన అందరికీ చపాతీ/పుల్కా తినేయమని చెప్పేయడం కుదరదు. తరతరాలుగా, ప్రాంతాల వారీగా అనుసరిస్తున్న ఆహారపు అలవాట్లను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు మన దగ్గర రైస్ బాగా తీసుకుంటారు. సాధారణ అన్నం లాగే కాకుండా బిర్యానీ, పులిహోర తదితరాల రూపంలో కూడా రైస్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. తద్వారా కార్బోహైడ్రేట్స్ ఎక్కువ అవుతున్నాయి. దీనిని తగ్గించడం/నియంత్రించడానికే డైట్ ప్లాన్‌ను ఇస్తుంటాం. ఉదాహరణకు అన్నం మానలేమనేవారికి పరిమాణం తగ్గించమని, రాత్రి పడుకునే ముందు తినే అలవాటున్నవారికి 7 గంటల కల్లా ముగించమని చెబుతుంటా. ఉదయం పూట ఎక్కువమంది ఇడ్లీ తీసుకుంటారు. కానీ మేం ఇడ్లీ, దోశ బదులు పెసరట్టు తినమంటాం. కాదు కూడదనే ఇడ్లీ ప్రియులకు.. ఇడ్లీ పిండిలో చిక్కుళ్లు, పెసలు, కేరట్ తురుము, రాజ్ మా గింజలు... వంటివి కలుపుకో మంటాం. తద్వారా కార్బ్స్ శాతాన్ని తగ్గించడం, ప్రోటీన్, ఫైబర్‌ని పెంచడానికి ప్రయత్నిస్తాం.

– డా.పద్మనాభ వర్మ, కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్,

వేసవి సెలవుల్లో 'వియ్ లవ్ రీడింగ్'

వేసవిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖ కార్యాచరణ

- నేటి నుంచి జూన్ 10 వరకు వివిధ కార్యక్రమాలు
- విద్యార్థులను టీచర్లు దత్తత తీసుకుని వారిలో పఠనాసక్తి పెంచాలి
- వివిధ స్థాయిలలో విద్యార్థులు, టీచర్లకు పోటీలు



సాక్షి, అమరావతి: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పఠనాసక్తిని పెంపొందించుకుని అదనపు పరిజ్ఞానాన్ని ఆర్జించేలా 'వియ్ లవ్ రీడింగ్' కార్యక్రమాన్ని అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఇందుకోసం విద్యార్థులను సమాయత్తం చేయనుంది. దీనిపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ విడుదల చేశారు. మే 1 నుంచి జూన్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యాశాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీఈవోలు, డీవైఈవోలు, ఎంఈవోలను ఆదేశించారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి వారి వినూత్న వ్యూహాలను రూపొందించాలన్నారు.


కార్యక్రమం ఇలా..

- ▲ ప్రధానోపాధ్యాయుడు పాఠశాల స్థాయిలో సిబ్బందితో సమావేశం నిర్వహించాలి.
- ▲ పాఠశాలలో అందుబాటులో ఉన్న లైబ్రరీ వనరులను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి.
- ▲ పాఠశాలలోని విద్యార్థులందరినీ ఉపాధ్యాయులు సమానంగా దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాలి. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు దత్తత తీసుకున్న విద్యార్థులతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలి.
- ▲ పుస్తకాలను తరగతుల వారీగా విభజించి లైబ్రరీలో ప్రదర్శించాలి. ప్రతి విద్యార్థికి వారి పఠన సామర్థ్యం ఆధారంగా 5 నుండి 10 పుస్తకాలు ఇవ్వాలి. ఆ పుస్తకాల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలి.
- ▲ వేసవి సెలవుల్లో ఇంటివద్ద ఆ పుస్తకాలను చదివేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. విద్యార్థి ఏదైనా హాలిడే ట్రిప్‌నకు వెళ్తే.. ఆ పుస్తకాలను వెంట తీసుకువెళ్లి అక్కడ చదివేలా సూచనలు ఇవ్వాలి.
- ▲ విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దల భాగస్వామ్యం ఉండేలా చూడటంతో పాటు వారి సూచనలతో కథలను చదివేలా చూడాలి.
- ▲ వాట్సాప్ గ్రూప్‌ను లీడ్ చేసే టీచర్ గ్రూప్‌లో రోజూ ఒక కథనాన్ని పోస్ట్ చేసి దత్తత తీసుకున్న విద్యార్థులను కథను చదవమని అడగాలి. తదుపరి ఆ కథపై విద్యార్థుల వ్యాఖ్యలను వారు రాసిన ఇతర కథనాలను వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయమని సూచించాలి.
- ▲ విద్యార్థులు పరస్పరం వారి కథల పుస్తకాలను మార్పిడి చేసుకునేలా చూడాలి. సమీపంలోని పబ్లిక్ లైబ్రరీని సందర్శించి అక్కడి పుస్తకాలు చదివేలా చూడాలి.
- ▲ ఆయా పుస్తకాల్లోని అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలు రాసేలా సూచనలు ఇవ్వడంతో పాటు వాటిలోని పాత్రలు, సందర్భాలు, ఘటనల గురించి వారి సొంత ఆలోచనలను అడగాలి.
- ▲ మిత్రులు, బంధువులతో వారు చదివిన పుస్తకాల గురించి వాటి ప్రాముఖ్యత గురించి చర్చించేలా సూచనలు ఇవ్వాలి.
- ▲ పాత వార్తా పత్రికలు, మ్యాగజైన్లను సేకరించి నోట్‌బుక్కులలో అతికించి ఆల్బమ్‌గా రూపొందించేలా చూడాలి. చదివిన పుస్తకాలపై నా సొంత మాటలు పేరిట అభిప్రాయాలు రాయించాలి.
- ▲ నా స్టోరీ బ్యాంక్ పేరిట వారితో వివిధ మ్యాగజైన్లలోని కథలను సేకరించి ఒకచోట చేర్చేలా చర్యలు తీసుకోవాలి. నా పుస్తకం పేరిట విద్యార్థి తన సొంత భావాలను చిత్రాలను రాస్తూ పుస్తకాన్ని రూపొందించేలా చూడాలి. ఈ పుస్తకాలను స్కూళ్లు తెరిచిన రోజున ప్రదర్శించాలి.



విద్యార్థులు, టీచర్లకు కథలపై పోటీలు

ఈ వేసవి సెలవుల్లో పఠనాభిలాషను పెంచడంతోపాటు విద్యార్థులు, టీచర్లలో ఉత్సాహాన్ని రేకెత్తించేందుకు వీరికి పోటీలు కూడా నిర్వహించేలా విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. మొదటి స్థాయిలో 3వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు కథా పఠన పోటీలు ఉంటాయి. విద్యార్థి ఏదైనా కథను ఎంచుకుని ఆ కథను చదువుతూ రికార్డు చేయవచ్చు. 2వ స్థాయిలో 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు పోటీ ఉంటుంది. ఈ తరగతుల విద్యార్థులు సొంతంగా ఏదైనా కథను రాసి స్కాన్ చేసి పంపాలి. 3వ స్థాయిలో 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పోటీలు ఉంటాయి. వీరికి కథారచనలతో పాటు రివ్యూ రైటింగ్ పోటీలు ఉంటాయి. ఇదే స్థాయిలో నా వ్యక్తిగత లైబ్రరీ సెల్ఫీ పోటీలు ఉంటాయి. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులు తమ ఇంట్లో చదవడానికి ఉన్న పుస్తకాలను జాబితాను రూపొందించి లైబ్రరీగా వాటిని భద్రపరచి సెల్ఫీ తీసుకుని పంపాలి. డ్రాయింగ్ పోటీలను కూడా 3వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులకు ఉంటాయి. విద్యార్థులు ఏ4 సైజు పేపర్‌పై డ్రాయింగ్ వేసి పంపాలి. టీచర్లకు పోటీలను నిర్వహిస్తారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, డైట్‌లలో పనిచేసే టీచర్లందరూ వీటికి అర్హులే. విద్యకు సంబంధించిన క్లాసిక్ సాహిత్యాన్ని ఎంచుకుని సమీక్ష చేసి దాని సాఫ్ట్ కాపీని పంపాలి. ఈ కార్యక్రమాలన్నీ ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.



చీకటికి భయపడే పిల్లాడిని మనం సులభంగా క్షమించవచ్చు; నిజమైన విషాదం ఎప్పుడంటే వెలుగును చూసి పెద్దవాళ్లు భయపడటం!

– ప్లేటో

సాక్షి

సోమవారం, 1 మే 2023

శ్రమో నమః

వందల కోట్ల చేతులు ప్రపంచమనే ఈ మహాయంత్రాన్ని పని చేయిస్తున్నాయి. పని అంటే కర్మ. కాలగతిలో కర్మ శబ్దం ఆ ప్రాథమికార్థపు నేల విడిచి విధిలిఖితమనే తాత్వికార్థపు గగనసీమను తాకింది. మనుగడకు అవసరమైన సాధారణ కర్మల స్థాయిని దాటి మతపరమైన తంతులతో సహా ఇతరేతర అర్థాలకు విస్తరించింది. కర్మలో శ్రమ ఉంటుంది, శ్రమలో కర్మ ఉంటుంది. రెండూ అన్యోన్యాశ్రితాలు. మళ్ళీ ప్రపంచాన్నే ఒక యాంత్రిక మహాశకటమనుకుంటే, దానిని ముందుకు నడిపించేది కోట్లాది జనాల శ్రమ ఇంధనమే. పుట్టిన ప్రతిజీవీ అంతో ఇంతో కర్మయోగే. అందరికీ వందనం.

వేదం కర్మవాదమే. అందులో కర్మ గురించిన ఉగ్గడింపే ఆద్యంతం వ్యాపించి ఉంటుంది. వేదకాలపు కర్మభావనలో హెచ్చుతగ్గుల వింగడింపు లేదు; దేవతలు, మనుషులన్న తారతమ్యం లేదు. సూర్యచంద్రులు, ఉషస్సు, అగ్ని సహా అందరూ క్రమం తప్పకుండా తమ విధ్యుక్త కర్మలను నిర్వహించవలసిందే. ఇంద్రుడు కర్మ చేతనే గొప్పవాడయ్యాడంటుంది వేదం. అతని చేతి వేళ్ళు అనేక వేల కర్మలను చేస్తూ ఉంటాయి. ఆహార పచనం, దేవతలకు హవ్యాన్ని అందించడంతో సహా అగ్ని బహువిధ కర్మదక్షుడు. అగ్నిని అనేక విధాలుగా వినియోగంలోకి తెచ్చిన కార్మిక నిపుణులు అంగిరసులు. సర్వకర్మకుశలురైన పుత్రపౌత్రులు కావాలని వేదజనం కోరుకుంటారు. కర్మనిరతిని ప్రకృతితో ముడిపెట్టి వేదం అందంగా చెబుతుంది. ''మనుషుల్లారా! నిద్రలేవండి, చీకట్లు తొలిగాయి, మన దేహాలకు ప్రాణం వచ్చింది, ఉష ఉదయించి సూర్యుని రాకను ప్రకటించింది, అన్నం సమృద్ధిగా దొరికే చోటుకి వెడదాం పదండి'' అని ఒక ఋక్కు చెబుతుంది. ఉష ఉదయించి మీ మీ వృత్తి వ్యాపారాల వైపు మిమ్మల్ని జాగృతం చేస్తోందని మరో ఋక్కు అంటుంది.


''జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి, సహస్ర వృత్తుల సమస్త చిహ్నా''ల స్మరణ ఆధునిక మహాకావ్యంలోనే కాదు; కవిత్వానికే ఆదిమమైన వేదంలోనూ కనిపిస్తుంది. త్వష్ట నిపుణుడైన లోహకార్మికుడు... స్వర్ణమయమై, వేయి అంచులు కలిగిన వజ్రాయుధాన్ని నిర్మించి ఇంద్రునికి ఇచ్చాడు. దేవతలతో సమానమైన గౌరవాన్ని పొందాడు. ఋభులనే అన్నదమ్ములు మానవులైనా లోహవిద్యలో త్వష్టను మించిన ప్రావీణ్యం చూపి దేవతలయ్యారు. మరుత్తులనే దేవతలు ప్రవాహానికి అడ్డుపడిన ఓ పర్వతాన్ని బద్దలుకొట్టి నీటికి దారి చేశారు. అశ్వినులు మనువుకి విత్తనాలిచ్చి వ్యవసాయం చేయించారు; వైద్యం చేసి ఎంతోమందికి ఆరోగ్యాన్ని, ఆయుష్షును ఇచ్చారు. క్షురకుడు కేశఖండన చేసినట్లుగా ఉష చీకట్లను ఉత్తరిస్తోందని ఒక ఋక్కు అంటుంది.

శ్రమ ఉచ్చమా, న్యూనమా అని చూడకుండా; శ్రామికుల మధ్య హెచ్చుతగ్గుల తేడా తేకుండా శ్రమను మాత్రమే గౌరవించిన దశ అది. ఇంద్రాదులు సమాజానికి ఏదో ఒక మేలు చేసే సేవకులు కనుకనే దేవతలయ్యారు. వేదకాలంలో అలాంటి సేవకులను పన్నెండుగురిని గుర్తించి పన్నిద్దరు ఆయగార్లు అన్నారు. శారీరక శ్రమను తక్కువ చేసి మేధోశ్రమను ఆకాశానికి ఎత్తడం ఆనాటికి లేదు. తిథివారనక్షత్రాలు చూసే వ్యక్తి కన్నా మృతపశువుల చర్మాన్ని ఒలిచే చర్మకారునికి ఎక్కువ ప్రతిఫలం ముట్టిన కాలం అది. కర్మ, కర్మఫలం రెండూ ఆనాడు సాముదాయికమే. చెరువుల వంటి నిర్మాణాలలో రాజు, రాజుగారి భార్యా కూడా మట్టితట్టలు మోసిన ఉదాహరణలు పురాచరిత్రలో కనిపిస్తాయి. అది పోయి చాకిరొకరిది, సౌఖ్యమొకరిదైన తర్వాతే పరిస్థితి తలకిందులైందని పండితులంటారు. అందరూ అన్నిరకాల పనులూ చేయడం పోయి వృత్తి విభజన రావడంతోనే వృత్తుల మధ్య, వ్యక్తుల మధ్య చిన్నా పెద్దా తారతమ్యాలూ పొటమరించాయి. ఇష్టపూర్వక కర్మ నిర్బంధకర్మగా మారి దుఃఖదాయిని అయింది. అప్పుడు కూడా వృత్తి నైపుణ్యంలో ఆనందాన్ని, తృప్తిని అనుభవించే అవకాశం ఎంతోకొంత ఉండేది. వృత్తిదారులు పారిశ్రామిక యంత్రంలోని పరికరాలుగా మారిపోవడంతోనే అదీ పోయింది. ఈ మార్పును కొడవటిగంటి కుటుంబరావు ఒక కథలో అద్భుతంగా చిత్రీకరిస్తారు.

ప్రకృతి సమవర్తి. శ్రుతిమించిన అసమానతలను ఆట్టే కాలం సహించదు, ఎప్పటికైనా కత్తెర వేసి సమతుల్యతను తెస్తుంది. అడుగంటిన శ్రమ విలువను, గౌరవాన్ని, తగిన ప్రతిఫలాన్ని ఉద్ధరించే ప్రయత్నం ఆధునిక కాలంలోనే మళ్ళీ ఊపందుకుంది. 'శ్రమ నిష్ఫలమై, జన నిష్ఠురమై నూతిని గోతిని వెదికే కార్మిక వీరుల కన్నుల నిండా కణకణమండే విలాపాగ్నులకు, గలగల తొణికే విషాదాశ్రులకు ఖరీదు కట్టే షరాబులు' ఉద్భవించారు. ఏ ఒకడి ఆస్తిహక్కైనా శ్రమపునాది మీదే ఆధారపడుతుందని జాన్ లాక్ అనే ఆర్థికవేత్త నొక్కిచెప్పి శ్రమకు తిరిగి పట్టం కట్టాడు. ఆడమ్ స్మిత్ అనే మరో ఆర్థికవేత్త విలువకు మూలం శ్రమేనన్నాడు. దాని ఆధారంగా డేవిడ్ రికార్డో అనే మరో ఆర్థికవేత్త శ్రమవిలువ సిద్ధాంతాన్ని ముందుకుతెచ్చాడు. కార్ల్ మార్క్స్ తాత్వికతకు అదే సారవంతమైన వనరు అయింది. శ్రమ విలువను తిరిగి గుర్తించడమే జరిగింది కానీ శ్రామికుని బతుకు బండి ఇంకా పూర్తిగా పట్టాలకెక్కలేదు. 'ఉందిలే మంచి కాలం ముందు ముందునా' అన్న కవి ఆకాంక్ష నెరవేరే రోజు ముందుకు జరుగుతూనే ఉంది. అయినా మనిషి నిత్య ఆశాజీవి కదా!

శ్రమజీవులకు జేజేలు!

సందర్భం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

మే 1వ తేదీని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే)గా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. కానీ అమెరికాలో మాత్రం దీన్ని 'లాయల్టీ డే'గా వ్యవహరిస్తారు. మే డే కార్మికుల హక్కులకు ప్రతీక. 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవ ఫలితంగా అమె రికా, యూరప్ దేశాలలో అనేక భారీ పరిశ్రమలు స్థాపించారు. ఆ పరిశ్రమ లలో కనీస సౌకర్యాలు లేకుండా రోజుకు 16–18 గంటలు కార్మికులతో గొడ్డు చాకిరీ చేయించుకునేవారు. దీనిని నిరసిస్తూ 1886 మేలో చికాగోలోని 'హే మార్కెట్'లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు బీజం వేసింది. తొలిసారిగా 1884లో రోజుకి 8 గంటలు మాత్రమే పని ఉండా లని కార్మికులు ఆందోళన ప్రారంభించారు. ఈ ఆందోళన 1886 నాటికి తారస్థాయికి చేరింది. 1886 మే 1న 40 వేల మంది కార్మికులు సమ్మె మొదలుపెడితే 3 మే నాటికి ఈ సంఖ్య లక్ష మందికి చేరుకుంది. సమ్మె ఉద్ధృతమయ్యేసరికి యాజమాన్యాలు పోలీసుల సాయం కోరి కార్మికులపైకి ఉసి గొల్పాయి. ఈ సమయంలో కార్మికులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించారు. దీంతో అగస్ట్ స్పైస్, పార్సన్స్, క్లోరిన్ మోస్ట్, లూయీస్ లింగ్ అనే కార్మిక నాయకుల ఆధ్వర్యంలో 'మెక్కార్మిక్ రీపర్ వర్క్' సంస్థ ముందు పెద్ద ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన మీద పోలీసులు మే 4న తిరిగి జరిపిన కాల్పుల్లో 8 మంది మరణించారు. 40 మంది గాయపడ్డారు. తర్వాతి రోజుల్లో గాయపడిన వారిలో మరో ఏడుగురు చనిపోయారు. ఈ కాల్పులకు కార్మిక నాయకులే కారణమని వారి మీద హత్యానేరం మోపి అరెస్ట్ చేశారు. కోర్టులు పార్సన్స్, స్పైస్, ఎంగెల్, ఫిషర్లకు ఉరిశిక్ష అమలు చేశాయి. దీనిని వ్యతిరేకిస్తూ కార్మిక నాయకుడు లూయీస్ లింగ్ తన నోటిలో బాంబు పెట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ జరిగాయి. 1890, మే 1న బ్రిటన్‌లోని 'హైడ్ పార్క్'లో చేపట్టిన ప్రదర్శనకు దాదాపు 3 లక్షలమంది కార్మికులు హాజరయ్యారు. రోజులో 8 గంటలు మాత్రమే పనివేళలు ఉండాలన్నదే ఆ ప్రదర్శనలో పాల్గొన్నవారి ప్రధాన డిమాండ్. ఆ పైన అనేక ఐరోపా దేశాల్లో ఇదే నినాదంతో ప్రదర్శనలు జరిగాయి. క్రమంగా చికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. ఆపై ప్రపంచవ్యాప్తంగా మే డే స్వరూపం మారుతూ వచ్చింది. పలు దేశాల్లో ఆ రోజున పోరాటాలూ, నిరసన ప్రదర్శనలూ చేపట్టడం పరిపాటైంది.

24 గంటలలో 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, ఇంకా 8 గంటలు రిక్రియేషన్ అన్నవి ఈ పోరాటం ద్వారా సాధించుకున్నారు. ఇది పారిశ్రామిక యుగం ఏర్పడిన తర్వాత జరిగిన అతిపెద్ద మార్పు.

నిజానికి భారతదేశంలో చికాగో కంటే ముందే కలకత్తాలో కార్మికులు నిర్దీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్లో 1862లో సమ్మెచేశారు. 1923లో తొలిసారిగా భారత్‌లో 'మే డే'ను పాటించారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటంతో అప్పటి నుంచే కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. ఈ చైతన్యంతో 'మే డే'ను పాటిస్తున్నారు.

స్వాతంత్ర్యానంతరం ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలించిన పార్టీలు, నేతలు ఎందరో ఉన్నారు. వీరిలో చాలామంది కార్మికుల సంక్షేమాన్ని అంతో ఇంతో పట్టించుకున్నారు. కానీ తెలుగుదేశం అధినేత చంద్రబాబు మాత్రం కార్మికులను పూర్తిగా విస్మరించారని చెప్పక తప్పదు. ఈమాట ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే 2014 ఎన్నికలకు ముందు ఎన్నికల మేనిఫెస్టోలో 600కు పైగా హామీలు ఇస్తే అందులో 100 వరకు కార్మికులకు సబంధించిన హామీలున్నాయి. వీటిలో కనీసం పట్టుమని 10 హామీలు కూడా నెరవేర్చని ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. ఓట్లకోసం మాత్రమే వారిని దగ్గరకు తీసుకున్న ఆయన మేకవన్నె పులిలా ఎన్నికల అనంతరం కార్పొరేట్ రంగానికి కొమ్ము కాస్తూ వారి సంక్షేమాన్ని పూర్తిగా మరిచారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2019లో ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తూ వస్తున్నారు. అందులో కార్మికులకు పెద్ద పీట వేస్తున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా అయిన వెంటనే పారిశుద్ధ్య కార్మికులకు రూ. 7,500 ఉండే వేతనాలను ఏకంగా రూ. 18,500కు పెంచారు. అంతేకాకుండా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వంటి క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ చెమటోడ్చి పనిచేసే వారిపై దృష్టిసారించి వారిని తగిన విధంగా ఆదుకున్నారు.

కార్మికుల జీవితాల్లో పూర్తిగా మార్పు తీసుకొస్తూ 'నవరత్నా'ల పేరుతో వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేలా సీఎం జగన్ విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టారు. ఆటో, సొంత వాహనాలు కలిగిన వారికి ఏటా రూ. 10 వేలు అందజేస్తూ వారికి చేయూతనిస్తున్నారు. ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు రూ. 10 వేల వంతున వడ్డీ లేని రుణాలిస్తున్నారు. దర్జీలు, నాయీ బ్రాహ్మణులు, రజకులు ఇలా అన్ని వర్గాల వారికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందజేస్తున్నారు. ఇక 'మత్స్యకార భరోసా', 'నేతన్న నేస్తం', 'చేయూత' వంటి పథకాలతో కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. కార్మిక బీమా ప్రవేశపెట్టి పరిహారాన్ని రెట్టింపు చేశారు. ఇలా కార్మిక వర్గానికి అన్ని విధాలా మేలు చేశారు జగన్. అందుకే కార్మిక పక్షపాతిగా నిలిచిన సీఎం జగన్ పక్షాన నిలిచేందుకు కార్మికవర్గం నడుంబిగించింది.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ । 98481 05455

చదువుపై ఇష్టం.. రామోజీకి కష్టం!

విద్యారంగం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.54వేల కోట్ల ఖర్చు

- చరిత్రలో లేని రీతిలో సంస్కరణలు.. ప్రతి రూపాయి లబ్ధిదారుకే చేరేలా ఏర్పాట్లు
- చంద్రబాబు ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసినా 'ఈనాడు' ప్రశంసలే
- ఇంటర్ విద్య పూర్తిగా బాబు బినామీల చేతుల్లోనే... అయినా పెన్నెత్తని రామోజీ
- ఇప్పుడు ప్రభుత్వ విద్య బలోపేతమవుతూ పేదలకు మేలు జరుగుతుంటే ఆక్రోశం
- తమ ప్రయోజనాలు ఏమవుతాయోననే భయంతో విష ప్రచారం

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థ కొత్త చరిత్రవైపు అడుగులేస్తోంది. 'నాడు–నేడు'తో స్కూళ్ల రూపురేఖలు మారుతున్నాయి. అమ్మ ఒడి నుంచి మొదలుపెడితే జగనన్న విద్యా కానుక వరకూ అన్ని పథకాలూ చదువుపై ఇష్టం పెంచుతున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో విద్య అంటే ప్రేమగా దగ్గరకెళ్లే పరిస్థితులు వచ్చాయి. ఇదో గొప్ప ముందడుగు. కొత్త చరిత్ర. ఫలితాలు కూడా మొదలయ్యాయి.

కానీ...

రెండు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను రాక్షసంగా నలిపేసిన తెలుగుదేశం మాఫియాకు ఇదెంతమాత్రమూ రుచించటం లేదు. విద్యా వ్యవస్థను అడ్డం పెట్టుకుని విషసర్పాలుగా ఎదిగిన చంద్రబాబు నాయుడి బినామీల పని అయిపోతున్నదనే భయం ఎల్లో ముఠాను వణికిస్తోంది. ఫలితమే... కొద్దిరోజులుగా 'ఈనాడు' పత్రికలో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై వస్తున్న నెగెటివ్ కథనాలు. జూనియర్ కాలేజీలు పెట్టారు తప్ప సౌకర్యాలను పట్టించుకోలేదని ఒకనాడు... ప్రభుత్వ స్కూళ్లలో ఉత్తీర్ణతలు అంతంతమాత్రమేనని మరోనాడు... ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఇంకోనాడు... ఇలా రోజుకొక విష గుళికను పాఠకుల మెదళ్లలో వేస్తున్నారు రామోజీరావు!. ఏం? రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ విద్యను ప్రయివేటు మాఫియా చేతుల్లో పెట్టిందెవరు? విశాలమైన ప్రాంగణాల్లో ఉన్న జూనియర్ కాలేజీలను పరాధీనం చేసిందెవరు? కార్పొరేట్ మాఫియా చేతుల్లో విద్యార్థుల తలరాతల్ని పెట్టింది చంద్రబాబు నాయుడు కాదా? విద్యార్థులపై ఒత్తిడిని పెంచి వారి ఆత్మహత్యలకు కారణమవుతున్నది అదే కార్పొరేట్ మాఫియా కాదా? వారిలో నారాయణ వంటివారు చంద్రబాబు బినామీలు కారా? అంటే ఈ ఆత్మహత్యలకు బాధ్యుడు చంద్రబాబు కాదా? ఎందుకీ దౌర్భాగ్యపు కథనాలు? ఎందుకీ విషపు రాతలు? మీ మాఫియా మనగలిగే రోజులు పోతున్నాయనా? మీ రాతలింకా జనం నమ్ముతున్నారనే అనుకుంటున్నారా రామోజీరావు గారూ??

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకముందు వరకు... అంటే 2019 వరకు 10వ తరగతి విద్యార్థుల్లో 65 శాతం మంది ప్రభుత్వ స్కూళ్లలో చదువుతుండగా ప్రయివేటు స్కూళ్లలో 35 శాతం వరకు ఉండేవారు. కానీ ఇంటర్మీడియెట్‌కు వచ్చేసరికి అది పూర్తిగా తారుమారయ్యేది. ఇంటర్ విద్యార్థుల్లో కేవలం 25 శాతం మంది ప్రభుత్వ కాలేజీల్లో ఉండగా... 75 శాతం మందిది ప్రయివేటు కాలేజీల బాటే. 1996లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు నాటి నుంచి మెల్లగా తన బినామీ కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ కాలేజీలను ఏర్పాటు చేయకుండా ప్రయివేటు కాలేజీలే విద్యార్థులకు దిక్కయ్యేలా చేశారు. రాష్ట్రంలో మొత్తం 3,600 వరకు జూనియర్ కాలేజీలుండగా అందులో 290 మాత్రమే ప్రభుత్వ కాలేజీలు. మిగతావన్నీ ప్రయివేటువే. దీన్నిబట్టే చంద్రబాబు ప్రయివేటు రంగానికి ఏ స్థాయిలో మేలు చేశారో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సరైన సదుపాయాలు కల్పించక... అక్కడ చదివితే భవిష్యత్తు ఉండదన్న భావనను ప్రజల్లో ఏర్పడేలా చేసి వాటిని నిర్వీర్యపరిచారు. దీంతో టెన్త్ పాసైన ప్రతి ఒక్కరూ కార్పొరేట్ కాలేజీలనే ఆశ్రయించాల్సిన దుస్థితి. అక్కడేమో లక్షల్లో ఫీజులు... అడ్డగోలు దోపిడీ!!.

ఏది నిజం?

ఈ పరిస్థితి మారాలనుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... పునాది స్థాయి నుంచే వ్యవస్థను బలోపేతం చేసేలా ఫౌండేషన్ విద్యకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే వాతావరణం ఉండేలా వాటిని వేలకోట్ల రూపాయలతో 'నాడు–నేడు' పేరిట సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిస్తున్నారు. మరోవైపు నాణ్యమైన విద్య అందేలా కరిక్యులమ్‌లోనూ సంస్కరణలు తెచ్చారు. ఊహించని స్థాయిలో వేలకోట్ల రూపాయలతో విద్యాభివృద్ధి కార్యక్రమాలు మొదలెట్టారు.

ఫలితాన్నిచ్చిన పథకాలు...

ప్రభుత్వ విద్యను మెరుగు పరిచేందుకు... పాఠశాలలపై ఇష్టం పెంచేందుకు అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, పాఠ్యాంశాల సంస్కరణలు, మరుగుదొడ్ల నిర్వహణ నిధి, పాఠశాల నిర్వహణ నిధి వంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ స్కూళ్లకు పరిమితమైన ఇంగ్లీషు మీడియాన్ని ఎన్నో న్యాయపోరాటాలను కూడా తట్టుకుని అమల్లోకి తెచ్చారు. డిజిటల్ విద్యకూ శ్రీకారం చుట్టారు. వీటిల్లో కొన్ని పథకాలు విద్యా రంగ పరిస్థితులను సమూలంగా మార్చాయి. అవొక్కసారి చూస్తే...

జీఈఆర్ పెంచిన అమ్మ ఒడి

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2018లో, ప్రాథమిక విద్యలో ఆంధ్రప్రదేశ్ జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) 84.48. జాతీయ సగటు 99.21తో పోలిస్తే ఇది తక్కువ. పిల్లల చదువుకు తల్లిదండ్రుల పేదరికం అడ్డురాకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని తెచ్చారు జగన్. ఈ పథకం కింద ప్రతి తల్లి/సంరక్షకుడికి ఏటా రూ.15 వేలు అందిస్తున్నారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం రూ.19,617.6 కోట్లు ఇలా తల్లుల ఖాతాల్లో జమ చేసింది. పిల్లల్ని స్కూళ్లకు పంపించడానికి ఇస్తున్న ఈ సాయంతో... ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, సెకండరీ స్థాయిల్లో జీఈఆర్ గడిచిన మూడేళ్లుగా గణనీయంగా పెరిగింది.

నిపుణులు మెచ్చిన 'విద్యా కానుక'

పాఠశాలల్లో పిల్లల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం విద్యార్థులకు కిట్ల రూపంలో బోధన–అభ్యాస సామగ్రిని అందిస్తోంది. ప్రతి విద్యార్థి కిట్‌లో ఒక స్కూల్ బ్యాగ్, స్టిచింగ్ ఛార్జీతో కూడిన 3 జతల యూనిఫారాలు, ఒక బెల్ట్, ఒక జత షూ, రెండు జతల సాక్స్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు ఇంగ్లీష్– తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఉంటోంది. గడిచిన మూడేళ్లుగా రూ.2,323.99 కోట్లు ఖర్చు చేసి ఏడాదికి 47 లక్షల మంది చొప్పున పిల్లలకు 'కిట్లు' అందించింది. స్కూళ్లు మొదలైన ఆరు నెలలకు కూడా అందరికీ పుస్తకాలు అందని గత మెక్కడ? ఆరంభమయ్యేనాటికే బుక్స్‌తో సహా బ్యాగులు, యూనిఫామ్, షూతో స్కూళ్లకు వెళుతున్న విద్యార్థులున్న ప్రస్తుతమెక్కడ? ఏ కొంచెమైనా పోలిక ఉందా? ఇంతటి నవశకాన్ని కనీసం ప్రశంసించని రామోజీరావును ఏమనుకోవాలి? ఇందులో కూడా రంధ్రాలు వెదికి... కొందరి బ్యాగులు పాడయ్యాయని, కొందరికి షూలు పెద్దవయ్యాయని పతాకస్థాయి కథనాలు రాసే నీచపు పాత్రికేయాన్ని ఏం చేయాలి? ఇలాంటివేవీ చేయకున్నా అధికారంలో చంద్రబాబు ఉంటే ఆహా ఓహో అనే రామోజీరావును అసలు మనిషనుకోవచ్చా?

అది.. ఆడపిల్లల గౌరవం

సీఎం స్వయంగా చొరవ తీసుకుని... ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయించారు. గడిచిన రెండేళ్లుగా రూ.874 కోట్లు ఈ నిధికి జమయ్యాయి. చదువుకునే పిల్లలు టాయిలెట్ల కోసం ఇళ్లకు వెళ్లే పరిస్థితులు ఉండకూడదని, ఆ విషయంలో వారు ఎలాంటి ఇబ్బందులు పడకూడదన్నది సీఎం జగన్ ఉద్దేశం. అందుకే గతంలో అధ్వాన్నంగా ఉండి, శిథిలమైపోయిన టాయిలెట్ల స్థానంలో కొత్తవి నిర్మించటం, మరమ్మతులు చేయించటంతో పాటు... వాటికి రన్నింగ్ వాటర్ ఉండేలాంటి ఏర్పాట్లూ చేశారు. వాటి నిర్వహణ కోసం 44,748 స్కూళ్లలో 47,277 మంది ఆయాలను సైతం ఏర్పాటు చేశారు. ఒక్కో ఆయాకు నెలకు రూ.6 వేలు చెల్లిస్తున్నారు. దీనికోసం రూ.442 కోట్లతో స్కూల్ నిర్వహణ నిధిని (ఎస్ఎంఎఫ్) ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యారంగంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటివరకు చేసిన ఖర్చు, లబ్ధిపొందిన వారు

పథకం	లబ్ధిదారులు	ఖర్చు (రూ.కోట్లలో)
జగనన్న అమ్మఒడి	44,48,865	19,617.53
జగనన్న విద్యా దీవెన	24,74,544	8,365.26
జగనన్న వసతి దీవెన	18,77,863	3,349.57
జగనన్న గోరుముద్ద	43,26,782	3,117.44
జగనన్న విద్యా కానుక	47,32,065	2,324.00
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	34,19,875	4,895.00
8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు	5,18,740	685.87

అమ్మ ఒడి కింద ఏటా అందించిన నిధులు, లబ్ధిదారుల మొత్తం ఇలా

ఏడాది	లబ్ధిదారులు	తల్లులు	నిధులు (రూ.కోట్లలో)
2019-20	81,72,224	42,33,098	6,349.6
2020-21	83,76,020	44,48,865	6,673.4
2021-22	82,06,302	42,62,419	6,393.6

జగనన్న గోరుముద్ద పథకం నిధులు, విద్యార్థులు

ఏడాది	విద్యార్థులు	నిధులు(రూ.కోట్లలో)
2020-21	42,34,322	648.10
2021-22	47,32,064	789.21
2022-23	45,14,687	886.69
2023-24	43,10,165	1,042.53 (ప్రతిపాదన)

హాజరు పెంచిన 'గోరుముద్ద'



ప్రభుత్వ స్కూళ్లలోని పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనంపై సీఎం జగన్ ఎంతశ్రద్ధ పెట్టారంటే... వారికి అందించే భోజనం మెనూను స్వయంగా తానే మార్పు చేయించారు. ఎందుకంటే... కడుపు నిండితేనే చక్కని చదువు కూడా వంటబడుతుందన్నది ఆయన మాట. స్వయంగా తానే మెనూ తయారు చేయించి... 'జగనన్న గోరుముద్ద' పేరిట రోజుకోరకమైన ఆహారాన్ని అందించేలా చేశారు. వారానికి ఐదు గుడ్లు, రోజూ చిక్కీలతో పాటు ఇటీవల బ్రేక్‌ఫాస్ట్‌గా రాగి జావను కూడా అందించేలా చర్యలు తీసుకున్నారు. వీటికి ప్రభుత్వం ఏటా రూ.1,800 కోట్లు వెచ్చిస్తోంది. గుడ్లు నిల్వ చేయడానికి రిఫ్రిజిరేటర్లు, ఫ్రీజర్‌లను అందించాలని కూడా ఆలోచిస్తోందంటేనే సర్కారు చిత్తశుద్ధి అర్థమవుతుంది.

ఆత్మవిశ్వాసం పెంచిన ఇంగ్లీషు మీడియం

ఇంగ్లీషు విద్య అందరికీ అందాలన్నది సీఎం కల. దాన్ని అడ్డుకోవటానికి చంద్రబాబు, ఆయన ఎల్లో ముఠా, కార్పొరేట్ మాఫియా కలిసి రకరకాలుగా చేసిన పోరాటాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు జగన్. ప్రభుత్వ చిత్తశుద్ధి ఫలితంగా అమల్లోకి వచ్చిన ఇంగ్లీషు మీడియం విద్య... రాష్ట్రంలో ఎన్నో స్కూళ్లలో విద్యార్థుల మాట తీరునే మార్చేసింది. ప్రపంచంలో ఎక్కడైనా తాము పోటీపడగలమన్న ఆత్మ విశ్వాసాన్ని వారిలో అణువణువునా నింపింది. అంతేకాదు! ఉన్నత ప్రమాణాలు, బోధనా పద్ధతులు ఉత్తమ మూల్యాంకన విధానానికి వీలుగా ప్రభుత్వ స్కూళ్ల దశల వారీగా సీబీఎస్ఈకి అనుసంధానమయ్యేలా చర్యలు చేపట్టింది ప్రభుత్వం. ఇప్పటికే 1,000 పాఠశాలల్లో సీబీఎస్ఈకి శ్రీకారం చుట్టింది కూడా. సీబీఎస్ఈ సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)–హైదరాబాద్, రివర్‌సైడ్ లెర్నింగ్ సెంటర్ (ఆర్ఎల్‌సీ)– అహ్మదాబాద్, సహకారంతో టీచర్లకు శిక్షణ ఇచ్చారు. హిందూ గ్రూప్‌తో కలిసి టీచర్లు స్టాండర్డ్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీలో (ఎస్టీఈపీ) శిక్షణ పొందారు. ఇవన్నీ కార్పొరేట్ స్కూళ్ల మనుగడనే ప్రశ్నిస్తుండటం... రామోజీ ఎదుర్కొంటున్న అసలు సమస్య.

పోటీపడేలా చేసిన 'నాడు-నేడు'

'మన బడి నాడు– నేడు' పేరిట ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టిపెట్టారు ముఖ్యమంత్రి జగన్. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ఉన్న 44,703 స్కూళ్లలో తొలిదశ కింద 15,715 పాఠశాలల్లో రూ.3,669 కోట్లతో పనులు పూర్తిచేయించారు. నాడు–నేడు 2వ దశలో రూ.4,100 కోట్లతో 17,500 స్కూళ్లలో పనులు చేయిస్తున్నారు. ఇవి రాబోయే విద్యా సంవత్సరానికల్లా అందుబాటులోకి వస్తాయి. మిగిలిన స్కూళ్లలో 'నాడు–నేడు' పనులన్నీ ఆ తరువాతి విద్యా సంవత్సరంలో అందుబాటులోకి వస్తాయి. కొంచెం ఖాళీ స్థలం కూడా లేకుండా ఇరుకిరుకు భవనాల్లో నడిపిస్తున్న కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా విశాలమైన ప్రాంగణాల్లో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న స్కూళ్లపై విద్యార్థులకెంత ఇష్టం పెరగిందంటే... సీట్లు లేవు అని స్కూళ్లకు బోర్డులు పెట్టేంతగా!. ఇదొక్కటి చాలు ఈ సంస్కరణల ఫలితమేంటో చెప్పడానికి.



డిజిటల్ లెర్నింగ్... కొత్త చరిత్ర



కోవిడ్‌తో ప్రపంచవ్యాప్తంగా పిల్లలు దెబ్బతిన్నారు. అభ్యసన స్థాయిలు దిగజారాయి. అందుకే విద్యార్థులకు గూగుల్ రీడ్ ఎలాంగ్ పీఏఎల్, బైజూస్ తదితర మార్గాల్లో చదువులను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న 4 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు బైజూస్ పాఠ్యాంశాలను అందుబాటులోకి తెచ్చారు. 2022–23లో 8వ తరగతి విద్యార్థులకు, వారికి బోధన చేసే టీచర్లకు ప్రభుత్వం రూ.686 కోట్లతో 5.18 లక్షల ట్యాబులను అందించింది. ఈ ఏడాది కూడా 8వ తరగతిలోకి వచ్చేవారికి రూ.750 కోట్లతో ట్యాబులు అందించనుంది. ప్రతి ఏటా ఇలా 8వ తరగతిలో ఇచ్చే ట్యాబులు వారికి 10వ తరగతి వరకూ డిజిటల్ లెర్నింగ్‌కు పనికొస్తాయి. తరవాత ఇంటర్మీడియెట్ ఎలాగూ అందుబాటులో ఉంటుంది. అంటే... కార్పొరేట్ స్కూళ్లలో సైతం వేలకు వేలు అదనపు ఫీజులు కడితే తప్ప అందని ట్యాబులు, బైజూస్ వంటి ఎడ్యుటెక్ దిగ్గజ సంస్థ పాఠాలు ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ఉచితంగానే అందుతున్నాయి. తద్వారా వారికి ఏ స్థాయిలోనైనా పోటీపడే సామర్థ్యం వస్తోంది.

వినూత్నంగా డిజిటల్ తరగతులు...

పాఠశాలలన్నిటా 6వ తరగతి నుంచి పైతరగతుల్లో ప్రతి తరగతి గదికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, అంతకన్నా కింది తరగతులకు స్మార్ట్ టీవీలను ప్రభుత్వం ఏర్పాటుచేయిస్తోంది. మనబడి నాడు–నేడు... తొలిదశ పూర్తయిన 15,715 స్కూళ్లలో రూ.352.32 కోట్ల అంచనాతో 10,038 స్మార్ట్ టీవీలు, 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి వచ్చే ఈ డిజిటల్ తరగతులతో పిల్లలకు నాణ్యమైన ఈ–కంటెంట్... దాని ద్వారా అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తాయి. దీనికోసం విద్యా సమీక్షా కేంద్రాన్ని (కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్) కూడా ఏర్పాటుచేస్తోంది. 4 నుంచి 10వ తరగతి వరకు ఉన్న 32 లక్షల మంది విద్యార్థులకు బైజూస్ ఈ–కంటెంట్‌ను ఉచితంగా అందుబాటులోకి తేవటంతో... స్కూలు ముగిశాక విద్యార్థులకు వారి ఇళ్లలోనే సందేహాల నివృత్తికి ఇది ఉపయోగపడుతోంది.

మారిన పాఠ్యాంశాలు... పెరిగిన ప్రమాణాలు

ప్రభుత్వం 2020–21 నుండి పాఠ్యాంశాల్లో అనేక సంస్కరణలు తెచ్చింది. 1 నుంచి 7 తరగతుల పాఠ్యపుస్తకాల్లో ఫలితాలొచ్చే పాఠ్యాంశాలపై దృష్టి సారించి మార్పులు చేయించింది. ప్రస్తుత కాలానికి అవసరమైన నైపుణ్యాలను పొందడమే లక్ష్యంగా 8, 9 తరగతులకు ఎన్సీఈఆర్టీ సిలబస్ పుస్తకాలు అందుబాటులోకి తెచ్చింది. సులభంగా అర్థం చేసుకునేలా పాఠ్యపుస్తకాలన్నిటినీ రెండు భాషల్లో (ఇంగ్లీషు– తెలుగు, హిందీ–తెలుగు మాదిరి) ఉండేలా అందిస్తోంది. పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా 3 నుండి 10 తరగతుల విద్యార్థులకు సబ్జెక్ట్ ఉపాధ్యాయుల ద్వారా బోధనను అందిస్తున్నారు. ఆయా సబ్జెక్ట్‌లలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పాఠాలు చెబితే పిల్లల్లో ప్రమాణాలు మెరుగవుతాయనేది ప్రభుత్వ యోచన. ఇవన్నీ ఫలితాలనిస్తుండటమే... ప్రయివేటు విద్యా రంగ మాఫియాను కొమ్ముకాస్తున్న ఎల్లో ముఠాకు నచ్చటం లేదు.

మండలానికి రెండు కాలేజీలు.. అందులో ఒకటి బాలికలకే

తెలుగుదేశం హయాంలో ఉన్నవి మూతపడ్డాయి తప్ప ఒక్క ప్రభుత్వ జూనియర్ కాలేజీ కూడా రాలేదు. విశాలమైన స్థలాలతో ఉండే ప్రభుత్వ జూనియర్ కాలేజీలు పరాధీనమైపోయాయి. కార్పొరేట్ల జెండా పైపైకి ఎగిరింది. చదివించే స్తోమత లేనివారు మగపిల్లలనైతే అప్పులు చేసి కాలేజీల్లో చేర్పించటం... ఆడపిల్లలనైతే చదువు మాన్పించటం చేసేవారు. దీంతో టెన్త్ తరువాత బాలికలు డ్రాపవుటవ్వడం పెరిగింది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రతి మండలంలో రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలుండాలని సీఎం జగన్ నిర్ణయించారు. ఇందులో ఒకటి హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి కాలేజీగా మార్చటం ద్వారా చేయాలనుకున్నారు. రెండు కాలేజీల్లో ఒకటి బాలికలకే. దీనివల్ల హైస్కూల్‌లో ఉత్తీర్ణులైన బాలికలందరూ తమ విద్యను కొనసాగించడానికి వీలుంటుందన్నది సీఎం జగన్ ఉద్దేశం. ఇందులో భాగంగా 292 ఉన్నత పాఠశాలల్ని బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. మొత్తం 352 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్లస్2ను ప్రవేశపెట్టారు. 2022–23 నుండి 14 కో–ఎడ్ జూనియర్ కాలేజీలనూ బాలికల జూనియర్ కళాశాలలుగా మార్చారు. ఇలా మొత్తం 679 మండలాలలో రెండేసి జూనియర్ కాలేజీలుండేలా చేస్తున్నారు. విచిత్రమేంటంటే... అసలు కాలేజీలే లేనప్పుడు రామోజీరావు ఒక్క అక్షరం కూడా రాయలేదు. ఇలా కాలేజీలు ఏర్పాటు చేసినపుడు మంచి చర్యంటూ ఒక్క కథనమూ వేయలేదు. కానీ కొన్ని కాలేజీల్లో ఫలితాలు బాగా రాలేదంటూ మాత్రం ఓ కథనాన్ని అచ్చేసేశారు. అదీ.. 'ఈనాడు' అంటే.

విద్యారంగ పథకాలకు రూ.54వేల కోట్ల ఖర్చు..

ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో ప్రవేశపెట్టిన పథకాలపై ఇప్పటివరకు రూ.54,023 కోట్లు వెచ్చించింది. చరిత్రలో ఎన్నడూ ఇంతటి భారీ మొత్తాన్ని విద్యపై ప్రభుత్వాలు ఖర్చు చేయలేదు. తరగతి గదుల కొరతను దృష్టిలో ఉంచుకొని 'నాడు నేడు' కింద జూన్ నాటికి 24వేల అదనపు గదుల నిర్మాణాన్ని చేపట్టారు. 'నాడు నేడు' రెండు, మూడు దశలు కూడా పూర్తయితే ప్రభుత్వ స్కూళ్లు కాలేజీల్లో విద్యార్థులకు, టీచర్లకు అవసరమైన సదుపాయాలన్నీ అందుబాటులోకి వస్తాయి. ఈ అంశాలే... రామోజీ ముఠాకు భవిష్యత్తుపై కునుకు లేకుండా చేస్తున్నాయి.

కేజీబీవీలను నిర్లక్ష్యం చేసింది చంద్రబాబే...

చంద్రబాబు హయాంలో కేజీబీవీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. అనాథ, నిరుపేద అణగారిన వర్గాలకు చెందిన బాలికలకు విద్యనందించే ఈ సంస్థలకు కనీస నిధులు కూడా ఇవ్వలేదు నాటి ప్రభుత్వం. ఇక్కడ 6 నుంచి 10 వరకే తరగతులుండడంతో... ఆ చదువు పూర్తిచేసిన వారికి పై చదువులకు ఆస్కారం ఉండేదికాదు. డ్రాపవుట్ అయ్యేవారు. చంద్రబాబు వీటిని పట్టించుకుంటే ఒట్టు!. రాష్ట్రంలో 352 కేజీబీవీలు ఉండగా వాటిలో 84,923 మంది బాలికలు చదువుతున్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక దశలవారీగా మొత్తం 321 కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. సిబ్బంది ఖాళీలను చంద్రబాబు అలాగే వదిలేయగా గడిచిన మూడున్నరేళ్లలో 1,377 పోస్టులను భర్తీ చేశారు. ఇంటర్మీడియెట్‌ను దృష్టిలో పెట్టుకొని అదనంగా గెస్టు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో అధ్యాపకులను అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఈ విద్యార్థినులకు సరైన సదుపాయాలు లేవు. ఈ ప్రభుత్వం వీరికి జగనన్న విద్యాకానుక కింద అన్నీ సమకూరుస్తోంది. ఇక వీరికి హాస్టల్‌తో కూడిన చదువులు అందిస్తున్నా.. వీరి తల్లులకోసం అమ్మ ఒడినీ అందిస్తుండడం విశేషం. అమ్మ ఒడి ద్వారా 2020–21లో 55వేల మందికి, 2021–22లో 67వేల మందికి, 2022–23లో 84వేల మందికి రూ.15వేల చొప్పున రూ.312.80 కోట్ల లబ్ధి చేకూరింది. కాకుంటే రామోజీరావు మాత్రం ఈ వాస్తవాలేవీ చెప్పరు. విషపు రాతలే అచ్చేస్తారు. అదే పాఠకుల దౌర్భాగ్యం.

క్లుప్తంగా...

తిరుపతమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి


వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రవీంద్రబాబుకు ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కారు డోర్ లాక్ పడి చిన్నారి మృతి

- కాకినాడ జిల్లా కోలంక గ్రామంలో ఘటన


అఖిలాండేశ్వరి మృతదేహం

యానాం: కారు డోర్ లాక్ పడడంతో చిన్నారి మృతి చెందిన విషాద ఘటన కాకినాడ జిల్లా కాజులూరు మండలం కోలంక గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. యానాం ఎస్‌ఐ శేరు నూకరాజు కథనం ప్రకారం.. కోలంక గ్రామానికి చెందిన తొగర అఖిలాండేశ్వరి (8) స్కూల్‌కు సెలవులు ఇవ్వడంతో ఆడుకుంటూ పక్కింటి వారు అక్కడే నిలిపి ఉంచిన కారు డోర్ తెరచుకుని లోపలికి వెళ్లింది. ఆ కారు డోర్ లాక్ పడిపోవడంతో ఊపిరాడక మృతి చెందింది. అయితే అఖిలాండేశ్వరి ఎంతకూ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఊరంతా గాలించారు. ఇంటి పక్కనే నిలిపి ఉంచిన కారులో చూడగా అఖిలాండేశ్వరి విగతజీవిగా కనిపించింది. అఖిలాండేశ్వరి తండ్రి శ్రీను గతంలోనే మరణించాడు. బిడ్డ మృతితో తల్లి ఆదిలక్ష్మి బోరున విలపించింది.

‘హంట్ మోడల్ మిసెస్ ఇండియా’కు కాంతిప్రియ ఎంపిక

- దుబాయ్‌లో జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు పోటీలు



నెల్లూరు(పొగతోట): హంట్ మోడల్ మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ కాంటెస్ట్‌లో నెల్లూరుకు చెందిన నంది మండలం కాంతిప్రియ ఫైనల్ జాబితాకు ఎంపికయ్యారు. ప్రపంచ దేశాల్లో స్థిరపడిన భారతదేశానికి చెందిన మహిళలు కాంటెస్ట్‌లో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన కాంతిప్రియ కాంటెస్ట్‌లో పాల్గొని తన సత్తాచాటారు. హంట్ మోడల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు దుబాయ్‌లో ఫైనల్ జాబితాకు ఎంపికైన మహిళలకు పోటీలు నిర్వహించనున్నారు. జూన్ 9న ఫైనల్స్ జరపనున్నారు. నెల్లూరుకు చెందిన కాంతిప్రియ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఫైనల్ జాబితాకు ఎంపిక కావడంపై బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. చదువుకునే రోజుల నుంచి సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే కాంతిప్రియ రాబోవు రోజుల్లో పేదల కోసం విస్తృత సేవ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

వేడుకగా పద్మావతి పరిణయోత్సవాలు



తిరుమల: శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన ఆదివారం నాడు వైశాఖ దశమి నేపథ్యంలో సాయంత్రం శ్రీవారు అశ్వవాహనాన్ని అధిరోహించగా..ఆయన వెంట స్వర్ణ పల్లకీలో శ్రీదేవి, భూదేవి అనుసరించారు. అనంతరం వీరు నారాయణగిరి ఉద్యానవనానికి చేరుకున్నారు. మొదటి రోజు మాదిరే స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు, పూల బంతులాట, నూతన వస్త్ర ధారణ తదితర కార్యక్రమాలు పూర్తయిన తరువాత కొలువు నిర్వహించారు. తర్వాత శ్రీవారు దేవేరులతో బంగారు తిరుచ్చిలో తిరువీధుల గుండా ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. దీంతో రెండవ రోజు పరిణయోత్సవ వేడుక ముగిసింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. వీరిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ కే.శ్రీనివాస్‌రెడ్డి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, ఎమ్మెల్సీ భరత్, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు ఉన్నారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 75,652 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టోకెట్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

గ్రీన్‌ఫీల్డ్ రయ్.. రయ్!


దేవరపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి

ఖమ్మం నుంచి రాజమండ్రికి గ్రీన్‌ఫీల్డ్ రహదారి

- ఏలూరు జిల్లాలో 72 కిలోమీటర్ల మేర నిర్మాణం
- నిర్మాణం పూర్తయితే ఖమ్మం–రాజమండ్రి మధ్య దూరం తగ్గినట్టే..

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఆంధ్రా–తెలంగాణ రాష్ట్రాల మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది భూసేకరణతో కలిపి రూ.4,609 కోట్లతో ఈ ప్రాజెక్ట్‌ను ఖరారు చేయగా.. ఏలూరు జిల్లా పరిధిలో రూ.1,281.31 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రెండేళ్లలో హైవే నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు. భారతీమాల ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ఈ రహదారి నిర్మించడం వల్ల కలిగే ప్రయోజనాలను కేంద్రానికి వివరించిన రాష్ట్ర ప్రభుత్వం.. తెలంగాణతో కాకినాడ పోర్ట్ అనుసంధానం చేయడానికి ఈ ప్రాజెక్టు కీలకమైనదని కేంద్రానికి నివేదించి ఈ ప్రాజెక్ట్ మంజూరు చేయించింది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రేచర్ల నుంచి జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం వరకు 4 లేన్ల రహదారి నిర్మాణానికి రూ.569.37 కోట్లు, గుర్వాయిగూడెం నుంచి దేవరపల్లి వరకు రూ.711.94 కోట్లను కేంద్రం కేటాయించింది.

53 కిలోమీటర్లు తగ్గనున్న దూరం

ప్రస్తుతం ఖమ్మం–రాజమండ్రి నగరాల మధ్య దూరం 220 కిలోమీటర్లు. దీనిని 167 కిలోమీటర్లకు తగ్గించడానికి ఈ ప్రాజెక్టు కీలకంగా ఉపయోగపడనుంది. దీని నిర్మాణం పూర్తయితే ఖమ్మం–రాజమండ్రి మధ్య దూరం 53 కిలోమీటర్లు తగ్గుతుంది. ఏలూరు జిల్లాలో 72 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఖమ్మం నుంచి కల్లూరు మీదుగా వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట నుంచి ఆంధ్రాలో జీలుగుమిల్లిలోకి ప్రవేశించి జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం గోపాలపురం, కొవ్వూరు మీదుగా రాజమండ్రి చేరుకోవాల్సి ఉంటుంది. నూతనంగా నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఖమ్మం, సత్తుపల్లికి దూరంగా రేచర్ల నుంచి నేరుగా ఆంధ్రాలోని చింతలపూడి మండలంలో ఎండపల్లి నుంచి రాఘవాపురం, రేచర్ల మీదుగా టి.నరసాపరం, గుర్వాయిగూడెం మీదుగా దేవరపల్లి రహదారిలో కలుస్తుంది.

భూసేకరణ పూర్తి

ఈ రహదారి కోసం మొత్తం 1,411 ఎకరాల భూమి అవసరమవుతోంది. అందులో 114 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా.. 1,297 ఎకరాలు రైతుల నుంచి సేకరించారు. ఇప్పటికే భూసేకరణ పనులు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. 70 మీటర్ల వెడల్పుతో ఎకనామిక్ కారిడార్‌గా ఈ రహదారిని వర్గీకరించారు.

గ్రీన్‌ఫీల్డ్‌తో జిల్లాకు ఉపయోగం



గ్రీన్‌ఫీల్డ్ రహదారితో మెట్ట ప్రాంతంలో రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుంది. ఆంధ్రా–తెలంగాణ మధ్య నూతన రహదారి వల్ల దూరం తగ్గడమే కాకుండా తెలంగాణ, కాకినాడ పోర్టు అనుసంధానానికి ఉపయోగపడుతుంది.

–కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ


జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం ఎర్రకాలవపై నిర్మాణంలో ఉన్న వంతెన

ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్‌గా డాక్టర్ శ్రీరామ్

- బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర కమిటీ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని డాక్టర్ కేఎల్ రావు భవన్‌లో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర కమిటీ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా డాక్టర్ సీవీ శ్రీరామ్, గౌరవ కార్యదర్శిగా ఎంఎల్ఎస్ దేవకుమార్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ సి.శశిధర్, జేవీ నర్సింహరాజు, రమేష్‌కుమార్, డాక్టర్ నరేష్‌బాబు, ప్రసాద్‌రాజు, ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్, ప్రకాష్‌రావు, రమేష్ రెడ్డి, ప్రొఫెసర్ పి.వెంకటేశ్వర్, సయ్యద్ దస్తగిరి అబ్దుల్, బాలప్రసాద్, డాక్టర్ జాస్తి సుధీర్‌కుమార్, రవి బాధ్యతలు స్వీకరించారు. సంస్థ పాస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ సంస్థ 125 కేంద్రాలు, ఆరు ఓవర్సీస్ చాప్టర్‌లతో దేశ, విదేశాల్లో విస్తరించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చాప్టర్ సాంకేతిక విద్య, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. విద్యార్థులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందిస్తుందన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీరామ్ మాట్లాడుతూ ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్‌ను 1920లో స్థాపించారని, నాటి నుంచి దేశంలో ఇంజినీరింగ్ వృత్తిని ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి పనిచేస్తోందని తెలిపారు.


బాధ్యతలు స్వీకరించిన ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర కమిటీ

‘శుద్ధ తిరుమల-సుందర తిరుమల’లో భాగస్వాములు కండి

- ఉద్యోగులకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి పిలుపు

తిరుమల: క్లిష్ట సమయంలో టీటీడీ ప్రతిష్ట కాపాడుతూ భక్తులకు ఇబ్బంది కలగకుండా సేవలందించేందుకు ఉద్యోగులు ముందుకురావడం అభినందనీయమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. ఇదే స్ఫూర్తితో భక్తులకు మరింత ఆహ్లాదకర, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు శుద్ధ తిరుమల-సుందర తిరుమలగా తయారు చేయడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలిసి ఆయన పిలుపునిచ్చారు. తిరుమలలో ఆదివారం డిప్యుటేషన్ సిబ్బందితో కలిసి ఈవో పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 22న సులభ్ పారిశుధ్య కార్మికులు టీటీడీ యాజమాన్యానికి తెలియజేయకుండా సమ్మెకు వెళ్లారని, ఈ నేపథ్యంలో తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు కార్పొరేషన్లు, స్విమ్స్, బర్డ్ సంస్థల నుంచి పారిశుధ్య కార్మికులను సమీకరించి టీటీడీ పారిశుధ్య చర్యలు చేపట్టిందని చెప్పారు. టీటీడీలోని 8 వేల నుంచి 10 వేల మంది పర్మినెంట్, కార్పొరేషన్ ఉద్యోగులకు, ప్రతిరోజూ 600–700 మందికి తిరుమలలో డిప్యుటేషన్ డ్యూటీ వేసినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ కోసం 5 ఏజెన్సీలకు వర్క్ ఆర్డర్ ఇచ్చామని, వీరు పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి కార్మికులను సమీకరించి తీసుకువస్తున్నారని చెప్పారు. వీరికి కనీస వేతనాలు, అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, శ్రీవారి దర్శనం, సబ్సిడీపై లడ్డూ ప్రసాదాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం టీటీడీ ఈవో, ఇతర అధికారులు పలు ప్రాంతాల్లో ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో కలిసి పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరకామణిలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

తిరుమలలోని నూతన పరకామణి మండపంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయడంతో అక్రమాలకు పాల్పడే వారిని విజిలెన్స్ అధికారులు ఇట్టే గుర్తిస్తున్నారు. శనివారం నోట్ల లెక్కింపు సమయంలో కొన్ని విదేశీ నోట్లను మలమార్గం వద్ద ఉంచుకుని బయటకు వెళుతోన్న కాంట్రాక్ట్ ఉద్యోగిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో నోట్లను గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు.


పారిశుధ్య పనుల్లో పాల్గొన్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

రూ.2 కోట్లతో శనైశ్చర స్వామి ఆలయ నిర్మాణం

- చంద్రబాబు పాలనలో ఆలయం కూల్చివేత
- నిర్మాణానికి ముందుకు వచ్చిన దాత

పన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో కృష్ణా నదీ తీరాన ప్రత్యేక శనైశ్చరస్వామి వారి దేవస్థానం నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ సమీపంలో శనీశ్వరునికి శనైశ్చరస్వామి దేవస్థానం పేరుతో రెండున్నర దశాబ్దాల క్రితం ఆలయాన్ని నిర్మించారు. శనీశ్వరునికి పూజలు నిర్వహించే భక్తులు ఈ ఆలయానికి పోటెత్తుతుంటారు. అటువంటి ఆలయాన్ని కృష్ణా పుష్కరాల పేరుతో చంద్రబాబు ప్రభుత్వం కూలగొట్టింది. ఆ తరువాత ఆలయ నిర్మాణాన్ని విస్మరించింది. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు సీఎం జగన్ ఈ ఆలయాన్ని అక్కడే పునఃనిర్మాణం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా రూ. 2 కోట్లతో ధర్మదాయ శాఖ పరిధిలో ప్రభుత్వం భారీ నిర్మాణం పనులను చేపట్టింది. అలాగే నగరంలోని మరికొన్ని కూలగొట్టిన ఆలయాలను సైతం సీఎం ఆదేశాలతో పునఃనిర్మాణ పనులను మొదలుపెట్టారు.

ముందుకు వచ్చిన దాత

ఆలయ నిర్మాణం పూర్తిగా తానే చేపడతానని విజయవాడకు చెందిన వ్యాపారవేత్త చలవాది ప్రసాద్ ముందుకువచ్చారు. దేవదాయ శాఖ నిర్ణయించిన విధంగా ఆలయాన్ని పూర్తిగా తానే నిర్మాణం చేసి అప్పగిస్తానని తన సమ్మతిని తెలిపి పనులను ప్రారంభించారు. ఆలయంతో పాటుగా వంటశాల, గోశాల, ఆలయ కార్యాలయ నిర్మాణాలను అందులో చేపట్టనున్నారు. శనీశ్వరునితో పాటుగా అనుబంధంగా రాహుకేతువులను సైతం ఉపాలయంగా ఏర్పాటు చేయనున్నారు. 2 అంతస్తులుగా చేపట్టిన ఈ ఆలయ నిర్మాణంలో గర్భాలయాన్ని పూర్తిగా రాతితో చేపట్టనున్నారు. గర్భాలయం నుంచి గోపురం వరకు పూర్తిగా రాతితో నిర్మించనున్నారు. అత్యంత గట్టిగా దీని నిర్మాణం జరుగుతుంది.కాగా, ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయటానికి కసరత్తు చేస్తున్నట్లు ఆలయ ఈవో ఘంటశాల శ్రీనివాసు తెలిపారు.


రాతితో చేపట్టిన ఆలయ గర్భాలయం పనులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

బ్రహ్మంగారిమఠంలో సజీవ సమాధిని దర్శించుకున్న భక్తులు


దీక్షాబంధనాలంకారోత్సవంలో స్వామి వారు


భక్తులతో కిటకిటలాడుతున్న బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలో ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి (బ్రహ్మంగారు) క్రీ.శ.1693లో శ్రీమఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమి రోజు సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా వైశాఖ శుద్ధ దశమి రోజు ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 330వ ఆరాధనోత్సవాన్ని పలు రాష్ట్రాల్లో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారిమఠంలో కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ఉదయం విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం దీక్షాబంధనాలంకారోత్సవంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి నంది వాహనోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. స్వామి సజీవ సమాధిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామి మాలధారులు ఇరుముడి సమర్పించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. అలాగే స్వామి నడయాడిన నంద్యాల జిల్లా బనగానపల్లెలో నేలమఠం, చింతమానుమఠం, రవ్వలకొండ, యాగంటిలో తపస్సు చేసిన గుహ, కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లాలోని కళహరహళ్లిలో ఉన్న పాపాగ్నిమఠంలో వేడుకలు కమనీయంగా నిర్వహించారు.

పేదల ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు హర్షణీయం

945వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పేదలకు 54 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుపుతుండడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 945వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. 29 గ్రామాల్లో కులవాదులు, రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు చేస్తున్న దొంగ ఉద్యమం పూర్తిగా మూతపడిందని, ఎల్లో మీడియా మాత్రం జాకీలు పెట్టి పైకి లేపుతూ శునకానందం పొందుతుందని ఎద్దేవా చేశారు. అమరావతిని భ్రష్టు పట్టించి రైతులను రోడ్డున పడేసిన చంద్రబాబు ఇప్పుడు అమరావతిని అడ్డుపెట్టుకుని దొంగ ప్రచారాలతో రాజకీయాలు చేయాలనుకోవడం దుర్మార్గమని చెప్పారు. నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన సమయంలో బాబుకు సహకరించిన రజనీకాంత్‌కు మళ్లీ ఏపీ రాజకీయాలు గుర్తుకురావడం, అందులోనూ ఎన్టీఆర్ శతజయంతి వేడుకలకు హాజరవడంలో ఆంతర్యం అందరికీ అర్థమైందన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులు కమ్మనిస్టులుగా మారి కులవాదులకు సహకరిస్తుండటం ఆ పార్టీ నిబంధనలు తుంగలో తొక్కడమేనని విమర్శించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

• తెలంగాణ

కానిస్టేబుల్ పరీక్షకు 98% హాజరు!

సాక్షి, హైదరాబాద్: వివిధ విభాగాల్లోని కానిస్టేబుల్ పోస్టులకు ఆదివారం నిర్వహించిన తుది రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అన్ని పోస్టులకు కలిపి మొత్తం 98శాతం మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు హాజరైనట్లు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి చైర్మన్ వివి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాత ఉమ్మడి జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కలిపి మొత్తం 183 పరీక్ష కేంద్రాల్లో తుది రాత పరీక్ష నిర్వహించారు. సివిల్ కానిస్టేబుల్ తత్సమాన పోస్టులకు 1,09,663 మంది అభ్యర్థులుగాను 1,08,055 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఐటీ, కమ్యూనికేషన్ కానిస్టేబుల్ పోస్టులకు 6,801 మంది అభ్యర్థులకు గాను 6,088 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

వారు వినయ్‌కుమార్‌కు చెప్పారు. డబ్బుకు ఆశపడి వినయ్‌కుమార్ కిడ్నీ ఇచ్చేందుకు అంగీకరించాడు. దీంతో అతడిని ఒక ల్యాబ్‌కు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ఈ విషయం వినయ్‌కుమార్ తల్లిదండ్రులకు తెలియడంతో వారు వారించడంతో అతడు భయపడి హైదరాబాద్‌లో ఉంటున్న తన మేనత్త ఇంటికి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో కామరాజు ఫోన్ చేసి కిడ్నీ ఇవ్వకపోతే వైద్య పరీక్షలకు అయిన ఖర్చు రూ.50 వేలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఇంట్లో సామానులు బయట పడేస్తానని వినయ్ కుమార్‌ను బెదిరించాడు. దీంతో అతడు కిడ్నీ ఇవ్వడానికి అంగీకరించాడు. హైదరాబాద్ నుంచి వినయ్ విశాఖ రాగానే పెందుర్తిలో ఉన్న తిరుమల ఆస్పత్రికి తీసుకువెళ్లి అతడి కిడ్నీ తొలగించారు. అనంతరం ఒప్పందం ప్రకారం రూ.8.5 లక్షలు ఇవ్వకపోగా.. రూ.5 లక్షలు ఇస్తున్నట్లు వీడియో రికార్డింగ్ చేసి అందులో రూ.2.5 లక్షలు నిందితులు తీసుకున్నారు. మూడు నెలలుగా వారి మధ్య డబ్బుల కోసం వివాదం నడిచింది. కామరాజు గ్యాంగ్ డబ్బులు ఇవ్వకపోవడంతో వినయ్‌కుమార్ పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చక్రం తిప్పిన వెంకటేష్

2019లో కిడ్నీ రాకెట్ వ్యవహారం నడిపిన నార్ల వెంకటేష్‌ది కడప. ఈ వ్యవహారంలో అతడు అప్పట్లో జైలు పాలయ్యాడు. ఆ తర్వాత జైలు నుంచి విడుదలయ్యాక కూడా ఇదే దందా నడుపుతున్నాడు. వెంకటేష్‌కు ఎలీనా, కామరాజు గ్యాంగ్‌తో పరిచయం ఉండడంతో వారి ద్వారా వినయ్‌కుమార్‌కు డబ్బు ఎరవేశాడు. అతడి కిడ్నీ తొలగించేందుకు ఆస్పత్రిని గుర్తించే బాధ్యతను తన స్నేహితులు రమేష్, పవన్‌లకు అప్పగించాడు. దీంతో వీరిద్దరూ పెందుర్తిలో ఉన్న తిరుమల ఆస్పత్రి డాక్టర్ పరమేశ్వరరావును సంప్రదించారు. సర్జరీ ఆపరేషన్ థియేటర్, వార్డు ఇస్తే రూ.60 వేలు ఇస్తామని చెప్పారు. ఆ ఆస్పత్రి ఆధునీకీకరణకు అప్పటికే ఆ డాక్టర్ రూ.2.5 కోట్లు ఖర్చు చేసి కొంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఒక రోజుకు రూ.60 వేలు వస్తుందని భావించి సర్జరీ చేసుకునేందుకు అంగీకరించారు. అన్నీ సమకూరాక వెంకటేష్ సర్జరీ చేసేందుకు వైద్యుల కోసం ప్రయత్నించాడు. ముందు కేర్ ఆస్పత్రి వారితో మాట్లాడినప్పటికీ వారు అంగీకరించలేదు. అయితే అందులో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న సాయితో వెంకటేష్‌కు పరిచయముంది. దీంతో సాయికి ఈ విషయం చెప్పడంతో తనకు తెలిసిన వైద్యులు ఉన్నారని.. వెంకటేష్‌కు ఇద్దరు డాక్టర్లను పరిచయం చేశాడు. ఆ వైద్యులిద్దరూ సర్జరీ చేయడానికి అంగీకరించారు. ఈ క్రమంలో గత ఏడాది డిసెంబర్‌లో వినయ్‌కుమార్‌కు, ఈ ఏడాది ఫిబ్రవరిలో వాసుపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తికి తిరుమల ఆస్పత్రిలోనే కిడ్నీ తొలగించినట్లు పోలీసులు తమ విచారణలో తెలుసుకున్నారు. వినయ్‌కుమార్ కిడ్నీని మరో రాష్ట్రానికి చెందిన చౌహాన్ అనే వ్యక్తికి ట్రాన్స్‌ప్లాంట్ చేసినట్లు గుర్తించారు. వెంకటేష్‌తో పాటు సర్జరీ చేసిన వైద్యుల కోసం కూడా పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ కేసులో ఎలీనా, కామరాజు, మర్రి శ్రీను, అతడి భార్య కొండమ్మతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ శేఖర్, తిరుమల ఆస్పత్రి డాక్టర్ పరమేశ్వరరావును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిపై 307, 326, 420, 120బీ సెక్షన్లతో పాటు అవయవాల మార్పిడి చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. ఇంకెవరైనా బాధితులు ఉంటే వారి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విశాఖ కేంద్రంగా కిడ్నీ రాకెట్ నడుస్తోందన్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ తేల్చిచెప్పారు.


మాట్లాడుతున్న విశాఖ సీపీ త్రివిక్రమ్ వర్మ

• తెలంగాణ

పసికందుకు ప్రాణం పోసి..

- అప్పుడే పుట్టిన శిశువుకు సీపీఆర్
- ప్రాణం నిలిపిన 108 వాహన సిబ్బంది

కీసర: నెలలు పూర్తిగా నిండకుండా.. గుండె చప్పుడు లేకుండా అప్పుడే పుట్టిన మగబిడ్డకు సీపీఆర్ చేసి కీసర 108 సిబ్బంది ప్రాణాలు కాపాడారు. వివరాలివి. కుందన్‌పల్లిలోని కోళ్లఫాంలో పనిచేసే ఆర్తికుమారి పురిటినొప్పులతో కీసరలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఆమెను పరీక్షించిన వైద్యులు నెలలు పూర్తిగా నిండకపోవడం.. పుట్టబోయే బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేనందున గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. గర్భిణిని 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఈఎంటీ చిత్రం రవి వాహనంలోనే ఆమె సుఖప్రసవం చేశారు. పుట్టిన మగబిడ్డ బరువు తక్కువగా ఉండి నాడి, శ్వాస గుండెచప్పుడు లేకపోవడం గమనించి ఈఆర్‌సీపీ వైద్యుడు మహీద్‌ను ఫోన్లో సంప్రదించారు. ఆయన సూచన మేరకు బిడ్డకు సీపీఆర్ చేసి అంబు బ్యాగ్‌తో శ్వాస అందిస్తూ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల బిడ్డకు ప్రాణాపాయం తప్పిందని పేర్కొని 108 సిబ్బందిని అభినందించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- 22 మంది ప్రయాణికులకు గాయాలు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు అన్‌లోడ్‌చేసిన లారీ అతివేగంగా వచ్చి భద్రాచలం నుంచి గుంటూరు వెళ్తున్న భద్రాచలం డిపో బస్సును ఢీకొనడంతో 22 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. దీంతో బస్సు రెండు పల్టీలు కొట్టగా చాలా భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో బస్సులో 51 మంది ప్రయాణికులుండగా 22 మంది గాయపడ్డారు. వీరిలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలు కావడంతో కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. కొందరికి కాళ్లు, చేతులు విరిగిపోయాయని వైద్యులు తెలిపారు. కాగా, అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

బ్యాక్టీరియా మేఘాలు..!



చూడటానికి పక్షిలా కనిపిస్తున్న ఈ మేఘం నిజానికి పూర్తిగా బ్యాక్టీరియాతో నిండి ఉంది. ఇలాంటి బ్యాక్టీరియా యాంటీ బయాటిక్‌లకు కూడా లొంగదట

అల్లంత ఎత్తున సుదూరాలకు పయనం
యాంటీబయాటిక్స్‌కూ లొంగని లక్షణం
మనకు ముప్పు తక్కువేనంటున్న సైంటిస్టులు

ఆకాశంలో దట్టమైన నల్లటి మేఘాలు కమ్ముకుంటే? మామూలుగా అయితే వాన రాకడకు సూచిక. కానీ, జీవజలాన్ని కాక ప్రమాదకరమైన బ్యాక్టీరియాను మోసుకొచ్చే మేఘాలున్నాయని తెలుసా? నిజం. ఇలాంటి మేఘాలున్నాయని కెనడా, ఫ్రాన్స్ పరిశోధకులు చెబుతున్నారు. ఔషధాల శక్తిని తట్టుకొని మరీ నిక్షేపంగా జీవించే బ్యాక్టీరియా ఈ మేఘాల్లో నిండి ఉంటుందని, వాటితో పాటే అది సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తుందని తాజా అధ్యయనంలో గుర్తించారు. ఒక రకంగా చెప్పాలంటే ప్రపంచమంతటినీ చుట్టేస్తుందన్నమాట! ఈ అధ్యయనం వివరాలను సైన్స్ ఆఫ్ ద టోటల్ ఎన్విరాన్‌మెంట్ పత్రికలో ప్రచురించారు.

కెనడాలో క్విబెక్ సిటీలోని లావల్ యూనివర్సిటీ, సెంట్రల్ ఫ్రాన్స్‌లోని క్లెర్మాంట్ అవెర్గిన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు మేఘాల నమూనాలను సేకరించి పరీక్షించారు.

ఈ మేఘాల్లో యాంటీబయాటిక్స్‌ను తట్టుకొనే జన్యువులతో కూడిన బ్యాక్టీరియా ఉన్నట్టు గుర్తించారు.

2019 సెప్టెంబర్ నుంచి 2021 అక్టోబర్ దాకా ఈ పరిశోధన నిర్వహించారు.

సముద్ర మట్టానికి 1,465 మీటర్ల(4,806 అడుగులు) ఎత్తులో ఉన్న మేఘాల నుంచి నమూనాలను సేకరించారు.

మిల్లీలీటర్ పరిమాణంలో 330 నుంచి ఏకంగా **30,000**కు పైగా బ్యాక్టీరియా ఉన్నట్టు తేలింది.

8,000
ఒక మిల్లీలీటర్ మేఘంలో సగటున ఉన్న బ్యాక్టీరియా సంఖ్య.

మేఘాల్లోని ఈ బ్యాక్టీరియాలో 29 ఉపవర్గాలకు చెందిన యాంటీబయాటిక్‌ను తట్టుకునే జన్యువులు ఉన్నట్టు గుర్తించారు.

ఈ బ్యాక్టీరియా సాధారణంగా మొక్కలపై, చెట్ల ఆకులపై, భూమిపై స్థావరం ఏర్పర్చుకుంటుందని సైంటిస్టు ఫ్లోరెంట్ రోసీ చెప్పారు.

చెట్లపై, భూమిలో ఉన్న బ్యాక్టీరియా గట్టి గాలుల ద్వారా వాతావరణంలోకి, అటునుంచి మేఘాల్లోకి చేరుతుంది. వాటితో పాటు సుదూరాలకు పయనిస్తుంది.

వర్షంగా కురిసిన చోట మేఘాల నుంచి భూమిపైకి చేరుతుంది.

మేఘాల ద్వారా ఇలా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వ్యాప్తి చెందే బ్యాక్టీరియాతో మానవాళి ఆరోగ్యానికి ఉన్న ముప్పుపై పూర్తిస్థాయి పరిశోధనలు జరగాల్సి ఉంది.

- ఈ బ్యాక్టీరియాలో 5 నుంచి 50 శాతం దాకా మాత్రమే క్రియాశీలకంగా ఉంటాయని సైంటిస్టులు చెబుతున్నారు. మేఘాల బ్యాక్టీరియా వల్ల మనుషులకు ముప్పు స్వల్పమేనని పరిశోధకురాలు ఫ్లోరెంట్ రోసీ అభిప్రాయపడ్డారు. 'వర్షంలో బయట నడవాలంటే భయపడాల్సిన అవసరం లేదన్నమాట' అంటూ చమత్కరించారు!
- మేఘాల్లోని బ్యాక్టీరియా జన్యువులు ఇతర బ్యాక్టీరియాతో కలుస్తాయా, లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదని రోసీ వెల్లడించారు.
- డ్రగ్-రెసిస్టెంట్‌ను కలిగిన బ్యాక్టీరియాల మూలాలను కనుగొనేందుకు ఈ పరిశోధన దోహదపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా

చెవిలో సాలీడు గూడు

షాంఘై: చైనాలో ఓ మహిళ చెవి నొప్పితో ఆస్పత్రికెళ్లింది. పరీక్షించిన వైద్యులు చెవిలోపలి భాగంలో ఓ సాలీడు గూడు కట్టుకుని సంతానంతో సహా కాపురం ఉన్నట్లు తేల్చారు. సిచువాన్ ప్రావిన్స్ హుయిడాంగ్ కౌంటీ ఆస్పత్రికి సుమారు పది రోజుల క్రితం ఓ మహిళ వచ్చింది. కుడి చెవి నొప్పితోపాటు లోపలి నుంచి బెల్ కొడుతున్నట్లుగా శబ్దం వస్తోందంటూ వైద్యులకు తెలిపింది. ఎండోస్కోపీ పరీక్ష చేసిన వైద్యులు కర్ణభేరిలాంటి నిర్మాణాన్ని గుర్తించారు. కెమెరా అమర్చిన ప్రత్యేక పరికరాలను లోపలికి పంపించి చూడగా దాని వెనుక ఒక సాలీడు గూడు కనిపించింది. దీంతో,ఆశ్చర్యపోవడం వైద్యుల వంతైంది. వైద్య నిపుణులు ఆ గూడును బయటకు లాగగా దాంతోపాటు అందులోని సాలీడు, దాని పిల్లలు బయటకు వచ్చాయి. అయితే, ఈ సాలీడు విషపూరితమైంది కాకపోవడం సంతోషించాల్సి విషయమని వైద్యులు తెలిపారు.

తుంటరి ఏనుగు చిక్కింది

ఇడుక్కి(కేరళ): రేషన్ దుకాణాల్లోకీ, ఇళ్లలోకీ చొరబడి బియ్యాన్ని బొక్కేస్తున్న ఏనుగు అరికొంబన్(25)ను ఎట్టకేలకు కేరళ అటవీ అధికారులు పట్టుకుని, మరో చోటుకు తీసుకెళ్లి వదిలేశారు. అరికొంబన్ ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉందని, దానికి బిగించిన రేడియో కాలర్ ద్వారా టైగర్ రిజర్వులో ఎక్కడ ఉన్నదీ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని అధికారులు తెలిపారు. అరికొంబన్ మళ్లీ జనావాసాల్లోకి వచ్చే అవకాశాలు మాత్రం లేవన్నారు. ఇడుక్కి జిల్లా చిన్నకనల్, సంతన్‌పర కొండ ప్రాంతాల్లోని నివాసాల్లో దాదాపు దశాబ్ద కాలంగా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోందీ గజరాజు. బియ్యం మాత్రమే స్వాహా చేస్తున్న ఈ గజరాజుకు అరి కొంబన్(మలయాళంలో అరి అంటే బియ్యం, కొంబన్ అంటే ఏనుగు)గా పేరు వచ్చింది. అరికొంబన్‌ను ఏం చేయాలన్న అంశం పలు వివాదాలకు దారితీసింది. అరికొంబన్‌ను పట్టుకుని, శిక్షణ ఏనుగు(కుమ్కి)గా మార్చేందుకు చేసిన ప్రయత్నాలను కేరళ హైకోర్టు అడ్డుకుంది. హైకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ అరికొంబన్‌ను జనావాసాలకు దూరంగా పరాంబికులమ్ టైగర్ రిజర్వులో వదిలి వేయాలని సూచించింది. దీనిపైనా నిరసనలు వ్యక్తమయ్యాయి. చివరికి కేరళ ప్రభుత్వం సూచనలతో.. ఆ ఏనుగును వదిలి వేసే ప్రాంతాన్ని చివరి వరకు రహస్యంగా ఉంచాలన్న ప్రత్యామ్నాయం ఆచరణలోకి వచ్చింది. దీని ప్రకారం..అరికొంబన్‌కు మత్తిచ్చేందుకు శనివారం ఉదయం నుంచి ప్రయత్నాలు మొదలయ్యాయి. లాభం లేకపోవడంతో అరికొంబన్‌కు ప్రధాన పోటీదారుగా ఉన్న మరో ఏనుగును తీసుకొచ్చాక సాయంత్రానికి మత్తు ఇంజక్షన్ ఇవ్వడం సాధ్యపడింది. తర్వాత దట్టమైన అటవీ ప్రాంతానికి తరలించి ర్యాంప్ మీదుగా వదిలిపెట్టినట్టు అధికారులు తెలిపారు.

మన్ కీ బాత్... నా ఆధ్యాత్మిక ప్రయాణం

ఆరాధన, వ్రతం, ప్రజలిచ్చిన ప్రసాదం ● 100వ ఎపిసోడ్‌లో మోదీ భావోద్వేగం

- ఢిల్లీ వచ్చిన తొలినాళ్లలో నాలో ఖాళీని భర్తీ చేసింది
- ప్రజల నుంచి దూరంగా లేనన్న భావన కలిగించింది

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆదివారంతో 100 వారాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి ఆయన ఉద్విగ్నంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని తనకు ఆధ్యాత్మిక ప్రయాణంగా అభివర్ణించారు. ''ఇది కేవలం కార్యక్రమం కాదు. నా విశ్వాసానికి సంబంధించిన అంశం. 2014లో ఢిల్లీ వచ్చాక నాలో ఉన్నట్టనిపించిన ఖాళీని భర్తీ చేసింది. కోట్లాది ప్రజలకు నా భావాలను తెలియజేసేందుకు ఉపయోగపడింది. ప్రజల నుంచి ఎప్పుడూ దూరంగా లేనన్న భావన కలిగించింది'' అంటూ మన్ కీ బాత్‌తో ముడిపడ్డ తన జ్ఞాపకాలు, అనుభవాలు, అనుభూతులను నెమరేసుకున్నారు. గత మన్ కీ బాత్‌ల్లో ప్రస్తావించిన పలువురు విశిష్ట వ్యక్తులతో ఈ సందర్భంగా ఫోన్‌లో మాట్లాడారు. గత ఎపిసోడ్లలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నానికి చెందిన వెంకటేశ్ ప్రసాద్ ను ప్రస్తావించారు. మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

ఇతరుల నుంచి ఎంతో నేర్చుకున్నా...

''2014 అక్టోబర్ 3న విజయ దశమి నాడు మన్ కీ బాత్‌కు శ్రీకారం చుట్టాం. ఇప్పుడదో పండుగలా మారింది. 100వ ఎపిసోడ్ సందర్భంగా శ్రోతల నుంచి వేలాది లేఖలందాయి. అవి భావోద్వేగాలకు గురిచేశాయి. కోట్లాది భారతీయుల మనసులో మాటకు, వారి భావాల వ్యక్తీకరణకు ప్రతిబింబం మన్ కీ బాత్. స్వచ్ఛ భారత్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి వాటిని తొలుత మన్ కీ బాత్‌లోనే ప్రస్తావించాం. తర్వాత ప్రజా ఉద్యమాలుగా మారాయి. ఈ రేడియో కార్యక్రమం రాజకీయాలకతీతం. ఇతరుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి కీలక మాధ్యమంగా మారింది. శత్రువులైనా మంచి గుణాలను గౌరవించాలని నా గురువు లక్ష్మణ్‌రావు ఈనాందార్ చెప్పేవారు. ఇతరుల్లోని సద్గుణాలను ఆరాధించడంతో పాటు వారి నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడానికి మన్ కీ బాత్ నాకో కసరత్తులా ఉపయోగపడింది. మన్ కీ బాత్ నిజానికి మౌన్ (నిశ్శబ్దం) కీ బాత్ అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. చైనాతో వివాదం, అదానీ అక్రమాలు, ఆర్థిక అసమానతలు, మహిళలపై అరాచకాల వంటి కీలకాంశాలను 100వ ఎపిసోడ్‌లో మోదీ ఎందుకు ప్రస్తావించలేదని ఆక్షేపించింది.



కేరళలోని కొచ్చిన్‌లో పెళ్లి వేడుకకు వచ్చిన అతిథులతో కలిసి మన్‌కీబాత్ 100వ ఎపిసోడ్ వింటున్న నూతన వధూవరులు

దేశ ప్రజలే నాకు సర్వస్వం

''గుజరాత్ సీఎంగా తరచూ ప్రజలను కలుస్తూ, మాట్లాడుతూ ఉండేవాన్ని. 2014లో ఢిల్లీకి చేరాక భిన్నమైన జీవితం, పని విధానం, బాధ్యతలు! చుట్టూ పటిష్ఠ భద్రత, సమయపరమైన పరిమితులు. ఇలా ప్రజలను కలవని రోజంటూ వస్తుందని అనుకోలేదు. నాకు సర్వస్వమైన దేశ ప్రజల నుంచి దూరంగా జీవించలేను. ఈ సవాలుకు మన్ కీ బాత్ పరిష్కార మార్గం చూపింది. ఇది నాకు ఒక ఆరాధన, ఒక వ్రతం. గుడికెళ్లి ప్రసాదం తెచ్చుకుంటాం. ప్రజలనే దేవుడి నుంచి నాకు లభించిన ప్రసాదం మన్ కీ బాత్. ప్రజాసేవ చేస్తూ స్ఫూర్తిదాయకమైన ప్రయాణం సాగిస్తున్న ఎంతోమంది గొప్ప వ్యక్తులు నాకు మార్గదర్శకులుగా మారారు. మన్ కీ బాత్‌లో గతంలో ప్రస్తావించిన వ్యక్తులంతా హీరోలే. వారే ఈ కార్యక్రమానికి జీవం పోశారు''

ఐరాస, విదేశాల్లోనూ...

న్యూయార్క్: అమెరికాలో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో మన్ కీ బాత్ 100వ ఎడిషన్‌ను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇదొక చరిత్రాత్మక సందర్భమని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ ట్వీట్ చేశారు. యునెస్కో డైరెక్టర్ జనరల్ అడ్రీ అజౌలే మన్ కీ బాత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఆమె కూడా భాగస్వామి అయ్యారు. పలు దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అమెరికా, బ్రిటన్, రష్యా, దక్షిణాఫ్రికా, చిలీ, మొరాకో, మెక్సికో, కాంగో, ఇరాక్, ఇండోనేషియా తదితర దేశాల్లో మన్ కీ బాత్‌కు విశేష స్పందన లభించింది.

దేశమంతటా...

- మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం దేశవ్యాప్తంగా పండుగలా జరిపారు.
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, గవర్నర్లు ప్రత్యేక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు.
- ప్రత్యేక తెరలు ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా వీక్షించారు.
- ''ఇది కేవలం రేడియో కార్యక్రమం కాదు. సామాజిక మార్పుకు చోదక శక్తి. మోదీ సందేశం యువతకు స్ఫూర్తినిస్తోంది'' అని అమిత్ షా కొనియాడారు.
- అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు భారత్‌లో, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికాలో కార్యక్రమాన్ని వీక్షించారు.



పశ్చిమ బెంగాల్‌లో సౌత్ దినాజ్‌పూర్ జిల్లా బాలూర్ఘాట్‌లో పంటపొలాల్లో మన్‌కీ బాత్ వింటున్న రైతులు





ప్రయాగ్‌రాజ్‌లో అబ్బురపరచిన కాంతి వలయం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ పట్టణంలో ఆకాశంలో అద్భుత దృశ్యం సాక్షాత్కారించింది. శుక్రవారం సూర్యుడి చుట్టూ ఏర్పడిన కాంతి వలయం చూపరులను ఆశ్చర్యపర్చింది. కొన్ని గంటలపాటు కనిపించిన ఈ దృశ్యాన్ని జనం ఫోన్లలో బంధించారు. సూర్యుడి చుట్టూ ఏర్పడే కాంతి వలయాన్ని 'సన్ హాలో' అంటారు. వాతావరణంలో కాంతి వెదజల్లినట్లుగా మారినప్పుడు ఇలా రింగ్ లాంటి ఆకృతి ఏర్పడుతుంది. సూర్యుడి నుంచి వెలువడే కిరణాలు వాతావరణంలోని మంచు స్ఫటికాలను ఢీకొట్టినప్పుడు కాంతి వెదజల్లినట్లుగా మారుతుంది. అప్పుడు భానుడి చుట్టూ వలయాన్ని చూడొచ్చు. సాధారణ మేఘాల కంటే అధికంగా తెల్లగా, పలుచగా ఉండే సిరస్ మేఘాల్లో మంచు స్ఫటికాలు ఉంటాయి.

మాల్దీవులకు భారత్ గస్తీ నౌక, ల్యాండింగ్ క్రాఫ్ట్

న్యూఢిల్లీ: కీలకమైన మిత్రదేశమైన మాల్దీవులకు భారత్ గస్తీ నౌక, ల్యాండింగ్ క్రాఫ్ట్‌లను కానుకగా అందివ్వనుంది. మే ఒకటి నుంచి మూడో తేదీ వరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వీటిని అందజేస్తారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో కొంతకాలంగా పెరుగుతున్న చైనా దూకుడుకు అడ్డుకట్ట వేసే దిశగా భారత్ తీసుకుంటున్న చర్యల్లో ఇది భాగమని చెబుతున్నారు. పర్యటనలో భాగంగా మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం సోలిహ్, విదేశాంగ మంత్రి అబ్దుల్లా సాహిత్, రక్షణ మంత్రి మరియా దీదీతోనూ రాజ్‌నాథ్ చర్చలు జరుపుతారు.

అవును, శివుని కంఠంలో సర్పాన్నే!

ప్రజలను కాపాడుతూ ఉంటా: ఖర్గే విమర్శలపై మోదీ

కర్ణాటక ప్రచార సభలో కాంగ్రెస్, జేడీఎస్‌లపై ప్రధాని ధ్వజం



కోలారు: కాంగ్రెస్, జేడీ(ఎస్) కుటుంబ పాలనే కర్ణాటకలో రాజకీయ అస్థిరతకు కారణమంటూ ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. అవి అవినీతిని పెంచి పోషించాయని, అస్థిరతను అవకాశంగా తీసుకుని రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చాయని మండిపడ్డారు. లూటీపైనే తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. 'కాంగ్రెస్, జేడీ(ఎస్) నేతలు కర్ణాటకలో ప్రత్యర్థులుగా నటిస్తారు. ఢిల్లీలో మాత్రం కలిసే ఉంటారు. పార్లమెంటులో పరస్పరం సహాయం చేసుకుంటారు'' అన్నారు. మోదీ ఆదివారం రామనగర జిల్లాలో జేడీ(ఎస్) కంచుకోట అయిన చెన్నపట్నలో బహిరంగసభలో ప్రసంగించారు. ''జేడీ(ఎస్)కు పడే ప్రతి ఓటూ కాంగ్రెస్‌కు లబ్ధి చేకూర్చి రాష్ట్రాన్ని అస్థిరపరుస్తుంది. ఇక కాంగ్రెస్‌ది 85 శాతం కమిషన్ సర్కారు. ద్రోహానికి మరోపేరు. 2008లో తప్పుడు రుణమాఫీ తెచ్చింది. కాంగ్రెస్ నేతల సంబంధీకుల, అవినీతిపరుల రుణాలే మాఫీ అయ్యాయి. ఇదీ కాంగ్రెస్ ట్రాక్ రికార్డు'' అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనను విషసర్పంతో పోల్చినందుకు తనకేమీ బాధ లేదని మోదీ అన్నారు. ''పాము శివుని మెడలో హారం. అవును. నేను ప్రజల మెడలో పామునే. వారిని రక్షిస్తూ ఉంటా'' అన్నారు.

మోదీ, రాహుల్‌ను చూసి నేర్చుకోండి!

మీది ఎంతసేపూ సానుభూతి యావే: ప్రియాంక ఎద్దేవా

జంఖాండి: కాంగ్రెస్ నేతలు తనను 91 సార్లు దూషించారన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. ''వాటన్నింటినీ కలిపినా ఒక పేజీ అవుతాయేమో. కానీ మీరూ, బీజేపీ నేతలూ మా కుటుంబాన్ని తిట్టిన తిట్లన్నీ రాస్తే పుస్తకాలే కూడా చాలవు! ఆమె ఆదివారం కర్ణాటకలోని బాగల్‌కోట జిల్లాలో బహిరంగ సభలో మాట్లాడారు. దేశం కోసం తూటాలకు ఎదురొడ్డటానికి సిద్ధంగా ఉన్న తన సోదరుడు రాహుల్ గాంధీని చూసి నేర్చుకోవాలని మోదీకి సలహా ఇచ్చారు. ''ప్రజాజీవితంలో ఉన్నవారు విమర్శలకు సిద్ధపడాలి. కాంగ్రెస్ తరఫున ప్రధానులుగా ఉన్న ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం తూటాలు తిన్నారు. కానీ ప్రజల కష్టాలను వినడానికి బదులు వారికి సొంత బాధలు చెప్పుకుంటూ సానుభూతి కోసం పాకులాడుతున్న మొట్టమొదటి ప్రధాని మోదీయే'' అంటూ ఎద్దేవా చేశారు.

విష వాయువులకు 11 మంది బలి

లూధియానా: పంజాబ్‌లోని లూధియానా పారిశ్రామిక ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. విష వాయువులు పీల్చి 11 మంది చనిపోగా మరో నలుగురు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. గియాస్‌పురా ప్రాంతం పారిశ్రామిక వాడలో ఆదివారం ఉదయం కిరాణా దుకాణం వద్దకు వచ్చిన కొందరు కార్మికులు స్పృహతప్పి పడిపోయారు. నలుగురు అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. తర్వాత ఏడుగురు చనిపోయారు. నలుగురు తీవ్రంగా అస్వస్థతతో చికిత్స పొందుతున్నారు. సమీప పరిశ్రమలు వ్యర్థ రసాయనాలను మురుగు కాల్వలో పడబోయడంతో మీథేన్‌తో కలిసి విష వాయువులు వెలువడి ఉంటాయంటున్నారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి

కాళేశ్వరం: మహారాష్ట్రలో గడ్చిరోలి జిల్లా బాంబ్రాగాడ్ తాలూకా దామరంచ అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసులతో ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్ తెలిపారు. పెరిమిలి, అహేరి మావోయిస్టు దళాలు సమావేశమయ్యాయనే సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా జరిఎదురు కాల్పుల్లో పెరిమిలి దళం కమాండర్ బిట్లు మడావి, వాసు, అహేరి దళానికి చెందిన శ్రీకాంత్ మృతి చెందారు.

చార్లెస్–3 పట్టాభిషేకంలో... విశేషాలెన్నో!



బ్రిటన్ రాజుగా కింగ్ చార్లెస్–3కి మే 6న పట్టాభిషేకం జరగనుంది. ఆయనకు 74 ఏళ్లు. ఇప్పటి దాకా బ్రిటన్ ఏలికలుగా పట్టాభిషేకం చేసుకున్న వారిలో అత్యంత పెద్ద వయస్కుడు చార్లెసే! ఆయన వయసు మొదలుకుని కార్యక్రమపు ఖర్చు, అన్ని మతాల పెద్దలను భాగస్వాములను చేయడం దాకా ఎన్నో విశేషాలకు పట్టాభిషేక కార్యక్రమం వేదిక కానుంది...

- చారిత్రక వెస్ట్ మినిస్టర్స్ అబేలో పట్టాభిషేకం జరుగుతుంది. గత వెయ్యేళ్లుగా ఈ వేడుక ఇక్కడే జరుగుతూ వస్తోంది.
- ఉదయం 11కు కార్యక్రమం మొదలవుతుంది.
- చార్లెస్–3 సతీసమేతంగా బకింగ్‌హాం ప్యాలెస్ నుంచి చారిత్రక డైమండ్ జూబ్లీ రథంలో అట్టహాసంగా బయల్దేరతారు. రాణి ఎలిజబెత్–2 పాలనకు 60 ఏళ్లయిన సందర్భంగా 2012లో ఈ రథాన్ని ప్రత్యేకంగా తయారు చేశారు.

ఐదు దశల్లో...

- కార్యక్రమం ఐదు దశల్లో జరుగుతుంది. తొలుత ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరీ ముందుగా రాజును ప్రజలకు పరిచయం చేస్తారు. అనంతరం 'గాడ్ సేవ్ కింగ్ చార్లెస్' అంటూ ఆహూతుల ద్వారా గీతాలాపన జరుగుతుంది.
- మత గ్రంథంపై చార్లెస్ ప్రమాణం చేస్తారు. అనంతరం ఆయనను రాజుగా ప్రకటిస్తారు.
- తర్వాత కింగ్ ఎడ్వర్డ్ కుర్చీపై చార్లెస్ ఆసీనులవుతారు. పట్టాభిషేకానికి ఉపయోగించే ఈ కుర్చీ ఏకంగా 700 ఏళ్ల నాటిది. కింగ్ ఎడ్వర్డ్ నుంచి ఇప్పటిదాకా 26 మంది బ్రిటన్ ఏలికలు దీనిపై కూర్చునే పట్టం కట్టుకున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ కుర్చీని పూర్తిస్థాయిలో రిపేరు చేశారు.
- తర్వాత అనూచానంగా వస్తున్న రాజ లాంఛనాలను ఒక్కొక్కటిగా చార్లెస్ అందుకుంటారు.
- వీటిలో కొన్నింటిని హిందూ, సిక్కు, ఇస్లాం తదితర మత పెద్దలు ఆయనకు అందజేయనుండటం విశేషం. హిందూ మతం తరఫున లార్డ్ నరేంద్ర బాహుబలి పటేల్ (84) చార్లెస్‌కు రాజముద్రిక అందజేస్తారు.
- తర్వాత కీలక ఘట్టం వస్తుంది. సంప్రదాయం ప్రకారం ప్రత్యేక వస్త్రపు ఆచ్ఛాదనలో ఆర్చిబిషప్ చేతుల మీదుగా చార్లెస్‌కు కిరీట ధారణ జరుగుతుంది. కిరీటం పరిమాణాన్ని చార్లెస్‌కు సరిపోయేలా ఇప్పటికే సరిచేశారు.
- ఈ ప్రత్యేక వస్త్రంపై భారత్‌తో పాటు కామన్వెల్త్ దేశాలన్నింటి పేర్లుంటాయని బకింగ్‌హాం ప్యాలెస్ ప్రకటించింది.
- తర్వాత యువరాజు విలియం రాజు ముందు మోకరిల్లుతారు. విధేయత ప్రకటిస్తూ ఆయన ముంజేతిని ముద్దాడతారు.
- తర్వాత సాదాసీదా కార్యక్రమంలో చార్లెస్ భార్య కెమిల్లాను రాణిగా ప్రకటించే తంతు ముగుస్తుంది.
- భారత మూలాలున్న హిందువు అయిన ప్రధాని రిషి సునాక్ ఈ సందర్భంగా పవిత్ర బైబిల్ పంక్తులు పఠించనుండటం విశేషం!
- చివరగా హిందూ, సిక్కు, ముస్లిం, బౌద్ధ, యూదు మత పెద్దల నుంచి చార్లెస్ శుభాకాంక్షలు అందుకుంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రూ.1,000 కోట్ల ఖర్చు

- ✔ పట్టాభిషేక మహోత్సవానికి దాదాపు రూ.1,000 కోట్ల దాకా వెచ్చిస్తున్నారు. సంప్రదాయం ప్రకారం ఈ ఖర్చంతటినీ బ్రిటన్ ప్రభుత్వమే భరిస్తోంది. దేశం మాంద్యం కోరల్లో చిక్కి అల్లాడుతున్న వేళ ఎందుకీ ఆడంబరమంటూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అయితే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసార హక్కులు తదితరాల ద్వారా అంతకంటే ఎక్కువే తిరిగొస్తుందని సమాచారం. ఈ కార్యక్రమం దేశ పర్యాటకానికి ఎంతో ఊపునిస్తుందని సర్కారు ఆశ పడుతోంది!
- ✔ బ్రిటన్ పౌరుల్లో ఏకంగా 52 శాతం మంది ఈ రాచరికపు సంప్రదాయం కొనసాగింపును వ్యతిరేకించినట్టు ఇటీవలి సర్వేలో తేలింది.

అభ్యంతరకరంగా కాళీమాత చిత్రం

ఉక్రెయిన్ రక్షణ శాఖ నిర్వాకం ● వివాదం కావడంతో తొలగింపు

కీవ్: కాళీమాతను అభ్యంతరకరంగా చిత్రీకరిస్తూ ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో షేర్ చేసిన చిత్రం తీవ్ర వివాదానికి దారి తీసింది. దీనిపై పలువురు హిందువులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆ ట్వీట్‌ను ఉక్రెయిన్ రక్షణ శాఖ వెంటనే తొలగించింది. రష్యాలోని చమురు ప్లాంట్ పేలి, అందులో నుంచి పొగ బదులుగా కాళిమాత ఉద్భవిస్తున్నట్లుగా ఈ చిత్రాన్ని సృష్టించారు. ఇది హాలీవుడ్ నటీమణి మార్లిన్ మన్రోను పోలి ఉండడం గమనార్హం. అంతేకాదు ఆ చిత్రానికి 'వర్క్ ఆఫ్ ఆర్ట్' అని క్యాప్షన్ కూడా ఇచ్చారు. కాళిమాత చిత్రాన్ని ట్విట్టర్ ఖాతా నుంచి ఉక్రెయిన్ రక్షణ శాఖ తొలగించినప్పటికీ దాని స్క్రీన్‌షాట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉక్రెయిన్ ప్రభుత్వానికి హిందూఫోబియా సోకిందని పలువురు నెటిజన్లు విమర్శించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కోరారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో భారత ప్రభుత్వం తటస్థ వైఖరిని అవలంబిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా చర్యలను భారత్ ఖండించకపోవడం ఉక్రెయిన్‌కు రుచించడం లేదు. అంతేకాకుండా రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటుండడం ఉక్రెయిన్‌కు కంటగింపుగా మారింది.



వస్త్రధారణకు లింగభేదం ఎందుకంటూ స్కర్టులు ధరించి ఢిల్లీ మెట్రో రైల్లో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం : 1 : మే : 2023

నాచ్చియార్ అవతారంలో వైద్యవీరరాఘవుడు



తిరువళ్లూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన వైద్య వీర రాఘవుడి చైత్రమాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆదివారం ఉదయం స్వామి వారు నాచ్చియార్ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారిని మాడవీధుల్లో ఊరేగించి 10 గంటలకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం యాళీ వాహనంపై స్వామి వారు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

సాక్షి, చెన్నై: అంబా సముద్రంలో విచారణ పేరుతో నిందితుల దంతాలను తొలగించిన వ్యవహారంలో జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్పందించింది. వివరణ ఇవ్వాలని డీజీపీ శైలేంద్ర బాబుకు ఆదివారం నోటీసులు పంపించింది. వివరాలు.. తిరునల్వేలి జిల్లా అంబా సముద్రం ఏఎస్పీ అయిన ఐపీఎస్ అధికారి బల్వీర్ సింగ్ విచారణ పేరిట నిందితుల దంతాలను తొలగిస్తూ వచ్చిన వ్యవహారం ఇటీవల వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై కేసు నమోదు చేయడమే కాకుండా, సస్పెండ్ కూడా చేశారు. సీబీసీఐడీ ఈ వ్యవహారంపై విచారణ సాగుతోంది. పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి వివరణ ఇవ్వాలని డీజీపీకి నోటీసులు జారీ అయ్యాయి. తమకు వచ్చిన సమాచారం, ఫిర్యాదులు, ఆధారాలను బట్టి చూస్తే, మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు తెలుస్తోందని, నాలుగు వారాల్లో సమగ్ర వివరాలను సమర్పించాలని డీజీపీని ఆదేశించారు.

తిరుత్తణిలో భక్తుల రద్దీ




భక్తులతో కిక్కిరిసిన క్యూ

తిరుత్తణి: ఆదివారం తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. చైత్రమాస బ్రహ్మోత్సవాలతో పాటు సెలవు రోజు కావడంతో కొండకు భక్తులు పోటెత్తారు. మెట్లమార్గంతో పాటు, గాట్‌రోడ్డు ద్వారా భక్తులు కొండకు చేరుకున్నారు. దీంతో పట్టణ ప్రధాన మార్గంలో వాహనాల రద్దీ నెలకొంది. సర్వదర్శనంతో పాటు రూ. వంద ప్రత్యేక దర్శన క్యూ మార్గం సైతం భక్తజనంతో కిక్కిరిసింది. దాదాపు 3 గంటల పాటు భక్తులు వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వేసవిఎండల నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా మాడ వీధుల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ఆలయం వెలుపల నిర్వాహకులు అన్నదానం చేశారు.

మంటల్లో న్యాయవాది ఆహుతి

సాక్షి, చెన్నై : కోయంబత్తూరులో ఇంట్లో నిద్రిస్తున్న మహిళా న్యాయవాది విద్యుదాఘాతం కారణంగా చెలరేగిన మంటల్లో ఆహుతి అయ్యారు. వివరాలు.. కోయంబత్తూరు నగరం న్యూ సిద్ధాపుదూర్ నందగోపాల్‌నగర్‌కు చెందిన వి. రేణుకా దేవి(70) గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. వివాహం చేసుకోకుండా ఒంటరిగా నందగోపాల్ నగర్‌లో ఆమె నివాసం ఉంటున్నారు. మూడు రోజుల క్రితం ఆమె బెంగళూరుకు వెళ్లారు. అక్కడి నుంచి శనివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఇంటికి వచ్చిన ఆమె నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం వేకువ జామున ఆమె నిద్రిస్తున్న గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆమె పెడుతున్న కేకలను విన్న ఇరుగు పొరుగు వారు ఇంటి తలుపులు పగుల కొట్టి లోనికి వచ్చి ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. అయితే ఆలోపే మంటలు చుట్టుముట్టి ఆమె అగ్నికి ఆహుతి అయ్యారు. సమాచారం అందుకున్న రేస్ కోర్సు పోలీసులు కాలిన మృత దేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఆ గదిలో విద్యుదాఘాతం కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఉప్పు సత్యాగ్రహ యాత్ర



ఉప్పు సత్యాగ్రహ స్థూపం

కొరుక్కుపేట: బ్రిటీష్ హయాంలో భారతీయ బీచ్‌లలో ఉప్పు సేకరించడంపై పన్ను విధించడాన్ని నిరసిస్తూ 1930లో మహాత్మాగాంధీ నేతృత్వంలో ఉప్పు సత్యాగ్రహం జరిగింది. తమిళనాడులో రాజాజీ నేతృత్వంలో వేదరణ్యంలో ఉప్పు సత్యాగ్రహ నిరసనలు మిన్నంటాయి. దీని తరువాత, రాజాజీ, సర్దార్ వేదరత్నం పిళ్లై ఇతర సమూహాలతో కలిసి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో వేద రత్నం పిళ్లై జ్ఞాపకార్థం అగస్తియన్‌పల్లిలో ఉప్పు సత్యాగ్రహ స్మారక స్థూపం ఏర్పాటు చేశారు. బతుకుదెరువుకి వెళ్లి వేదరణ్యానికి ఉప్పు తీసుకొచ్చారు. ఈనేపథ్యంలో 93వ ఉప్పు సత్యగ్రహ స్మారక దినోత్సవం సందర్భంగా ఉప్పు సత్యాగ్రహ పాదయాత్ర బృందం గత నెల14న తిరుచ్చి రాజన్ ప్యాలెస్ నుంచి తంజావూరుకు బయలుదేరింది. కుంభకోణం నీదిమంగళం, మన్నార్ గుడి తిరుతురపూండి మీదుగా వేదారణ్యం చేరుకున్నారు. శనివారం వేదారణ్యం నార్త్ రోడ్ వద్ద మైలాడుదురై మాజీ ఎంపీ పీవీ రాజేంద్రన్, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వేదరత్ మనవడు, కలైమామని వేదరరత్న, కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఉప్పు సత్య గ్రహ స్మారక భవనం వద్ద దేశభక్తి గీతాలు ఆలపించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు వేదారణ్యం ఉప్పు సత్యాగ్రహ స్మారక భవనం నుంచి ఊరేగింపుగా వెళ్లి అగస్తియన్ స్కూల్ వద్ద ఉన్న సత్యాగ్రహ స్థూపం వద్ద ఉప్పు చల్లారు.

మంత్రివర్గ విస్తరణకు వేళాయె!

- కసరత్తుల్లో సీఎం స్టాలిన్
- ముగ్గురు లేదా నలుగురికి పదవీ గండం
- పలువురు కొత్త ముఖాలకు చోటు
- మరో వారసుడికి కేబినెట్ బెర్త్?

రాష్ట్రంలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణకు రంగం సిద్ధమైంది. ముగ్గురు లేదా నలుగురు మంత్రులకు పదవీ గండం తప్పదనే ప్రచారం ఊపందుకుంది. అలాగే పలువురి శాఖల్లోనూ మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. సీనియర్ నేత టీఆర్‌బాలు వారసుడు టీఆర్‌బీ రాజాకు మంత్రి వర్గంలో చోటుదక్కుతుందనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది.



సీఎం స్టాలిన్ నేతృత్వంలో సమావేశమైన మంత్రి మండలి (ఫైల్)

సాక్షి, చెన్నై: పదేళ్ల తరువాత 2021 ఎన్నికల్లో భారీ గెలుపుతో రాష్ట్రంలో డీఎంకే అధికార పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో మే 7వ తేదీన సీఎంగా ఎంకే స్టాలిన్ బాధ్యతలు చేపట్టారు. 33 మందిని మంత్రులుగా తన కేబినెట్‌లోకి తీసుకుని కరోనా బాధితులను ఆదుకోవడమే కాదు, వైరస్ కట్టడే లక్ష్యంగా పరుగులు తీశారు. తొలిదశలో మంత్రులు శివశంకర్, రాజకన్నప్పన్ శాఖలను మాత్రం మార్చారు. అదే సమయంలో 2022 డిసెంబరు 15వ తేదీన కేబినెట్‌లోకి సీఎం స్టాలిన్ వారసుడు ఉదయ నిధి స్టాలిన్‌కు అవకాశం దక్కింది. ఈ సమయంలో కొందరు మంత్రుల వద్ద ఉన్న కీలక శాఖలు క్రీడలు, యువజన సంక్షేమం, ప్రత్యేక పథకాలను వెనక్కి తీసుకుని ఉదయ నిధికి అప్పగించారు. దీంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య సీఎంతో పాటు 35 మందికి చేరింది.

రెండేళ్ల వేడుకల వేళ..

డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 7వ తేదీతో రెండేళ్లు పూర్తి కానుంది. ఈ రెండేళ్ల ప్రగతిని చాటే విధంగా విస్తృతంగా కార్యక్రమాలకు సీఎం స్టాలిన్ ఆదేశించారు. అలాగే రానున్న లోక్ సభ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ప్రజాహితాన్ని కాంక్షించే సంక్షేమ పథకాల వేగాన్ని పెంచేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో తన మంత్రి వర్గంలో మార్పులకు సీఎం సిద్ధమైనట్లు సమాచారం వెలువడింది. కొందరు మంత్రుల పనితీరుపై ఆది నుంచి సీఎం అసంతృప్తితోనే ఉన్నారు. వీరికి పలు మార్లు హెచ్చరికలు కూడా చేశారు. అలాగే మరి కొందరిపై అవినీతి ఆరోపణలు రావడంతో మంత్రి వర్గంలో మార్పులపై దృష్టి సారించినట్లు తెలిసింది.

పదవీ గండం..

మంత్రి వర్గంలో ముగ్గురు లేదా నలుగురికి పదవీ గండం తప్పదనే సంకేతాలు వెలువడ్డాయి. ఇందులో పర్యాటక శాఖ మంత్రి రామచంద్రన్ పేరు ముందు వరుసలో ఉన్నట్లు తెలిసింది. నీలగిరి జిల్లా కున్నూరులో ఈ మంత్రి అల్లుడు తన రిసార్ట్‌కు చట్ట విరుద్ధంగా రోడ్డు వేయించుకున్న వ్యవహారం పెద్ద చర్చకే దారి తీసి ఉంది. ఈ వ్యవహారం మంత్రి మెడకు ఉచ్చుగా మారినట్లు డీఎంకే వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక, తిరుప్పూర్ జిల్లా తారాపురం ఎమ్మెల్యేగా గెలిచి ఆది ద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి దక్కించుకున్న కయల్ వెలి సెల్వరాజ్‌కు కూడా పదవీ గండం తప్పదనే చర్చ ఊపందుకుంది. ఈ పదవికి తెన్ కాశి జిల్లా శంకరన్ కోయిల్ ఎమ్మెల్యే రాజ లేదా శివగంగై జిల్లా మానమదురై ఎమ్మెల్యే తమిళరసి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. దక్షిణ తమిళనాడుకు చెందిన మరో ఇద్దరు మంత్రులు సైతం పదవి కోల్పోనున్నారనే ప్రచారం సాగుతోంది. ఇందులో ఆధ్యాత్మిక నగరం మదురైకు చెందిన ఇద్దరు కీలక మంత్రుల్లో ఒకరికి, ఓ సామాజిక వర్గం చెందిన మరో మంత్రికి పదవీ గండం తప్పదనే ప్రచారం జోరందుకోవడం గమనార్హం. వీరి స్థానంలో కొత్త ముఖాలు తెర మీదకు రానున్నట్లు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే కొందరి మంత్రుల శాఖల్లోనూ మార్పులుంటాయనే చర్చ జరుగుతోంది. అలాగే ఈసారి కేబినెట్‌లోకి మారో వారసుడు రాబోతున్నట్లు ప్రచారం ఊపందుకుంది. డీఎంకే పార్టీ పార్లమెంటరీ నేతగా ఉన్న టీఆర్‌బాలు వారసుడు టీఆర్‌బీ రాజాకి అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. ఇక తిరువారూర్ జిల్లాకు చెందిన వారెవరూ కేబినెట్‌లో లేని దృష్ట్యా, ఆ లోటును అక్కడి ఎమ్మెల్యే టీఆర్‌బీ రాజా ద్వారా భర్తీ చేయడానికి సీఎం స్టాలిన్ నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రశాంతంగా తమిళ సినీ నిర్మాతల మండలి ఎన్నికలు



పోలింగ్ బూత్‌లో రజనీకాంత్

తమిళసినిమా: తమిళ నిర్మాతల మండలికి మూడేళ్లకోసారి ఎన్నికలను నిర్వహించడం ఆనవాయితీ. ప్రస్తుత కార్యవర్గం కాలపరిమితి పూర్తి కావడంతో ఆదివారం నిర్మాతల మండలి ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుత మండలి అధ్యక్షుడు మురళి రామనారయణన్ నేతృత్వంలోని నలన్ కాక్కుమ్ జట్టు, మన్నన్ అధ్యక్షతన ఉరిమై కాక్కుమ్ జట్టు పోటీపడుతున్నాయి. నిర్మాతల మండలికి అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఓ ఉప కార్యదర్శి, కోశాధికారి, 26 మంది కార్యవర్గ సభ్యుల పదవులకు అభ్యర్థులు పోటీ చేశారు. స్థానిక అడయారులోని జానకి ఎంజీఆర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలీసు ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో 1,111 మంది సభ్యులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం నటుడు రజనీకాంత్, నటి రాధిక శరత్‌కుమార్, దర్శకుడు ఏఆర్ మురుగదాస్ మొదలగు పలువురు నిర్మాతల హోదాలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. నటుడు కమలహాసన్ తదితరులు సాయంత్రం ఓటు వేశారు. విశ్రాంతి హైకోర్టు న్యాయమూర్తులు వెంకట్రామన్, భారతి దాసన్ ఎన్నికల అధికారులుగా బాధ్యతలు నిర్వహించారు. కౌంటింగ్ సోమవారం ఉదయం జరగనుంది.

రెండేళ్లలో 30 వేల కోట్లు మింగేశారు

- హత్యల రాష్ట్రంగా తమిళనాడు
- రోజుకు ఆరేడు ఘటనలు
- పళణి స్వామి ఫైర్



మాట్లాడుతున్న పళణిస్వామి

సాక్షి, చెన్నై: డీఎంకే ప్రభుత్వం తన రెండేళ్ల పాలనలో రూ. 30 వేల కోట్లు కొల్లగొట్టిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి ఆరోపించారు. రాష్ట్రం హత్యలతో అట్టుడుకుతోందని , రోజుకు కనీసం ఆరేడు హత్య ఘటనలు చోటు చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆదివారం చెన్నై నుంచి సేలంకు పళణి స్వామి వెళ్లారు. ఆయనకు కొంగనాపురంలో పార్టీ వర్గాలు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత పాలనలో తాము తీసుకొచ్చిన ప్రాజెక్టులు, అనేక పనులు ప్రస్తుతం ముగిశాయని, వాటిని డీఎంకే ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చినట్లు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సేలం జిల్లాను పూర్తిగా ఈ పాలకులు విస్మరించారని, తాను ఈ జిల్లా వాడిననే కారణంతో ఇక్కడి ప్రజలపై సవతి తల్లి ప్రేమను డీఎంకే పాలకులు చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే పాలకులు కొత్త చేపట్టిన పనులు ఏ ఒక్కటీ లేవని, కపట నాటకాలు, కళ్లబొల్లి మాటలతో ప్రజల్ని మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, రోజుకు ఆరేడు హత్య ఘటనలు రాష్ట్రంలో వెలుగు చూస్తున్నాయని వివరించారు. యువత మత్తుకు బానిసయ్యే విధంగా గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలు రాష్ట్రంలో జోరందుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం క్రీడా మైదానాలు, కల్యాణ వేదికలలోకి మద్యం సరఫరా అంటూ , రాష్ట్రాన్ని మత్తులో ముంచే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విచిత్ర పాలన సాగుతోందని, ఈ అసమర్థ సీఎం కారణంగా ప్రజలు ముమ్ముందు అష్టకష్టాలు పడే పరిస్థితులు ఎదురు కాబోతున్నాయన్నారు. రెండేళ్ల పాలనలో రూ. 30 వేల కోట్లను మింగేశారని ఆరోపించారు. పాలకుల అవినీతి అక్రమాలపై ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్ చేసినట్టుగా ప్రచారంలో ఉన్న ఆడియో గురించి సీఎం స్టాలిన్ స్పందించక పోవడం శోచనీయమని విమర్శించారు.

చేపాక్కం.. పసుపుమయం

- రైలులో క్రికెట్ మ్యాచ్ వీక్షణకు తరలి వచ్చిన అభిమానులు



సూపర్ కింగ్స్ అభిమానుల హంగామా

సాక్షి, చెన్నై: ఈల వెయ్ (విజిల్ పోడు) నినాదంతో కన్యాకుమారి నుంచి చెన్నై వరకు ప్రత్యేక రైలులో క్రికెట్ అభిమానులు ప్రయాణించారు. ఆదివారం చేపాక్కం స్టేడియంలో జరిగిన చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన అభిమానుల ఈల గోలతో రైల్వే స్టేషన్ దద్దరిల్లింది. వివరాలు.. తమిళనాట క్రికెట్ అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తమిళనాడుకు చెందిన జట్టుగానే అభిమానులు భావిస్తూ , క్రికెటర్లను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. చెన్నైలో గత నెలాఖరు నుంచి ఇప్పటి వరకు జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లన్నీ కిక్కిరిసిన అభిమానుల సందడి మధ్య జరిగాయి. క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు టికెట్ల కోసం అభిమానులు స్టేడియం వద్ద బారులు తీరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం చెన్నై చేపాక్కం ఎంఏ చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను తిలకించేందుకు ప్రత్యేక రైలులో దక్షిణ తమిళనాడు నుంచి అభిమానులు తరలి రావడం విశేషం. చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం నిర్వహించిన పోటీల్లో వందలాది మంది విజేతలను లాటరీ పద్ధతిలో మ్యాచ్ తిలకించేందుకు ఎంపిక చేశారు. కన్యాకుమారి నుంచి శనివారం రాత్రి బయలు దేరిన ఈ రైలులో తిరునల్వేలి, మదురై, దిండుగల్, తిరుచ్చి తదితర జిల్లాలోని గ్రామాలు, యూనియన్ పంచాయతీలకు చెందిన యువత క్రికెట్ మ్యాచ్‌ను తిలకించేందుకు కదిలి వచ్చారు. ఆదివారం ఉదయం చెన్నై రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఈ రైలులోని అభిమానులు విజిల్ పోడు అంటూ ఈల గోలను హోరెత్తించారు. ఆ రైల్వే స్టేషన్ పరిసరాలు ఈల గోలతో దద్దరిల్లాయి. ఈ అభిమానులకు బస, ఆహారం తదితర ఏర్పాట్లు, స్టేడియంకు తీసుకెళ్లి, మళ్లీ వారి వారి స్వస్థలాలకు ప్రత్యేక రైలులో పంపించే చర్యలను చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం చేయడం గమనార్హం. ఇక ఆదివారం మధ్యాహ్నం మ్యాచ్ కావడంతో ఎండ వేడిమిని సైతం తట్టుకుంటూ అభిమానులు ముందుగానే స్టేడియం పరిసరాల వద్ద పడిగాపులు కాశారు. చెన్నై సూపర్ కింగ్స్ టీషర్టులతో అభిమానులు స్టేడియంలో హోరెత్తించారు. దీంతో ఎల్లో ఆర్మీ అంటూ అభిమానను ధోని నినాదాన్ని మారుమోగించారు.

కార్మిక సంక్షేమమే ధ్యేయం

- నేడు మేడే వేడుకలు

సాక్షి, చెన్నై: కార్మిక సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం శ్రమిస్తోందని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. సోమవారం మేడేను పురస్కరించుకుని రాష్ట్రంలోని కార్మిక లోకానికి సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికుల నమ్మకాన్ని వమ్మూ చేయబోమన్నారు. ఇక అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, కాంగ్రెస్ నేత కేఎస్ అళగిరి, తిరునావుక్కరసర్, తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, ఎండీఎంకే నేత వైగో, డీఎండీకే నేత విజయకాంత్, సీపీఎం నేత బాలకృష్ణన్, సీపీఐ నేత ముత్తరసన్ కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నైలోని మేడే పార్క్, కార్మిక చిహ్నం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'పీఎం మన్ కీ బాత్' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, అన్నామలై

సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ 100వ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం చెన్నై నడుకుప్పంలో బీజేపీ నేతృత్వంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో- ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడు అన్నామలై, శాసన సభాపక్ష నేత నయనార్ నాగేంద్రన్ , సినీ నటి, బీజేపీ మహిళా నేత నమిత, అమర్ ప్రసాద్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. తన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులోని గిరిజన మహిళల పర్యావరణ పరిరక్షణ, వేలూరులో మహిళల కొత్త ప్రయత్నాలను గురించి గుర్తు చేస్తూ ప్రశంస వర్షం కురిపించారు. ఈసందర్భంగా గత మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడు సంస్కృతి, సంప్రదాయాలు ఇతర అంశాల గురించి చేసిన ప్రసంగాలను గుర్తు చేస్తూ బీజేపీ నేత అమర్ ప్రసాద్ రెడ్డి సంపాదకత్వంలో 'సెలబ్రేటింగ్ తమిళనాడు - ప్రైమ్ మినిస్టర్ నరేంద్రమోదీ మన్ కీ బాత్ అనే పుస్తకాన్ని సిద్ధం చేశారు. ఈ పుస్తకాన్ని పార్టీ కో ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడు అన్నామలై, శాసన సభా పక్ష నేత నయనార్ నాగేంద్రన్ ఆవిష్కరించారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందుతున్న లబ్ధిదారులను సత్కరించారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వ పథకాలను గుర్తు చేశారు. ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించడమే లక్ష్యంగా, కోట్లాది మంది భారతీయుల ముఖ్య , సామాజిక సమస్యల పరిష్కారం దిశగా కేంద్రం ముందుకెళ్తోందన్నారు. అన్నామలై మీడియాతో మాట్లాడుతూ, అవినీతికి వ్యతిరేకంగా తమ ప్రయాణం ఆగదని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా సరే ఉపేక్షించబోమన్నారు. అన్నా డీఎంకే - బీజేపీ కూటమి ఎన్నికల్లోకి వెళ్లినా తమకు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ చిత్రం ముఖ్యం అని వ్యాఖ్యానించారు. ఆ ప్రాతిపదికనే కూటమి పార్టీలు ఎన్నికలకు వెళ్లక తప్పదన్నారు.

నేత్ర పర్వంగా వాసవీ జయంతి

- తరలివచ్చిన ఆర్య వైశ్య సంఘాలు
- భక్తి శ్రద్ధలతో అమ్మవారికి క్షీరాభిషేకం



వాసవీ జ్యోతికి ఆహ్వానం పలుకుతున్న సంఘ సభ్యులు



దక్షిణ ఇండియా వైశ్య సంఘం ఆధ్వర్యంలో..

సాక్షి, చెన్నై: చెన్నై జార్జి టౌన్‌లో ఆదివారం వాసవీ మాత జయంతి మహోత్సవాలు నేత్ర పర్వంగా జరిగాయి. ఈ వేడుకకు ఆర్య వైశ్య సంఘాలు పెద్దఎత్తున ఊరేగింపుగా తరలి వచ్చాయి. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. వివరాలు.. చెన్నై జార్జి టౌన్ ఆదియప్ప వీధిలో 300 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కన్యక పరమేశ్వరి ఆలయం కొలువై ఉన్న విషయం తెలిసిందే. ఈ ఆలయంలోని వాసవీ మాతకు జయంతి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య సంఘాలు, కన్యకా పరమేశ్వరి దేవస్థానం వర్గాలు ఏర్పాట్లు చేశాయి. ఆదివారం ఉదయం ఆరు గంటలకు మూలవిరాట్, ఉత్సవమూర్తికి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర పంతులు త్రికాల అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దక్షిణ ఇండియా వైశ్య సంఘంలో:
ప్యారిస్ గిడ్డంగి వీధిలోని దక్షిణ ఇండియా వైశ్య సంఘంలోనూ వాసవీ జయంతి మహోత్సవం వైభవంగా సాగింది. 300 మందికి పైగా ముత్తయిదువులు కుంకుమార్చన నిర్వహించి భక్తిశ్రద్ధలతో పాలబిందెలను ఊరేగించారు. ఈ సంఘ అధ్యక్షులు అజంతా డాక్టర్ శంకర రావు, గౌరవ కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్ కుమార్, ట్రెజరర్ పెసల రమేష్ తదితరులు భక్తులకు ప్రసాదను అందజేశారు.



అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో పాల బిందెల ఊరేగింపు

అన్నా నగర్ సంఘం ఆధ్వర్యంలో..
అన్నానగర్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ జయంతి వేడుకను పురస్కరించుకుని 108 పాల బిందెల ఊరేగింపు జరిగింది. భక్తి శ్రద్ధలతో జార్జి టౌన్ ఆదియప్ప నాయకన్ వీధి నుంచి శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వరకు ఈ ఊరేగింపు నిర్వహించారు. సంఘం తరపున వాసవీ అమ్మవారికి మొదటి అభిషేకం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సంఘం అధ్యక్షులు వైవీ హరికృష్ణ, కార్యదర్శులు ఎం. కాశీ విశ్వనాథం , ఎస్‌వీ ప్రసాద్ రావు, కోశాధికారి అంకం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏపీ నుంచి వాసవీ జ్యోతి..
ఆంధ్ర ప్రదేశ్‌లోని పెనుగొండ నుంచి చెన్నై నగరానికి తరలించిన వాసవీ జ్యోతికి ఎస్‌కేపీడీ పాలక మండలి ట్రస్టీలు ఘన స్వాగతం పలికారు. ఈ జ్యోతిని చేట్ పెట్ , గోవిందప్ప నాయకన్ వీధి, సుభాష్ చంద్రబోస్ వీధి పాటు నగరంలోని పలుప్రాంతాల్లో ఊరేగించారు. అమ్మవారికి ముత్తయిదువులు సమర్పించిన 1008 క్షీర కలశాలను పూజల్లో ఉంచారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన పూజలతో అమ్మవారికి క్షీరాభిషేకం నేత్రపర్వంగా సాగింది. అమ్మవారి జీవిత చరిత్రను ఆలయ ట్రస్టీ ఊరా ఆంజనేయులు ఈ సందర్భంగా వివరించారు. ప్రపంచానికి తొలిసారిగా శాంతి సందేశాన్ని అందించి మహోన్నత మూర్తి వాసవీ మాత అని పేర్కొన్నారు. ఈ వాసవీ జ్యోతి ఊరేగింపులో వేలాదిమంది భక్తులతో పాటు ఆలయ ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఊటుకూరు శరత్ కుమార్, డాక్టర్ విజయకుమార్, ఎస్ఎల్ సుదర్శన్ తదితరులు తరలి వచ్చారు.

చిత్తిరై ఉత్సవాలకు 'వైగై' నీరు

- డ్యాం నుంచి నీటి విడుదల
- కల్యాణ మహోత్సవం రేపు



వైగై నదిలో పరవళ్లు తొక్కుతున్న నీరు

సాక్షి, చెన్నై: మదురై చిత్తిరై ఉత్సవాల్లో అత్యంత ముఖ్య ఘట్టం కళ్లలగర్ వైగై నదీ ప్రవేశానికి ఏర్పాట్లు వేగవంతం చేశారు. ఈ ఉత్సవం కోసం వైగై జలాశయం నుంచి ఆదివారం నీటిని విడుదల చేశారు. మంగళవారం మీనాక్షి అమ్మవారికి కల్యాణ మహోత్సవం వేడుకగా జరగనుంది. వివరాలు.. ధ్వజారోహణంతో గత ఆదివారం మదురై మీనాక్షి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 12 రోజుల పాటుగా వైభవోపేతంగా జరిగే చిత్తిరై బ్రహ్మోత్సవాలలో రోజూ అమ్మవారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనం ఇస్తూ వస్తున్నారు. ఈ ఉత్సవాలలో ముఖ్య ఘట్టాలు ఆదివారం నుంచి ప్రారంభం అయ్యాయి. అమ్మవారికి పట్టాభిషేకం కనుల పండవుగా జరిగింది. సోమవారం మీనాక్షి దిగ్విజయ సేవ అంత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. 2వ తేదీన మీనాక్షి, సుందరేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. 3వ తేదీన అత్యంత వైభవంగా రథోత్సవం జరుగుతుంది. 4వ తేదీన అలగర్ ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ రోజున అళగర్ ఎదుర్ సేవ కార్యక్రమం, 5వ తేదీన కళ్లలగర్ స్వామి వారి వైగై నదీ ప్రవేశ ఉత్సవం చేపట్టనున్నారు. ఈ ఉత్సవం కోసం వైగై నదీ తీరంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే, ఈ ఉత్సవం కోసం వైగై నదిలోకి నీటి పరవళ్లు మొదలయ్యాయి. ఆదివారం ఉదయం 71 అడుగులతో కూడిన వైగై జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 53 అడుగులే ఉన్నా, ఈ ఉత్సవం కోసం నీరు తప్పని సరి కావడంతో వైగై నదిలోకి నీటిని విడుదల చేశారు. వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో వైగై నదిలో నీటిని అందుబాటులో ఉంచుతామని డ్యాం ఇంజినీరింగ్ విభాగం అధికారి మురుగేషన్ తెలిపారు.

క్లుప్తంగా

తిరునల్లారుకు పోటెత్తిన భక్తులు

తిరువొత్తియూరు: వేసవి సెలవులు, వారాంతం కావడంతో కారైకాల్‌లోని శనీశ్వర స్వామి ఆలయంలో భక్తులు వేల సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. వివరాలు.. కారైకాల్ సమీపంలోని తిరునల్లారు దర్బారాన్యేశ్వర స్వామి ఆలయంలో ప్రసిద్ధి పొందిన శనీశ్వర భగవాన్ ఆలయం అత్యంత ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ ఆలయానికి తమిళనాడు, పుదుచ్చేరి నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వస్తుంటారు. ఆదివారం తెల్లవారుజామునే భక్తులు కోనేటిలో పుణ్య స్నానాలు ఆచరించి వినాయక స్వామిని దర్శించుకుని, గర్భగుడిలోని శనేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

విషం తాగి గర్భిణి మృతి

అన్నానగర్: అన్నవాసల్ సమీపంలో ఆదివారం ఎనిమిది నెలల గర్భిణి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. పుదుకోట్టై జిల్లా ఇలుపూర్ సమీపంలోని విలప్పట్టి మెట్టుక్కాలానికి చెందిన అరవింద్. అతని భార్య మహేశ్వరి (22). వీరికి 9 నెలల క్రితం వివాహమైంది. మహేశ్వరి ప్రస్తుతం 8 నెలల గర్భిణి. ఈక్రమంలో గత కొన్ని రోజులుగా కుటుంబంతో విభేదాలు రావడంతో మనస్తాపానికి గురైన మహేశ్వరి ఆదివారం ఇంటిలోనే విషం తాగి స్పృహతప్పి పడిపోయింది. వారు వెంటనే ఆమెను రక్షించి పుదుకోట్టై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మహేశ్వరి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మహేశ్వరి తల్లి హంస ఫిర్యాదు మేరకు అన్నవాసల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్

వేలూరు: తిరుపత్తూరు జిల్లా నాట్రంబల్లి తాలుకా పచ్చూరు పాత పేటలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలపై శుక్రవారం తేనెటీగల గుంపు దాడి చేయడంతో సుమారు 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారంతా ప్రస్తుతం తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలను కలెక్టర్ భాస్కర పాండియన్ నేరుగా వెళ్లి పరామర్శించారు. అనంతరం బాధితులకు మెరుగైన చికిత్స అందజేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. కూలీల కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు సబ్ కలెక్టర్ లక్ష్మి, ఆసుపత్రి డీన్ సెంథిల్ కుమార్ ఉన్నారు.

పొరుగు రాష్ట్రాలకు పశుగ్రాసం సరఫరా

• లాభాలతో రైతులు ఖుషీ



పశుగ్రాసాన్ని కట్టలు కడుతున్న మిషన్



పశుగ్రాసం కట్టలను తరలిస్తున్న కూలీలు

తిరువళ్లూరు: వేసవిలో పశుగ్రాసానికి డిమాండ్ ఉన్న నేపథ్యంలో జిల్లా నుంచి రైతులు పెద్దఎత్తున కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు తరలించి అధిక లాభాలు గడిస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల హెకార్ల మేరకు వ్యవసాయ భూమి ఉంది. బావులు, వర్షాలపైనే ప్రధానంగా ఆధారపడి ఇక్కడి రైతులు అనేక పంటలను సాగు చేస్తున్నారు. తిరువళ్లూరు, పూందమల్లి, పూండీ, కడంబత్తూరు, ఊత్తుకోట, గుమ్మిడిపూండి, పొన్నేరి, అవడి, తిరుత్తణి తదితర ప్రాంతాల్లో ప్రస్తుత సీజన్‌లో 29,179 హెక్టారుల వరి సాగు చేసి హార్వెస్టింగ్ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అయితే గతంలో వరి నాటు నుంచి కోత వరకు కూలీలు నిమగ్నమయ్యేవారు. వరి చేతికి అందిన తరువాత పశుగ్రాసాన్ని బాగా ఎండబెట్టి వర్షపు నీరు నిలవని ప్రాంతాల్లో భద్రపరిచి పశువులకు ఆహారం కోసం ఉపయోగించేవారు. అయితే కాలక్రమేణ కూలీల కొరత కారణంగా వరినాటు, కలుపు మొక్కలు తీయడం, కోతలు వరకు యంత్రాలతోనే నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీల కొరత, వేగంగా పనులు పూర్తి చేయవచ్చన్న కారణంతో రైతులు యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు.

రూ.200 వరకు కట్టల విక్రయం

పశుగ్రాసాన్ని విక్రయించడం ద్వారా మంచి ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. మిషన్‌లతో కట్టకట్టి ఒక్కో కట్టకు రూ.20 కూలీలకు, రూ. 20 లోడింగ్ ఇస్తున్నట్లు చెబుతున్నారు. అనంతరం లారీలో వీటిని తరలించి రూ.వంద నుంచి రూ. రెండు వందల వరకు కట్టను విక్రయిస్తున్నట్లు పేర్కొంటున్నారు. పనుల కారణంగా స్థానిక యువకులకూ పని లభిస్తోందని అంటున్నారు.

చిత్ర పౌర్ణమి ఏర్పాట్లు వేగవంతం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు శేఖర్ బాబు, ఏవా వేలు

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ చిత్ర పౌర్ణమి వేడుకలను వేగవంతం చేయాలని దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు అధికారులను ఆదేశించారు. అరుణాచలేశ్వరాలయంలో చిత్ర పౌర్ణమి వేడుకలకు ఈనెల 4, 5వ తేదీల్లో నిర్వహించనున్నారు. సుమారు 20 లక్షలకు పైగా భక్తులు వస్తారని ఆలయ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం పూర్తిస్థాయి ఏర్పాట్లను ఇప్పటికే జిల్లా, ఆలయ అధికారులు వేగవంతం చేస్తున్నారు. రాజగోపురం ముఖ ద్వారంలో ఉచిత దర్శనం, రూ. 50కి ప్రత్యేక దర్శనం రెండు దారులు ఏర్పాటు చేశారు. రాజ గోపురం, అమ్మని అమ్మన్ గోపురం, పే గోపురం, తిరుమంజన గోపురం వంటి ప్రాంతాల్లో భక్తులు కూర్చొనే విధంగా పారిశుధ్య పనులను చేపడుతున్నారు. ఆలయం చుట్టూ ఆటో, పర్యాటక వాహనాలు, బస్సులు నిలిపేందుకు అనుమతి లేదు. ఇది వరకే గుర్తింపు కార్డు పొందిన దుకాణ దారులు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చారు. అదే విధంగా వెయ్యి కాళ్ల మండపం వద్ద భక్తులను కూర్చొని పెట్టి స్వామి దర్శనం కల్పించనున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సుమారు 5 వేల మందితో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఆలయంలో ఏర్పాటు చేసిన ముందస్తు ఏర్పాట్లను మంత్రులు శేఖర్ బాబు, ఏవా వేలు తనిఖీ చేశారు. ఆలయం వెనుక వైపు ఉన్న కొండ చుట్టూ సుమారు 14 కిలో మీటరు దూరం భక్తులు గిరివలయం వచ్చేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రుల వెంట కలెక్టర్ మురుగేష్, ఎస్పీ కార్తికేయన్, ఆలయ అధికారులు ఉన్నారు.

కాలేయ వ్యాధులపై అవగాహనకు వాకథాన్



జెండా ఊపుతున్న నటుడు సతీష్

సాక్షి, చెన్నై: ప్రపంచ కాలేయ దినోత్సంలో భాగంగా ఆదివారం గ్లెనెగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ, హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేతృత్వంలో పళ్లికరణైలో వాకథాన్ జరిగింది. కాలేయ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ పెద్దఎత్తున విద్యార్థులు, వైద్య బృందాలు ముందుకు కదిలాయి. పళ్లికరణై ఎన్‌ఐఏటీ వద్ద ఈ కార్యక్రమాన్ని సినీ నటుడు సతీష్ జెండా ఊపి ప్రారంభించారు. నాలుగు కి.మీ దూరం పాటు ఈ కార్యక్రమం జరిగింది. కాలేయ సంరక్షణపై సందేశాన్ని ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా వాకథాన్ నిర్వహించామని గ్లెనెగల్స్ సీఈఓ డాక్టర్ అలోక్ ఖుల్లార్ తెలిపారు.

పట్ట పగలు నరికి చంపేశారు

• హోటల్ వద్ద దారుణం

సాక్షి, చెన్నై : చెంగల్పట్టు జిల్లా తిరుక్కళి కుండ్రం రోడ్డులో ఓ హోటల్ వద్ద రియల్టర్‌ను పట్ట పగలు జనం అందరూ చూస్తుండగానే ముగ్గురు వ్యక్తులు అతి దారుణంగా హతమార్చారు. వివరాలు.. చెంగల్పట్టు జిల్లా తిరుక్కళి కుండ్రానికి చెందిన సర్బుద్దీన్(40) భూముల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం మంగళం గ్రామం వద్ద రోడ్డు పక్కనే ఉన్న హోటల్‌లో టిఫిన్ చేసి తన కారులో తిరుగు పయనానికి సిద్ధమయ్యాడు. ఈ సమయంలో హఠాత్తుగా మోటారు బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు కత్తులతో దారుణంగా నరికి చంపేశారు. అక్కడున్న జనం చూస్తుండగానే అతడిని హతమార్చి ఉడాయించారు. సీసీ టీవీ కెమెరాల్లో ఈ హత్య దృశ్యాలు నమోదు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చదురంగ పట్నం వద్ద ఆ ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ హత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నారు. ఆక్రమణల తొలగింపు విషయంగా సలీం బాషా అనే రియల్టర్‌పై సర్బుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా, కోర్టును ఆశ్రయించినట్లు విచారణలో తేలింది. ఇందుకు ప్రతీకారంగానే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

తుపాకీతో కాల్చుకుని జవాను బలవన్మరణం



రాజేష్ (ఫైల్)

సాక్షి, చెన్నై: నాగపట్నం నావికాదళం కార్యాలయంలో భద్రతా విధుల్లో ఉన్న జవాను రాజేష్(28) తన తుపాకీతో కాల్చుకుని ఆదివారం ఉదయం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై నావికాదళం అధికారులు విచారణకు ఆదేశించారు. వివరాలు.. నాగపట్నం జిల్లా కేవి కుప్పానికి చెందిన రాజేష్(28) భారత నావికాదళంలో 2015 నుంచి జవానుగా పనిచేస్తున్నారు. అధికారులతో కలిసి సముద్రంలో గస్తీకి వెళ్లడం లేదా కార్యాలయంలో షిఫ్ట్‌ల వారీగా భద్రతా విధుల్లో ఉండడం ఇతడి విధులు. శనివారం రాత్రి 12 గంటలకు రాజేష్ డ్యూటీకి వచ్చాడు. ఆదివారం వేకువ జామున మూడు గంటల సమయంలో తుపాకీ పేలిన శబ్దంతో అక్కడున్న అధికారులు, ఇతర సిబ్బంది ఆందోళనతో పరుగులు తీశారు. భద్రతా విధుల్లో ఉన్న రాజేష్‌రక్తపు మడుగులో పడి ఉండటంతో చెన్నైలోని ఉన్నతాధికారులకు తెలియజేశారు. నాగపట్నం టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అతడు తన తుపాకీతో గొంతు భాగంలో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగపట్నం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడా..? లేదా కుటుంబం తగాదాలు, ఏదేని మానసిక ఒత్తిడి వంటి సమస్యలు ఉన్నాయా..? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

గంజినీళ్లు పడి చిన్నారి మృతి

అన్నానగర్: తిరుముల్‌లెవ్వాయల్ సమీపంలో వేడి గంజి నీళ్లు పడి మూడేళ్ల చిన్నారి ఆదివారం ఉదయం మృతి చెందింది. వివరాలు.. తిరుముల్‌లెవ్వాయల్ ప్రాంతానికి చెందిన శరవణన్ (36). ఇతని భార్య గాయత్రి (32). వీరికి శృతి (03) అనే కుమార్తె ఉంది. రెండు రోజుల క్రితం గాయత్రి ఓ పాత్రలో వేడి గంజి పెట్టింది. ఆ సమయంలో ఆడుకుంటూ చిన్నారి శృతి వేడి గంజి పాత్రను లాగింది. వేడి గంజి నీరు ఆమెపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చెన్నైలోని ఎగ్మూర్ చిల్డ్రన్స్ వెల్ఫేర్ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం శృతి మృతి చెందింది. తిరుముల్‌లెవ్వాయల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీటీల పేరుతో 3.6 కోట్లు నగదు మోసం

తిరువొత్తియూరు: విల్లుపురం సమీపంలోని వానూరులో ఏలం చీటీ నడిపి రూ.3.6 కోట్లు నగదు మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. విల్లుపురం జిల్లా వానూరు సమీపంలోని తైలమరానికి చెందిన 50 మంది స్థానికులు ఎస్పీ కార్యాలయంలో ఇటీవల ఫిర్యాదు ఇచ్చారు. అందులో తమ గ్రామానికి చెందిన రాజేష్ బాబు నెలవారీ చీటీల పేరుతో రూ. 3.6 కోట్లు మేరకు మోసానికి పాల్పడి పరారయ్యాడని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

ఇకపై అలాంటి ప్రశ్నే
తలెత్తకూడదు



సంయుక్త

తమిళసినిమా: కోలీవుడ్‌లో వరుసగా రెండు సక్సెస్‌లను అందుకుని జోరుమీదున్న నటి సంయుక్త. మాలీవుడ్‌లో నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఈ మలయాళీ బ్యూటీ ఇంతకుముందు ధనుష్ కథానాయకుడిగా తమిళం, తెలుగు భాషల్లో నటించిన వాత్తీ చిత్రంలో సంయుక్త నాయకిగా నటించింది. ఆ చిత్రం సక్సెస్ కావడంతో పాటు ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. దీంతో వెంటనే విరూపాక్ష అనే మరో తెలుగు చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. నటుడు సాయి ధరమ్ తేజ్ కథానాయకుడుగా నటించిన ఈ చిత్రం గత వారం విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో నటి సంయుక్త నటనకు అవకాశం ఉన్న పాత్రలో నటించింది. కాగా విరూపాక్ష చిత్రం తమిళంలోనూ అనువాదం అయి ఈనెల 5వ తేదీన తెరపైకి రాబోతుంది. ఈ సందర్భంగా శనివారం చెన్నైలో మీడియాతో ముచ్చటించిన నటి సంయుక్త ఏ విషయంలో నైనా తాను ముందు ఒకే చెప్పి ఆ తరువాతే ఆలోచిస్తానని చెప్పింది. విరూపాక్ష వంటి కమర్షియల్ కథా చిత్రంలో కథానాయిక పాత్రకు ప్రాధాన్యతను ఇవ్వడం అన్నది అభినందించదగ్గ విషయం అని పేర్కొంది. ఈ చిత్రం కోసం చాలా రిస్కు చేసి నటించినట్లు చెప్పింది. భవిష్యత్‌లో కథానాయికల పాత్రలకు ప్రాముఖ్యత ఉంటుందా? అన్న ప్రశ్నకు తావే ఉండరాదని పేర్కొంది. దయచేసి దర్శక, నిర్మాతలు మహిళా పాత్రలకు ప్రాధాన్యత నివ్వాలని విజ్ఞప్తి చేసింది. ప్రతిభావంతమైన నటీమణులు ఇక్కడ చాలా మంది ఉన్నారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తమిళంలో మరిన్ని చిత్రాలలో నటించాలని కోరుకుంటున్నానని నటి సంయుక్త పేర్కొంది.

రెండు భాగాలుగా
కంగువా

తమిళసినిమా: ఒకేసారి చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కడం అన్నది అరుదైన విషయమే. ఇంతకుముందు రాజమౌళి బాహుబలి చిత్రం, ఇటీవల మణిరత్నం పొన్నియిన్ సెల్వన్ చిత్రం, వెట్రిమారన్ విడుదలై చిత్రం ఒకేసారి రెండు భాగాలుగా రూపొందాయి. తాజాగా నటుడు సూర్య కథానాయకుడిగా నటిస్తున్న కంగువా చిత్రం కూడా రెండు భాగాలుగా రూపొందుతున్నట్లు సమాచారం. నటుడు సూర్య నటిస్తున్న 42వ చిత్రం ఇది. ఇందులో బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ నాయకిగా నటిస్తోంది. దర్శకుడు శివ తెరకెక్కిస్తున్న పీరియాడికల్ కథా చిత్రాన్ని కేఈ జ్ఞానవేల్ రాజాకు చెందిన స్టూడియో గ్రీన్ సంస్థ, యువీ క్రియేషన్స్ సంస్థ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని 3డీ ఫార్మెట్లో రూపొందించడం విశేషం. చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. నవంబర్ నెలకల్లా షూటింగ్ పూర్తి చేసి వచ్చే ఏడాది ప్రారంభంలో కంగువా చిత్రం తొలి భాగాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. చిత్రాన్ని 10 భాషల్లో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. తాజా సమాచారం మేరకు దీనిని రెండు భాగాలుగా రూపొందిస్తున్నట్లు టాక్ స్ప్రెడ్ అవుతోంది. చిత్ర తొలి భాగం క్లైమాక్స్, రెండో భాగానికి లీడ్‌గా ఉంటుందని సమాచారం. కాగా ఇటీవల విడుదలైన ఈ చిత్ర మోషన్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందని చిత్ర వర్గాలు పేర్కొన్నారు. అత్యంత భారీ బడ్జెట్లో రూపొందుతున్న కంగువా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఇక సూర్య అభిమానులు అయితే ఈ చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



కంగువా చిత్రంలో ఓ సన్నివేశం

పెరియపళు వెట్ట్రియార్ పాత్రకు
ఆదరణ



శరత్‌కుమార్

తమిళసినిమా: పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో తాను నటించిన పెరియపళు వెట్రియార్ పాత్రను ప్రేక్షకులు అమితంగా ఆదరిస్తున్నారని నటుడు శరత్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. ఈయన ఆదివారం సాయంత్రం చెన్నైలో మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా నటుడిగా విజయవంతంగా రాణిస్తున్నానని పేర్కొన్నారు. తొలి చిత్రం కన్‌దిమిత్ర నేరం చిత్రం నుంచి 150 చిత్రాల మైలు రాయిని టచ్ చేసే స్థాయికి ఎదగడం గర్వంగా ఉందన్నారు. తాను ఈ తరం ప్రేక్షకులకు, శరత్‌కుమార్ తెలియాలనే అన్ని రకాల పాత్రలను నటిస్తున్నానన్నారు. పొన్నియిన్ సెల్వన్, వారీసు వంటి చిత్రాలలో నటించడం సంతోషం అన్నారు. వారీసు చిత్రం చూసిన దర్శకుడు భారతీరాజా బాగా నటించావు అని ప్రశంసించారన్నారు. ఇక రుద్రన్ చిత్రంలో ప్రతినాయకుడిగా నటించడానికి కారణం మంచి సందేశం ఉండటం వల్లేనని చెప్పారు. కొందరు పెద్ద చదువులు చదివి విదేశాలకు వెళ్లిపోతున్నారని, అలాంటి వారు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదన్న సందేశంతో కూడిన చిత్రం రుద్రన్ అని చెప్పారు. ప్రస్తుతం 24 చిత్రాలలో నటిస్తున్నానని, అందులో తమిళం, తెలుగు, మలయాళం వంటి భాషా చిత్రాలతో పాటు హిందీ చిత్రం కూడా ఉందన్నారు. కెడా సౌండ్ చిత్రంలో సతీమణి రాధిక, కూతురు వరలక్ష్మి శరత్‌కుమార్‌తో కలిసి నటించబోతున్నట్లు చెప్పారు. ఇకపోతే సూర్యవంశం చిత్రానికి, సూర్యన్ చిత్రానికి సీక్వెల్ చేసే అవకాశం ఉందన్నారు. తాను నటిస్తున్న స్మైల్ మాన్ 150వ చిత్రం అని చెప్పారు. అదే విధంగా దర్శకత్వం వహించే అవకాశం ఉందని, అయితే ప్రస్తుతం నటుడిగా బిజీగా ఉండటంతో మెగాఫోన్ పట్టడానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. భారతీయ సినిమాలో అవార్డులు రాకపోయినా తన భార్య రాధిక ఉత్తమ నటి అని పేర్కొన్నారు. తాను వందేళ్ల వరకు నటిస్తునే ఉంటానని శరత్‌కుమార్ పేర్కొన్నారు.

తండ్రి పాట..
తనయ ఆట



అదితి శంకర్

తమిళసినిమా: ఇతర రంగాల కంటే సినీ రంగంలో వారసత్వం అనేది కాస్త ఎక్కువే అని చెప్పక తప్పదు. ఇక్కడ నటీనటుల వారసులే కాకుండా దర్శకుడు, నిర్మాతల వారసులు కూడా రంగ ప్రవేశం చేస్తున్నారు. అలా ప్రముఖ దర్శకుడు శంకర్ వారసురాలిగా ఆయన కూతురు ఆదితి శంకర్ కథానాయకిగా విరుమాన్ చిత్రంతో తెరంగేట్రం చేసింది. తొలి చిత్రంతోనే ఈ హైటెక్ సిటీ బ్యూటీ పక్కా గ్రామీణ యువతి పాత్రలో నటించి ప్రశంసలు అందుకుంది. అలా చిత్ర పరిశ్రమ దృష్టిని తన వైపుమల్లేల చేసుకుంది. ప్రస్తుతం శివకార్తికేయన్‌కు జంటగా మా వీరన్ చిత్రంలో నటిస్తోంది. విశేషం ఏంటంటే ఈ చిత్రం తెలుగులోనూ మహావీరుడు పేరుతో విడుదల కానుంది. అలా నటి ఆదితి శంకర్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. తాజాగా మరికొన్ని కొత్త చిత్రాలను కమిట్ అయిన ఈమె తరచూ సోషల్ మీడియాలో కనిపించే ప్రయత్నం చేస్తోంది. అలా తాజాగా ఆమె తన తండ్రి దర్శకత్వం వహించిన చిత్రంలోని ఓ పాటకు డాన్స్ చేసి మరోసారి వార్తల్లోకి ఎక్కింది. దర్శకుడు శంకర్ ఇంతకుముందు విజయ్, శ్రీకాంత్, జీవ హీరోలుగా నన్బన్ అనే చిత్రానికి దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. అందులో నటి ఇలియానా కథానాయకి. కాగా ఆ చిత్రంలో విజయ్ ఇలియానాలపై చిత్రీకరించిన చిల్లీ టెల్లీ అనే పాట మంచి హిట్ అయ్యింది. కాగా ఆ పాటకు నటి ఆదితి శంకర్ చాలా ఫాస్ట్‌గా డాన్స్ చేసింది. దాన్ని వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. అది ఇప్పుడు తెగ వైరల్ అవుతుంది.

టక్కర్‌కు టైమ్ వచ్చింది



టక్కర్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: నటుడు సిద్ధార్థ్ కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం వచ్చి చాలా కాలం అయ్యింది. తాజాగా టక్కర్ అనే చిత్రంతో తమిళ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తమిళం, తెలుగు భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రంలో నటి దివ్యాన్షా నాయకిగా నటించారు. యోగిబాబు, అభిమన్యు సింగ్, మునిశ్కాంత్, ఆర్‌జే విఘ్నేష్ కాంత్, అరుణ్ వైద్యనాథన్, విశ్వ తదితరులు ముఖ్యపాత్ర పోషించిన ఈ చిత్రాన్ని ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుదన్ సుందరం, జి.జయరామ్ నిర్మించారు. కార్తీక్ జి.క్రిష్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించిన ఈ చిత్రానికి ప్రసన్న కె.నివాస్ సంగీతాన్ని, వాంజీనాథన్ మురుగేశన్ ఛాయాగ్రహణం అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 26వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర వివరాలను తెలుపుతూ లవ్, యాక్షన్ నేపథ్యంలో సాగే కథా చిత్రం అని చెప్పారు. ఒక గ్రామానికి చెందిన పేద యువకుడు ధనవంతుడు కావాలని ఆశపడే ఇతివృత్తంతో సాగు చిత్రం టక్కర్ అని తెలిపారు. అతని ఆశ నెరవేరిందా..? లేదా..? అన్నదే చిత్ర కథ అని పేర్కొన్నారు. ఈ చిత్ర కథ హీరో హీరోయిన్ల మధ్య ఈగోతో మొదలవుతుందన్నారు. హీరోయిన్ ధనవంతుల కుటుంబానికి చెందిన యువతి అని చెప్పారు. ఇందులో నటుడు యోగిబాబు డాన్ కావడానికి శిక్షణ పొందే యువకుడిగా నటించారని తెలిపారు. మనిషి అవసరానికి మించి డబ్బు ఉంటే మనశ్శాంతి కరువవుతుందనే కొన్ని ఫిలాసఫీ అంశాలను ఈ చిత్రంలో చెప్పినట్లు తెలిపారు. చిత్రాన్ని ఈ నెల 26వ తేదీన విడుదల చేయనున్నట్లు దర్శకుడు వెల్లడించారు.

క్లుప్తంగా

మహిళా అధ్యాపకురాలిపై లైంగిక వేధింపులు

అన్నానగర్: మహిళా అధ్యాపకురాలిని లైంగికంగా వేధించిన అధ్యాపకుడిని పోలీసులు అరెస్టు చేశారు. మదురై జిల్లా తిరుమంగళం సమీపంలోని కప్పలూరులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మదురైకి చెందిన ఓ మహిళ తాత్కాలిక లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఉసిలంబట్టికి చెందిన రఘుపతి (42)కూడా అదే కళాశాలలో తాత్కాలిక లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అతను ఆమెను తరచూ లైంగికంగా వేధిస్తున్నాడు. గతనెల 26న కళాశాల సమీపంలో అతను మహిళా లెక్చరర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎదురు తిరిగిన ఆమెను చంపుతానని బెదిరించాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి రఘుపతిని పోక్సో చట్టం కింద ఆదివారం అరెస్టు చేశారు.

ఐటీ అధికారి ఇంటిలో చోరీ

• యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: అన్నానగర్‌లో ఐటీ అధికారి ఇంటిలో నగలు, నగదు చోరీ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై అన్నానగర్ ప్రాంతంలో ఉన్న ఐటీ అధికారుల క్వార్టర్స్‌లో ఉంటున్న రామ సుబ్రహ్మణ్యం గత 25వ తేదీన ఐటీ దాడుల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఆ సమయంలో అతని భార్య ఆశ, కుమారుడు ఇంటిలో నిద్రపోతున్నారు. ఆ రోజు రాత్రి ఇంటిలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలో ఉన్న 18 సవర్ల నగలు, రూ. లక్ష నగదు చోరీ చేశారు. దీనిపై తిరుమంగళం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిఘా కెమెరాలు పరిశీలించగా విల్లివాక్కంకు చెందిన ఆనంద్ (20) చోరీ చేసినట్టు తెలిసింది. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై నుంగంబాక్కంలో గంజాయి విక్రయిస్తున్న యువతి సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై నుంగంబాక్కం పోలీసులు నుంగంబాక్కం కార్పొరేషన్ శ్మశానవాటిక సమీపంలో గస్తీ తిరుగుతున్నారు. ఆ సమయంలో యువతి, ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఒకటిన్నర కిలోల గంజాయి, 75 పెయిన్ కిల్లర్ మాత్రలు ఉన్నాయి. వారు రహస్యంగా ఆ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు తేలింది. ముగ్గురిని పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లి విచారణ చేశారు. వారు చూలమేడు భారతీయ వీధికి చెందిన రాజు (27), చేతుపట్టు రెండవ వీధికి ఎమ్మెస్ నగర్‌కు చెందిన అజయ్ కుమారు (27), ఆంధ్ర రాష్ట్రం విశాఖపట్నం ప్రాంతానికి చెందిన శాంతి ప్రియ (22)గా తెలిసింది. ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

వ్యవసాయ సంఘం నాయకుడి హత్య

అన్నానగర్: తిరుచ్చి జిల్లా మన్నచ్చనల్లూరు సమీపంలోని ఎంఆర్ పాళయం ఈస్ట్ కాలనీకి చెందిన షణ్ముగసుందరం (65) శనివారం రాత్రి హత్యకు గురయ్యాడు. అతను సిరుగనూరు ప్రాంతీయ జాతీయ దక్షిణ భారత నదుల అనుసంధాన రైతుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. ఇతని మొదటి భార్య చనిపోవడంతో వలర్మతి (45)ని రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమె కూడా అతనితో విడిపోయి 15 రోజుల క్రితం తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో శనివారం రాత్రి షణ్ముగసుందరం ఇంటిలో నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి అతన్ని హత్య చేసి పరారయ్యారు. ఆదివారం ఉదయం అతని సోదరి షణ్ముఖ సుందరి భోజనం తీసుకురాగా రక్తపు మడుగులో శవమై పడి ఉండటం చూసి కేకలు వేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ' కలయిక



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుత్తణి: పాతికేళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు కుటుంబాలతో సందడి చేశారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని పులకరించారు. తరగతి గదిలో చేసిన అల్లరిని తలుచుకుని సంతోష పడ్డారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మండలం మద్దూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 1997లో వంద మందికి పైగా విద్యార్థులు ప్లస్–2 చదివారు. అనేక మంది ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో స్థిరపడ్డారు. మరికొందరు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరంతా పాతికేళ్ల తర్వాత సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా రెండేళ్ల అన్వేషణ విజయవంతమైంది. పూర్వ విద్యార్థులు, విద్య నేర్పిన గురువులను ఏకం చేసి ఆదివారం తిరుత్తణిలో సమావేశమయ్యారు. దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. తమ గురువులకు పాద నమస్కారం చేసి ఆశీస్సులు పొందారు. వారిని ఘనంగా సత్కరించారు. ఒకరికొకరు సెల్ఫీలు తీసుకుని మధ్యాహ్న భోజనం చేసి సాయంత్రం తిరుగుపయనమయ్యారు.



ఆట పాటలతో సందడి

తెలుగు సాహిత్య రాజధాని మద్రాసు





కొప్పర్తి రాంబాబును సత్కరిస్తున్న వేదవిజ్ఞాన వేదిక నిర్వాహకులు, హాజరైన సాహితీ ప్రియులు

కొరుక్కుపేట: మద్రాసు నగరం ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ఒక నాటి రాజధాని మాత్రమే కాదని, అలనాటి తెలుగు సాహిత్య రాజధాని కూడా అని ఇండియన్ బ్యాంకు – విజయవాడ విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కొప్పర్తి రాంబాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 136వ ప్రసంగం మద్రాసు తెలుగు కథకులు అనే అంశంపై ఆదివారం రాత్రి నిర్వహించారు. స్థానిక టి. నగర్‌లోని ఆంధ్రా క్లబ్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి వక్తగా కొప్పర్తి రాంబాబు పాల్గొని మాట్లాడారు. మద్రాసు తెలుగు కథకులు అనగానే మనకు గుర్తుకు వచ్చే కథకులు ఆ నగరానికి పరిమితమై కథలు రాసిన వారు కాదని, తెలుగు కథా సాహిత్య ప్రపంచాన్ని సుసంపన్నం చేసి తెలుగు కథకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఖ్యాతి తెచ్చిన మహనీయులు అన్నారు. మద్రాసు నగరం ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ఒక నాటి రాజధాని మాత్రమే కాదని అలనాటి తెలుగు సాహిత్య రాజధాని కూడా అభిప్రాయపడ్డారు. ఎన్నో పత్రికలు తెలుగు వారి సాహిత్య కళా సాంస్కృతిక రంగాలు సుసంపన్నం కావడానికి దోహదం చేశాయని తెలిపారు. తెలుగు రచయితల సృజన కారుల కృషిని ప్రచారంలోకి తీసుకు వచ్చి నిక్షిప్తం చేశాయని కొనియాడారు. తెలుగు కథకు పరిమళాలు అద్దిన మల్లాది రామకృష్ణ శాస్త్రి, అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన పాలగుమ్మి పద్మరాజు, హేతువాదాన్ని కథల్లో ఇమిడ్చిన గురజాడ, ఇంకా లెక్చర్స్ రూపంలో శాశ్వితం చేసిన ముళ్లపూడి వెంకటరమణ, అత్తగారి కథలు రాసిన భానుమతి రామకృష్ణ, శ్రీశ్రీ, ఆరుద్ర కె. రామలక్ష్మి, మాలతీ చందూర్, ఎన్నార్ చందూర్, చక్రపాణి, వేటూరి సుందర రామమూర్తి ఇలా ఎందరో ప్రముఖులు జ్ఞప్తికి వస్తారని వివరించి ఆకట్టుకున్నారు. ముందుగా స్వాగతోపన్యాసంను వేదిక కార్యదర్శి మధు చేయగా, వక్తను వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి పరిచయం చేశారు. ఈ సందర్భంగా వక్త కొప్పర్తి రాంబాబును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

డిస్లెక్సియాపై అవగాహన



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నైలోని స్టెల్లా మేరీస్ కాలేజీకి చెందిన వైఆర్‌సీఎస్, ఎన్‌ఎస్‌ఎస్ క్లబ్‌ల భాగస్వామ్యంతో సోషల్ ఇంపాక్ట్ స్టార్టప్ అయిన డిలేర్నర్స్ పిల్లల్లో అధికమవుతున్న డిస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టెల్లా మేరీస్ కాలేజీ ఆడిటోరియం వేదికగా ఇన్‌క్లూజన్ మేళా పేరిట జరిగిన సమావేశంలో నగరంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్‌క్లూజన్ మేళాలో థియేటర్ యాక్ట్, అధ్యక్షురాలు, రచయిత్రి జానకి సబేష్ నేతృత్వంలో స్టోరీ టెల్లింగ్ సెషన్ సహా పలు మోనో యాక్టింగ్ కార్యక్రమాల ద్వారా డిస్లెక్సియాపై అవగాహన కల్పించారు. జానకి సబేష్ మాట్లాడుతూ పిల్లలు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడంలో ఏర్పడే సమస్యను డిస్లెక్సియా అని అంటారని తెలిపారు. ఇది ఎక్కువగా చిన్నారుల్లో కనపడుతుందన్నారు. ఇలాంటి సమస్యలు కలిగిన పిల్లలపై శారీరకంగా, మానసికంగా బాధిస్తాయని వెల్లడించారు. డిస్లెక్సియా ఉన్నట్టు గుర్తిస్తే వెంటనే వైద్యుల సూచనలు తీసుకోవాలని కోరారు.

మహాదేవ్ ఆలయంలో సర్వే

కొరుక్కుపేట: కన్యాకుమారిలోని మహాదేవ్ ఆలయ పునరుద్ధరణ పనులకు సంబంధించి అన్నా యూనివర్సిటీకి చెందిన ఇంజినీరింగ్ నిపుణుల బృందం సర్వే నిర్వహించింది. పురావస్తు శాఖ ఇన్‌స్పెక్టర్ ఆలయ మరమ్మతులు ఎలా చేయాలనే దానిపై చర్చించారు. 9 మంది సభ్యులతో కూడిన పురావస్తు బృందం వచ్చి ప్రాంతీయ కమిటీలో పనిని ఆమోదించనుందని వెల్లడించారు. హిందూ మత స్వచ్ఛంద సంస్థ యాత్ర తరపున కన్ని విధంగోడ్ మహాదేవ్ ఆలయ పునరుద్ధరణ పనులపై సర్వేను గత ఏడాది జూలై 6న ప్రారంభించారు. ఆలయ రాతి గోడలను నీటితో శుభ్రం చేసి రూ.7.57 లక్షలతో పెయింటింగ్ పనులు చేస్తున్నారు. ఆలయంలో ఆలయ విస్తరణ పనులు రూ. 26.27 లక్షలతో జరుగుతున్నాయి. హిందూ రిలీజియస్ ఎండోమెంట్ కమిషనర్ ప్రజా సంక్షేమ నిధి నుంచి ఈ పని జరుగుతోందని, అన్నా యూనివర్సిటీ ఇంజినీరింగ్ నిపుణులు, సివిల్ ఇంజినీరింగ్ విభాగం, విభాగాధిపతి మురుగన్ తెలిపారు.

అప్పుల బాధతో టాస్మాక్ ఉద్యోగి ఆత్మహత్య

అన్నానగర్: పులియాంతోపులో అప్పుల బాధతో టాస్మాక్ ఉద్యోగి ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నైలోని కనిగాపురం జోసెఫ్ వీధికి చెందిన గోపి రాజన్ (43) మాధవరం హైవేలోని టాస్మాక్ దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఓ ప్రైవేటు బ్యాంకులో రూ.44 లక్షల రుణం తీసుకున్నాడు. తిరిగి చెల్లించాలని బ్యాంకు ఉద్యోగులు డిమాండ్ చేయడంతో గోపిరాజన్ తీవ్ర మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి భోజనం చేసి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఎంతకీ తలుపులు తెరవకపోవడంతో భార్య వనిత ఇరుగుపొరుగు వారితో తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అతన్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పులియాంతోపు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని..

తిరువొత్తియూరు: ఆవడి సమీపంలో కళాశాలకు వెళ్లకుండా సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతుండడంతో తండ్రి మందలించడంతో ఇంజినీరింగ్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నై సమీపంలోని వివేకానంద నగర్ వవుసి వీధికి చెందిన గురుమూర్తి కుమారుడు దినేష్ కుమార్ (19) పూందమల్లి సమీపంలో ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదుతున్నాడు. వారం రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతున్నాడు. దీంతో తండ్రి కురుమూర్తి తీవ్రంగా మందలించాడు. దీంతో విరక్తి కిందన విద్యార్థి శనివారం ఉదయం ఎంత సేపటికీ బెడ్ రూమ్ నుంచి బయటికి రాలేదు. గురుమూర్తి తలుపులు పగులగొట్టి చూడగా దినేష్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా నాగేశ్వరర్ రథోత్సవం



రథంలో కొలువైన నాగవల్లి సమేత నాగేశ్వరర్



నాగేశ్వరర్ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పళ్లిపట్టు: నాగేశ్వరర్ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథం లాగి స్వామిని దర్శించుకున్నారు. తిరుత్తణి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అనుబంధ పెద్ద నాగపూండి నాగవల్లి సమేత నాగేశ్వరర్ ఆలయంలో చైత్రమాస వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏడవ రోజైన ఆదివారం ఉదయం స్వామివారి రథోత్సవం కోలాహలంగా నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన రథంలో కొలువుదీరిన నాగవల్లి సమేత నాగేశ్వరస్వామికి కర్పూర హారతి పూజలతో భక్తులు శివ, శివ నామస్మరణతో రథం లాగారు. రథంపై ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు మజ్జిగ, నిమ్మ రసంతోపాటు అన్నదానం చేశారు. తిరుత్తణి ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది వేడుకల ఏర్పాట్లు చేశారు.

విద్యార్థినిని బంధించి లైంగిక దాడి

అన్నానగర్: నీలగిరి జిల్లాకు చెందిన విద్యార్థినిని (21)ని స్నేహితులు బంధించి మూడు రోజులు లైంగిక దాడి చేశారు. కోయంబత్తూరులోని ఓ కళాశాలలో డిగ్రీ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి శరవణం పట్టి ప్రాంతానికి చెందిన రవీంద్రన్ (24), జర్మన్ రాజేష్ (25)తో పరిచయం ఏర్పడింది. రవీంద్రన్ రెండేళ్లుగా కాలేజీకి వెళ్లకుండా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. జర్మన్ రాజేష్ కూలీ పనిచేస్తున్నాడు. విద్యార్థినికి కళాశాల ఫీజు చెల్లించాల్సిన అవసరం వచ్చింది. ఆమె రవీంద్రన్ వద్దకు వెళ్లి నగదు సాయం చేయాలని కోరింది. అతను రెండు రోజుల క్రితమే డబ్బులు సిద్ధం చేశానని, శరవణం పట్టిలోని రెస్టారెంట్ వద్దకు వచ్చి తీసుకెళ్లాలని చెప్పాడు. అక్కడికి వెళ్లిన ఆమెను రవీంద్రన్ హోటల్‌లోని గదికి తీసుకెళ్లాడు. ఆ గదిలో జర్మన్ రాజేష్ ఉన్నాడు. ఇద్దరూ తలుపులు వేసి విద్యార్థినిని బెదిరించి లైంగిక దాడి చేశారు. అనంతరం గదిలో బంధించారు. 3 రోజులు లైంగిక దాడి చేశారు. ఈ విషయాలను ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి పంపించారు. ఆమె శనివారం కోయంబత్తూరు ఈస్ట్ ఆల్ ఉమెన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి రవీంద్రన్, జర్మన్ రాజేష్‌ను అరెస్టు చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

అన్నానగర్: అనుమానాస్పద స్థితిలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెందాడు. కన్యాకుమారి సమీపంలోని దక్షిణ కుండలైకి చెందిన తంబిరాజా కుమారుడు అజిత్ (20) కన్యాకుమారిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో అజిత్ తన ఇంటి బయట వున్న టాయిలెట్‌కు వెళ్లాడు. చాలా సేపు అయినా ఇంటికి రాలేదు. అనుమానం వచ్చిన తల్లిదండ్రులు పరిశీలించారు. అజిత్ అపస్మారక స్థితిలో పడి వుండగా అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కన్యాకుమారి సబ్ ఇన్‌స్పెక్టర్ సుందరమూర్తి అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం అజిత్ మృతదేహాన్ని ఆచారిపల్లంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు.

మన్‌కీ బాత్‌కి ప్రత్యేక ఏర్పాట్లు



తిరువళ్లూరు: ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న నిర్వాహకులు



వేలూరు : మన్‌కీ బాత్‌లో పాల్గొన్న బీజేపీ ప్రతినిధులు

తిరువళ్లూరు: మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోదీ ప్రసంగాన్ని ప్రత్యేకంగా వినిపించడానికి తిరువళ్లూరు జిల్లా బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో 100 ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకరన్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన వందవ మాన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం కరుణాకరన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు వేగంగా అమలు జరగడంతో నిరుపేదలకు లబ్ధి చేకూరిందన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ నేతలు కార్యకర్తలు సమష్టిగా పని చేసి మోదీని ప్రధాన మంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సతీష్‌కుమార్, చిత్రాదేవి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

వేలూరు ఉమ్మడి జిల్లాలో మోదీ మన్‌కీ బాత్ ప్రసారం

వేలూరు: ప్రధాని మోదీ ఆదివారం చేపట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వేలూరు ఉమ్మడి జిల్లా నుంచి 700 స్థానాల్లో ప్రసారం చేశారు. వేలూరు కార్పొరేషన్‌లో 100 స్థానాల్లో ప్రసారం చేశారు. సత్వచ్చారిలోని గంగమ్మ ఆలయ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కార్తియాయిని, జిల్లా అధ్యక్షుడు మనోహరన్, కార్పొరేటర్ సుమతి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథన్, ఎస్ఎల్ బాబు తదితరులు పాల్గొన్నారు. మోదీ మాట్లాడుతూ తిరువణ్ణామలై జిల్లాలోని జవ్వాది కొండలో నాగనది నుంచి ప్రారంభమై ఆరణి వాయపందల్ అనే ప్రదేశం వరకు నీరు ప్రవహిస్తుందని తెలిపారు. ఈ నది నీటిని వేలూరు ప్రజలకు తాగునీటిగా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కన్నియంబాడి పంచాయతీ పరిధిలోని 354 చోట్ల నాగనది వాగుల ఉంచి వర్షాకాలంలో వచ్చే నీరు భూమిలోకి ఇంకేలా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ఈ పథకాన్ని పూర్తిగా ఉపాధి హామీ కింద అమలుచేశామన్నారు.

మహిళలు రాజకీయాల్లోకి రావాలి



మహిళలకు అవార్డులు అందజేస్తున్న షైనా తదితరులు

కొరుక్కుపేట: రాజకీయాల్లోకి మహిళలు అధిక సంఖ్యలో రావాలని బీజేపీ అధికార ప్రతినిధి, ఫ్యాషన్ డిజైనర్ షైనా ఎన్.సి. పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్, రోటరీ నెక్స్ట్ జెన్‌సంయుక్తంగా శనివారం రాత్రి 42వ వీక్లీ సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న షైనా ఉమెన్ ఇన్ పాలిటిక్స్ అనే అంశంపై ప్రసంగించారు. రోటరీ ఎన్నో దశాబ్దాలుగా సామాజిక సేవ చేస్తుందని కొనియాడారు. పార్లమెంట్‌లో మహిళల సంఖ్య 14 శాతం మాత్రమేనని, ఈ సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని, ప్రజా సేవలో కూడా రావాలని కోరారు. తమిళనాడు ప్రజలు సుస్థిరత, సుపరిపాలన, దార్శనికత కావాలంటే బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. అవినీతిపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై న్యాయబద్ధమైన ప్రశ్నలను లేవనెత్తారని, ఆయన రాష్ట్రంలో మార్పు తీసుకురాగలరనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా మద్రాస్ రోటరీ క్లబ్ తరపున మహిళా సాధకులకు అవార్డులను అందజేశారు. అలాగే కోయంబత్తూరులో మహిళా బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న యువతికి రూ.లక్ష విరాళంగా అందించారు. ఇందులో రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు అధ్యక్షురాలు జయశ్రీ శ్రీధర్, సెక్రటరీ ఆశా మాథెన్, క్లబ్ సర్వీస్ డైరెక్టర్ నిఖిల్ రాజ్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ మానస టి.పిళ్లై, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్ రామకుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అవకతవకలపై నిరసన



అయ్యనేరి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నిరసన

పళ్లిపట్టు: వరిధాన్యం కొనుగోలులో అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆదివారం నిరసన తెలిపారు. ఆర్కేపేట మండలంలోని అయ్యనేరిలో రాష్ట్ర ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని దిగుబడి చేసిన వరిని విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో డీఎంకే మండల కార్యదర్శి పళని రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆర్కేపేట తహసీల్దారు రమేష్ రైతులతో మంతనాలు జరిపి డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఈరా సెరియన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



వీఐటీలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వేలూరు: ఈరా సెరియన్ జీవితాను యువతి ఆదర్శంగా తీసుకోవాలని వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు. వీఐటీ యూనివర్సిటీ ఆవరణలో ఆదివారం వీఐటీ, రచయిత ఈరా సెరియన్ ట్రస్ట్ సంయుక్తంగా వసంతోత్సవం నిర్వహించారు. చాన్సలర్ మాట్లాడుతూ 1985లో వీఐటీకి శంకుస్థాపన చేసింది రచయిత ఈరా సెరియన్ అన్నారు. ప్రస్తుతం వీఐటీలో సుమారు 40 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వేలూరు, చెన్నై, అమరావతి, భోపాల్ వంటి మొత్తం నాలుగు క్యాంపస్‌లోను మొత్తం 80 వేల మంది చదువుతున్నారని తెలిపారు. ఈ ఘనత పూర్తిగా మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్‌కు చెందుతుందన్నారు. రచయిత ఈరా సెరియన్‌తో సుమారు 50 సంవత్సరాల పాటు పరిచయం ఉందన్నారు. 2011లో వేలూరు వీఐటీకి వచ్చిన సెరియన్ మరణం వరకు ఇక్కడే ఉన్నాడన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన ఆయనకు ఎవరూ సాటి లేరన్నారు. ప్రపంచ తమిళ విప్లవ కారుడు నెడుమారన్ మాట్లాడుతూ ఈరా సెరియన్ సుమారు 20 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సమయంలో రాష్ట్రం కోసం పలు సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు కలుసుకొని ఆయన ఘనతను వివరించడం ఆనందంగా ఉందన్నారు. ముందుగా ఈరా సెరియన్ జీవిత చరిత్రపై ప్రచురించిన పుస్తకాన్ని ప్రతినిధులు ఆవిష్కరించారు. మాజీ మంత్రులు పొన్నయ్యన్, హెచ్‌వీ హండే, దిండుకల్ శ్రీనివాసన్, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి రాజ, మాజీ ఎంపి డీకే రంగరాజన్, దినమణి పత్రిక సంపాదకులు వైద్యనాధన్, విమల సుబ్బయ్య, అమెరికా డాక్టర్‌లు జానికిరామన్, సంపదం, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్, జీవి సెల్వం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత కలిగిన ఇంజినీర్లుగా ఎదగాలి

• స్నాతకోత్సవంలో రాజేంద్రన్ దండపాణి



డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: ఎస్ఆర్ఎం వల్లియమ్మయ్ ఇంజినీరింగ్ కళాశాల 18వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. చెన్నై కాతాంగలాత్తూర్ ఎస్ఆర్ఎం క్యాంపస్‌లోని డాక్టర్ టీపీ గణేశన్ ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో కళాశాల డైరెక్టర్ బి.చిదంబరరాజన్ స్వాగత ప్రసంగం చేయగా, ప్రిన్సిపాల్ ఎం మురుగన్ వార్షిక నివేదికను చదివి వినిపించి, కళాశాల సాధించిన విజయాలు, అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలపై వివరించారు. ముఖ్య అతిథిగా జోహో స్కూల్స్ ఆఫ్ లెర్నింగ్ ప్రెసిడెంట్, జోహో కార్పొరేషన్ టెక్నాలజీ డైరెక్టర్ రాజేంద్రన్ దండపాణి హాజరై డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ వేడుకలో 947 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం చేయగా, ర్యాంకులు సాధించిన 53 మంది విద్యార్థులను పతకాలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. అనంతరం ముఖ్యఅతిథి నేటి సాంకేతిక పరిస్థితుల్లో ఇంజినీర్ల ప్రాముఖ్యత, ఇంజినీర్ల పాత్ర గురించి మాట్లాడారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. భవిష్యత్‌లో బాధ్యతగల ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం గ్రూప్ డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ రామచంద్రన్, అలాగే ఎస్ఆర్ఎం గ్రూప్ చైర్మన్ రవి పచ్చముత్తు, ఎస్ఆర్ఎం వల్లియమ్మాయ్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఆర్.హరిణి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

తిరువొత్తియూరు : కత్తితో పొడిచి భర్తను హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. దిండుకల్లు జిల్లాలో భర్తను హత్య చేసిన భార్యను పోలీసులు చేశారు. దిండుకల్లు జిల్లా వత్తులగుండు సమీపంలోని విరాలిపట్టికి చెందిన దంపతులు వీరయ్య (45), అభిరామి (40) కూలి పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరయ్య రోజు మద్యం తాగి వచ్చి అభిరామితో గొడవ పడేవాడు. శనివారం రాత్రి కూడా వీరయ్య గొడవ చేసి ఆమెపై దాడి చేశాడు. దీంతో ఆగ్రహం చెందిన అభిరామి కత్తితో వీరయ్యను పొడిచింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నిలక్కోట పోలీసులు అక్కడికి వెళ్లి వీరయ్య మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వత్తలగుండు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి అభిరామిని అరెస్టు చేశారు.

పిడుగుపడి బాలుడి మృతి

కొరుక్కుపేట: పిడుగుపాటుకు ఇంటి డాబాపై ఆడుకుంటున్న బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన బాలుడు తల్లిదండ్రుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. సేలంలోని లంబాటి ప్రాంతానికి చెందిన కామరాజ్ కుమారుడు గోకుల్ కుమరన్ (12) అదే జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవు కావడంతో శనివారం ఇంటి టెర్రస్‌పై ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ఒక్కసారిగా పిడుగుపడడంతో బాలుడు కుప్పకూలాడు. తల్లిదండ్రులు వెంటనే సేలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే బాలుడు చనిపోయాడని చెప్పారు.

క్లుప్తంగా...

మంత్రులూ బానిస సంకెళ్లు తెంచుకోండి: నాగం

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినందుకైనా ఇకపై రాజ్యాంగబద్ధంగా పాలన సాగాలని కోరుకుంటున్నానని మాజీమంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... మంత్రులు బానిస సంకెళ్లు తెంచుకోవాలని, ఇక నుంచైనా సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఆత్మగౌరవంతో బతకాలని, ఆఖరి సంతకాలైనా ప్రజలకు మేలు చేకూర్చేలా పెట్టాలని కోరారు. ఇప్పటినుంచి ప్రభుత్వ ఆదేశాలు ప్రగతి భవన్ నుంచి కాకుండా సచివాలయం నుంచి వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మీడియాపై ఆంక్షలు విధించడం సరికాదని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయం బీఆర్‌ఎస్‌దో, మరే పార్టీదో కాదని ప్రజలందరికీ చెందినదని చెప్పారు. నాగర్‌కర్నూల్‌లో నల్లమట్టి, ఇసుక అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తున్నట్లు వివరించారు. కొత్త సచివాలయంలో సీఎం బాధ్యతలు స్వీకరించాక వచ్చిన మొదటి లేఖపై స్పందించాలని కోరారు.

సీపీఐ ఎన్నికల గుర్తు కంకి కొడవలే

రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చిందన్న కూనంనేని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుర్తింపు కొనసాగిస్తున్నట్లుగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కేరళ, మణిపూర్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు తెలంగాణలోనూ రాష్ట్ర గుర్తింపును కొనసాగిస్తున్నట్లుగా ఆ నోటిఫికేషన్‌లో వెల్లడించినట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్రంలో పార్టీ నిర్మాణం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రస్థాయి గుర్తింపును కొనసాగిస్తున్నట్లుగా, స్థానిక సంస్థలతోపాటు, రాష్ట్రంలో పార్టీ ప్రాతిపదికగా జరిగే అన్ని ఎన్నికల్లో 'కంకి కొడవలి'గుర్తును యథాతథంగా కొనసాగిస్తున్నట్లుగా ఈసీ తెలిపినట్లు కూనంనేని పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఎక్కడ?

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల
- ఎండకు సొమ్మసిల్లి పడిపోయిన షర్మిల



మొక్కజొన్న పంట నష్టపోయిన రైతుతో మాట్లాడుతున్న షర్మిల

కొణిజర్ల: పంట నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఎకరాకు రూ.10 వేల చొప్పున్న ఇస్తానన్న డబ్బులు ఎక్కడ అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల, బోనకల్ మండలాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లిలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం బోనకల్ మండలం లక్ష్మీపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మార్చి 23న బోనకల్ మండలానికి వచ్చిన సీఎం కేసీఆర్ పంటలను పరిశీలించి ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారని, ఆయన హైదరాబాద్ వెళ్లకముందే నిధులు విడుదలవుతాయని చెప్పారని ఇప్పటికీ రూపాయి కూడా జమకాలేదని విమర్శించారు. కేసీఆర్ ఇంకా ఇంటికి పోలేదేమోనని ఎద్దేవా చేశారు. సచివాలయ నిర్మాణానికి రూ.1,500 కోట్లు ఖర్చు చేశారని, సెక్రటేరియట్‌కే పోని కేసీఆర్‌కు ఈ భవనం ఎందుకని ప్రశ్నించారు.

సొమ్మసిల్లిన షర్మిల

పంటల పరిశీలనకు తుమ్మలపల్లికి చేరుకున్న షర్మిల మొక్కజొన్న చేనులో 10 నిమిషాల పాటు రైతులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒక్కసారిగా సొమ్మసిల్లి కింద పడిపోవడంతో పక్కనే ఉన్న పార్టీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ గడిపల్లి కవిత పట్టుకున్నారు. షర్మిల వ్యక్తిగత భద్రతా సిబ్బంది, స్థానిక మహిళలు సపర్యలు చేయడంతో కోలుకుని తిరిగి ప్రసంగం కొనసాగించారు. ఆమె వెంట వైఎస్సార్‌టీపీ నాయకులు పిట్టా రాంరెడ్డి, దొంతమాల కిషోర్‌కుమార్, వాకా వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం: బాలరాజు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం చేయడం పట్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ అధ్యక్షులు సీహెచ్ బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 5వేల ఉద్యోగులకు మాత్రమే ఉత్తర్వులు వెలువడ్డాయని, మిగిలిన ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



దళిత శక్తి పార్టీ సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న విశారదన్ మహరాజ్

రాజకీయ పార్టీగా దళిత శక్తి

- స్వరాజ్యంతోనే సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం
- పదివేల కి.మీ. స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభలో విశారదన్ మహరాజ్
- భారీ వర్షంలోనూ రాత్రివరకు కొనసాగిన సభ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో మరో కొత్త పార్టీ... దళిత శక్తి పార్టీ (డీఎస్పీ) ఆవిర్భావమైంది. అట్టడుగు వర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేందుకు దళితశక్తి సంస్థను పార్టీగా మార్చుతున్నట్లు డీఎస్పీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ చెప్పారు. కాన్షీరాం ఇచ్చిన స్ఫూర్తితో ఇకపై తెలంగాణ గడ్డపై ప్రత్యక్ష రాజకీయ యుద్ధం చేయబోతున్నట్లు ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు అధికారం కోసం పోటీ పడబోతున్నట్లు చెప్పారు. తెలంగాణవ్యాప్తంగా పదివేల కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి సరూర్‌నగర్ స్టేడియం వేదికగా బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సుమారు పదివేల మంది కార్యకర్తలు ఈ సభకు హాజరయ్యారు. ఏకధాటిగా వర్షం కురుస్తున్నా.. లెక్కచేయకుండా కుర్చీలను తలపై పెట్టుకుని విశారదన్ మహరాజ్ ప్రసంగాన్ని చివరివరకు విన్నారు. జనాభాలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లతో పదిశాతం అగ్ర వర్ణాలు రాజకీయం చేస్తున్నాయని, వారి ఆధిపత్యాన్ని ఇక ఏమాత్రం కొనసాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని పునర్జీవింపజేసేందుకే ఆయన రాసిన రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని 33 జిల్లాలు, 412 రోజులు, 10 వేల కిలోమీటర్లు.. పాదయాత్ర చేసినట్లు చెప్పారు. అధికారంతో పాటు రాజ్య సంపదను ప్రతి ఒక్కరికి పంచినప్పుడే ఘనరాజ్యానికి అర్థం ఉంటుందని, ఆ దిశగా డీఎస్పీ పనిచేస్తుందని విశారదన్ హామీ ఇచ్చారు. బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. వృత్తులు వేరైనా బహుజనుల రక్తం మాత్రం ఒక్కటేనన్నారు. వృత్తులుగా, కులాలుగా విడగొట్టబడిన వారంతా రాజ్యాధికారం కోసం ఒక్కటి కావాల్సిన అవసరం ఉందన్నారు. సభలో అఖిల భారత సంత్ మహరాజ్ అధ్యక్షుడు సద్గురుసంత్ సుఖ్‌దేవ్, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హరీశ్‌గౌడ్, ప్రతినిధులు రమేష్‌బాబు, కృష్ణానాయక్, రాఘవేందర్ ముదిరాజ్, రాజు పూలమాల, అబ్దుల్‌రహీం, వినోద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలు అమ్ముకునుడే తెలంగాణ మోడలా?

- లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను బలిపెట్టారు
- నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీనీ తుంగలో తొక్కారు
- ఉమ్మడి పాలమూరు జిల్లాను కేసీఆర్ అవమానించారని ధ్వజం

పాలమూరు నిరుద్యోగ నిరసన సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఫైర్



నిరుద్యోగ నిరసన ర్యాలీలో రేవంత్‌రెడ్డి, నాగం, సంపత్‌కుమార్ తదితరులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ''రాష్ట్రంలో దుర్మార్గ పరిస్థితులు దాపురించాయి. పదో తరగతి ప్రశ్నపత్రాలు వాట్సాప్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరుకుతున్నాయి. ఇన్నాళ్లూ భూములు, కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు కొల్లగొట్టారు. ఇప్పుడు లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను బలిపెట్టి ప్రశ్నపత్రాలు అమ్ముకుంటున్నారు. ఇదేనా తెలంగాణ మోడల్?'' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రశ్నపత్రాల లీకేజీకి కారణం సీఎం కేసీఆర్ కుమారుడు, మంత్రి కేటీఆర్ అని ఆరోపించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. యువతకు ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని కేసీఆర్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటివరకు యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని, నిరుద్యోగ భృతీ ఇవ్వలేదని చెప్పారు. అలాంటి కేసీఆర్ ఇప్పుడు అంబేడ్కర్ పేరుచెప్పి మళ్లీ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.

పాలమూరును అవమానించారు

కల్వకుర్తి, జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో కట్టినవేనని రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ కరీంనగర్ నుంచి పారిపోయి పాలమూరుకు వలస వస్తే ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపించారని.. కానీ కేసీఆర్ పాలమూరును అవమానించారని మండిపడ్డారు. తొమ్మిదేళ్లయినా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలోనే మహబూబ్‌నగర్‌కు పాలమూరు యూనివర్సిటీ వచ్చిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నిధులన్నీ సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కు తరలుతున్నాయని ఆరోపించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత కూడా కేసీఆర్‌కు లేదు

కేసీఆర్ కుటుంబ సభ్యులుగానీ, బంధువులు కానీ తెలంగాణ కోసం ప్రాణాలు కోల్పోలేదని.. తెలంగాణ కోసం ప్రాణాలు ఇచ్చింది బడుగు, బలహీనవర్గాలకు చెందిన పేదింటి బిడ్డలేనని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సెక్రటేరియట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టామని కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారని.. మరి పంజాగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం పెడతానని వి.హనుమంతరావు కోరితే ఎందుకు అనుమతించలేదని నిలదీశారు. మంత్రివర్గంలో ఒక్క మాదిగకు కూడా చోటు ఇవ్వలేదేమని ప్రశ్నించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తాకేందుకు కూడా కేసీఆర్‌కు అర్హతలేదని వ్యాఖ్యానించారు.

వనపర్తి సభతోనే తెలంగాణకు బీజం

కేవలం సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పోరాటం చేస్తేనే తెలంగాణ రాలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. 2000వ సంవత్సరంలో కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి ఆధ్వర్యంలో 42మంది ఎమ్మెల్యేలు తెలంగాణ ఏర్పాటు చేయాలని సంతకాలు చేసి సోనియాగాంధీకి లేఖ ఇచ్చారని.. అదే మలిదశ ఉద్యమానికి బీజం వేసిందని చెప్పారు. అప్పుడు వనపర్తిలో సభపెడితే 50వేల మంది వచ్చారని.. దీన్ని గ్రహించిన కేసీఆర్ తెలంగాణ నినాదం ఎత్తుకున్నారని పేర్కొన్నారు. శ్రీకాంతాచారి, కృష్ణయ్య వంటివారు ప్రాణత్యాగాలు చేస్తే తెలంగాణ వచ్చిందన్నారు.

మీ బిడ్డను సంపుకుంటారో.. సాదుకుంటారో..

పాలమూరు బిడ్డకు రాష్ట్ర కాంగ్రెస్ రథసారథిగా సోనియాగాంధీ అవకాశం ఇచ్చారని.. మీ బిడ్డను సంపుకుంటారో, సాదుకుంటారో మీరే ఆలోచించుకోవాలని ప్రజలకు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 14 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సరూర్‌నగర్‌లో విద్యార్థి నిరుద్యోగ, నిరసన ర్యాలీకి మే మొదటి వారంలో ప్రియాంకా గాంధీ వస్తున్నారని.. పాలమూరు నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వీహెచ్, చిన్నారెడ్డి, నాగం జనార్దనరెడ్డి, రాములు నాయక్, మల్లురవి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘించిన సీఎంవో

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయ ప్రారంభోత్సవం అధికారిక కార్యక్రమమైనా ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్కడా ప్రొటోకాల్ పాటించలేదని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే తెలంగాణ సచివాలయం, అమరవీరుల స్తూపం, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంలో జరిగిన అవినీతి నిగ్గుతేల్చి దోషులను కఠినంగా శిక్షిస్తామని.. తన ట్వీట్‌లో రేవంత్ స్పష్టం చేశారు.

ఆందోళనలో అన్నదాత

- వరుసగా రోజూ కురుస్తున్న వర్షాలు
- పలు మార్కెట్ యార్డుల్లో కొట్టుకుపోయిన ధాన్యంకుప్పలు
- వర్షాలకు తడిచి మొలకెత్తిన ధాన్యం

సాక్షి, నెట్‌వర్క్: వరుసగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. చాలాచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. ఏంచేయాలో రైతులకు పాలుపోవడంలేదు. జగిత్యాల జిల్లా మల్యాల మార్కెట్ యార్డులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం మొలకెత్తింది. వందల క్వింటాళ్లు మొలకెత్తడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కథలాపూర్, జగిత్యాల రూరల్, మెట్‌పల్లి తదితర మండలాల్లో ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. మామిడికాయలు రాలిపోయాయి. నువ్వు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి, రామగుండం, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి తదితర మండలాల్లో ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. రాజన్న సిరిసిల్లజిల్లాలోని రుద్రంగి మండలంలో వడగళ్లవానకు కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కొట్టుకుపోయింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. నకిరేకల్, తిరుమలగిరి, రహీంఖాన్‌పేటలోని మార్కెట్లలో రైతులు ఆరబోసుకున్న ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది. కామారెడ్డి జిల్లాలో బిచ్కుందలోని మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం భారీ వర్షానికి కొట్టుకుపోయి సమీపంలోని డ్రెయినేజీలో కలిసింది.

శ్మశానంలోనూ ధాన్యం ఆరబోత

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభిస్తామని చెప్పినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కొన్నిచోట్ల కొనుగోళ్లు జరుగుతున్నా మిల్లులకు తరలింపులో జాప్యం జరుగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం సోములగూడెంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించాల్సిన చోట రైతులు 20 రోజుల క్రితం ధాన్యం తెచ్చి ఆరబోశారు. ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేపట్టి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే మిగతా రైతులకు చోటు దక్కేది. కానీ కొనుగోళ్లే మొదలు కాకపోవడంతో నిర్దేశిత ప్రాంతం నిండిపోగా.. ఆనుకుని ఉన్న శ్మశానం (వైకుంఠధామం)లోనూ ధాన్యం ఆరబోసి రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారు. ఆకాశం మేఘావృతం కావడమే కాక చిరుజల్లులు కురుస్తుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. కాగా, సూర్యాపేట జిల్లా, పెద్దపల్లి జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు గొర్రెకాపరులు మృతి చెందారు.

ఈ శతాబ్దపు అద్భుత కట్టడం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర సచివాలయ భవనం రాష్ట్రంలో ఈ శతాబ్దపు అద్భుత కట్టడమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అభివర్ణించారు. సీఎం కేసీఆర్ దార్శనికతకు ఈ భవనం నిలువెత్తు నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం నిర్మిస్తున్న నూతన పార్లమెంట్ భవనం కంటే విశాలమైన సచివాలయ భవనంలో ఎన్నో అత్యాధునిక వసతులున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులు, సిబ్బంది అంతా ఒకే భవనంలో పనిచేసేలా ఉన్న సచివాలయం.. తెలంగాణలో మినహా దేశంలో మరెక్కడా లేదని స్పష్టం చేశారు.

'సమాచార' స్పెషల్ కమిషనర్‌గా అశోక్ రెడ్డి బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా కోరం అశోక్ రెడ్డి ఆదివారం డా.బి.ఆర్.అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం రెండవ అంతస్తులోని తన సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాఖ స్పెషల్ కమిషనర్‌గా, రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఈఓ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లే, జాయింట్ డైరెక్టర్లు జగన్ అభినందించారు.

5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ఉత్తర్వులు విడుదల చేసిన ఆర్థిక శాఖ

- పేర్ల వారీగా నియామక ఉత్తర్వులు ఇవ్వాలని ఆయా శాఖలకు సూచన
- ఖాళీ పోస్టుల స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించాలని ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఉన్న 40 విభాగాల్లోని 5544 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. కొత్త సచివాలయం ప్రారంభం సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై సీఎం కేసీఆర్ సంతకం చేసిన గంటల్లోనే ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదివారం జీవోనెం: 38 విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించనున్నారు. ఆయా శాఖల అధికారులు పంపిన ప్రతిపాదనల మేరకు శాఖల వారీగా ఇప్పటికే ప్రభుత్వం అనుమతించిన పోస్టుల్లో మాత్రమే రెగ్యులర్ చేసిన కాంట్రాక్టు ఉద్యోగులను నియమించాల్సి ఉంటుంది. ఇందుకోసం అన్ని శాఖల విభాగాధిపతులు క్రమబద్ధీకరణ పొందుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల పేర్లతో విడివిడిగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న మంజూరీ పోస్టుల్లో మాత్రమే సదరు ఉద్యోగులను నియమించాలని, అర్హత ఉన్న సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరగకూడదని, క్రమబద్ధీకరణకు అవసరమైన సర్టిఫికెట్లను సమగ్రంగా పరిశీలించాలని కూడా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నియామక ఉత్తర్వు అందజేసిన నాటి నుంచి ఈ క్రమబద్ధీకరణ అమలవుతుందని వెల్లడించారు. పౌరసరఫరాలు, అటవీ, సాధారణ పరిపాలన, ఉన్నత విద్య, వైద్య, ఆరోగ్యం, న్యాయశాఖ, కార్మిక, ఉపాధి, పంచాయతీరాజ్, రెవెన్యూ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల్లో 5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారు.

పీఎం పనిచేస్తుంటే... మన సీఎం నిద్రపోతున్నారు!

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్య

- కుక్క కరిచినా, నాలాలో పడి ప్రాణాలు పోతున్నా సీఎం స్పందించరు
- ఒవైసీ కళ్లలో ఆనందం కోసమే కొత్త సచివాలయ నిర్మాణం



సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: దేశాభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రోజంతా పని చేస్తుంటే... తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ నిద్రపోతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ప్రధాని రోజుకు 18 గంటలు పనిచేస్తుంటే కేసీఆర్ రోజుకు నాలుగు గంటలు మాత్రమే పనిచేస్తున్నారని, మిగతా సమయమంతా పెగ్గులు, బాటిళ్లతో గడుపుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాలాలో పడి చిన్నారి మరణించిన ఘటన తెలంగాణ ప్రజానీకాన్ని కలిచివేసిందని, కానీ సీఎం కేసీఆర్ మాత్రం కనీసంస్పందించలేదని దుయ్యబట్టారు. ఇటీవల విశ్వనగరంలో కుక్క కాటుతో ఓ చిన్నారి మరణించినా సీఎం స్పందించలేదన్నారు. ప్రధాని మోదీ మన్‌కీబాత్ వందో ఎపిసోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి మాట్లాడారు. నూతన సచివాలయ నిర్మాణంలో తెలంగాణ ప్రాశస్త్యం కనిపించడం లేదని, ఇతర రాష్ట్రాల్లో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు కనిపించేలా నిర్మాణాలు చేపడితే తెలంగాణలో మాత్రం ఒవైసీ కళ్లలో ఆనందం కోసమే నిర్మాణం చేసినట్లుందన్నారు. ఏ సర్వే చూసినా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతోందనే నివేదికలు వస్తున్నాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి పోటీచేస్తాయని ప్రజలు అనుకుంటున్నారని, అందుకే కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నిస్తున్నారన్నారు.

ఒంటరిగానే పోటీచేస్తాం...

బీజేపీ ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి వస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు కమీషన్ల కక్కుర్తిలో మునిగితేలుతున్నారని, దళితబంధులో కొన్నేళ్లుగా కమీషన్లు తీసుకుంటుంటే సీఎంకు ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని మండిపడ్డారు.

కొన్ని చానళ్ల తీరు మారాలి

కాచిగూడ: కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేవరకు పోరాడాలని, మీకు అండగా బీజేపీ ఉంటుందని బండి సంజయ్ అన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. తాను సచివాలయంపై ఉన్న బానిస చిహ్నాలను తొలగిస్తానన్నానే తప్ప సచివాలయాన్ని కూలుస్తానని చెప్పలేదని, కొన్ని టీవీ చానళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, సరిదిద్దుకోవాలని హితవు పలికారు.

ప్రతి పేదవాడికీ ఇల్లు కావాలి

- వైట్‌హౌజ్ లాంటి బంగ్లాలు కాదు
- తెలంగాణ తెచ్చుకుంది పేదల కోసం
- ఆలేరులో జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క
- యాదాద్రి జిల్లాలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర




పెంబర్తి వద్ద తాటిముంజలు తింటున్న భట్టి, పక్కన పొన్నాల లక్ష్మయ్య

సాక్షి, యాదాద్రి, జనగామ: ప్రతి పేదవాడికి ఇల్లు కావాలని.. వైట్‌హౌజ్ లాంటి బంగ్లాలు కాదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అద్భుతంగా ఉండే పాలకుల ప్యాలెస్ కోసం తెలంగాణ తెచ్చుకోలేదని ఎద్దేవా చేశారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం 45వ రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లా సరిహద్దు ఆలేరు మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సాయంత్రం ప్రారంభమైన పాదయాత్ర శ్రీనివాసపురం, పటేల్‌గూడెం, గుండ్లగూడెం మీదుగా ఆలేరు పట్టణానికి చేరుకుంది. ఆలేరులోని రైల్వేగేట్ వద్ద టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య అధ్యక్షతన జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ సంపద మొత్తం 4 కోట్ల మంది ప్రజలకు సమానంగా పంచుకోవడానికి తెచ్చుకుంటే దురదృష్టవశాత్తూ కేసీఆర్ కుటుంబంతో పాటు వారితో మమేకమైన వారు దోచుకుతింటున్నారని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆలేరు మాజీ ఎమ్మెల్యే ఆరుట్ల కమలాదేవి ఈ ప్రాంతంలో భూములు పంచితే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సునీతకు ప్రజల మీద కంటే భూములపైన, వెంచర్లపైన, భూకబ్జాలపైన ప్రేమ ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె. నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సచివాలయం వల్ల ప్రజలకు ప్రయోజనమేమిటి?

పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యతో కలిసి ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆకలి కేకలు పట్టించుకోకుండా.. ఇళ్లు లేక ప్రజలు, ఉద్యోగాలు లేక యువత అల్లాడిపోతుంటే ప్రభుత్వం కొత్త సచివాలయం నిర్మించడం వల్ల కలిగే ప్రయోజనమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, నిరుద్యోగుల ఉసురు ఈ ప్రభుత్వానికి తప్పకుండా తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.

ఈ రెండ్రోజులూ తక్కువ ఉష్ణోగ్రతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. సముద్రమట్టం నుంచి సగటున 1.5కి.మీ. ఎత్తులో ఉన్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఈ రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రెండ్రోజులు ఉష్ణోగ్రతలు కూడా తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదు అవుతాయని వివరించింది. ఆదివారం రాష్ట్రంలో... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 35.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 19.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	35.6	28.4
నల్లగొండ	35.5	22.4
భద్రాచలం	35.2	24.5
మహబూబ్‌నగర్	34.4	23.9
రామగుండం	34.0	23.9
హనుమకొండ	33.0	22.0
మెదక్	33.0	22.0
నిజామాబాద్	32.5	22.6
హైదరాబాద్	32.2	24.4
హకీంపేట్	32.0	23.5
దుండిగల్	32.0	22.8
ఆదిలాబాద్	30.3	19.7



మంచి మాట

విడదియ్యరాని శ్రమ

శ్రమ నుంచి శ్రామికుల్ని, శ్రామికుల నుంచి శ్రమను ఎలా అయితే విడదియ్యలేమో అలా ప్రపంచం నుంచి శ్రమను, శ్రామికులను విడదియ్యలేం. శ్రమలేందే శ్రామికులు లేరు; శ్రామికులు లేందే శ్రమలేదు; శ్రమ, శ్రామికులు లేందే ప్రపంచం లేదు. మనిషికి ప్రపంచం ఆధారం; ప్రపంచానికి శ్రామికుడు ఆధారం. ప్రతి మనిషికి శ్రామికుడి అవసరం ఉంది; ప్రతిమనిషీ శ్రామికుడు అవ్వాల్సిన అవసరం ఉంది.

మన ఈ ప్రపంచం మనకు ఇవాళ ఇలా ఉందీ అంటే అది శ్రామికులు శ్రమిస్తూనే ఉన్నందువల్ల వచ్చిన ఫలితమే. శ్రమతో శ్రామికులు సృజించిన ఆకృతి ప్రపంచం. శ్రమతో, శ్రమలో శ్రామికుడు జీవనం చేస్తున్నందువల్లే ప్రపంచానికి స్థితి, ద్యుతి ఉన్నాయి. అవి మనకు ఆలవాలమూ అయినాయి. మన మనుగడ సాగేందుకు అవి మనతో, మనకై ఉన్నాయి.

'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదు' అని కవి శ్రీశ్రీ అన్నారు. శ్రమైకజీవనం సౌందర్యమై ప్రపంచం మొత్తానికి సౌందర్యాన్ని తీసుకు వచ్చింది! శ్రమ అన్నదాన్ని ఉప్పు చేసి ఊహించుకుంటే ప్రపంచం వికృతంగా ఉంటుంది. శ్రమైక జీవనం అన్నది సౌందర్యం మాత్రమేనా? కాదు. శ్రమైక జీవనం ఈ ప్రపంచానికి లభించిన సౌభాగ్యం కూడా. అనాదిగా ప్రపంచం పొందిన ప్రగతికి కారణం శ్రామికుడు. శ్రామికుడు ప్రపంచానికి సౌందర్యప్రదాత. శ్రామికుడు ప్రపంచానికి సౌభాగ్య ప్రదాత.

అటువంటి శ్రామికుడికి, అతడి శ్రమకు న్యాయం జరుగుతోందా? అనాదిగానే అది లేదు అన్నది క్షేత్ర వాస్తవంగా మనకు ప్రస్ఫుటంగా తెలుస్తూనే ఉంది.'మన ప్రపంచంలో చాలా విషయాలు అన్యాయం; / పత్తిని నాటని వాళ్లు శ్రేష్ఠమైన పత్తి బట్టలు కట్టుకుంటారు. / అంతే కాదు పొలంలో పని చెయ్యని వాళ్లు తెల్లటి బియ్యం తింటారు' అని అంటూ చైనాలోని ఒక అజ్ఞాత యూనాన్ జానపద కవి వందలయేళ్ల క్రితమే ఆవేదనను వ్యక్తపరిచాడు. చిందిన చెమటకు అందిన ఫలం చాలని స్థితి ఎప్పటి నుంచో ఉంది.

> ఏ ఒక్కరోజో శ్రామికుల రోజు అవదు. ప్రతిరోజూ శ్రామికుల రోజే. సూర్యోదయంతో మొదలయ్యే ప్రతి దినమూ శ్రామికుల దినమే! శ్రమ అన్నది చిందే దినమే! శ్రమ చిందనిదే, శ్రామికులు పని చెయ్యనిదే ఏ దినమూ గడవదు కదా? ఆది, సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని అంటూ ఒక్కో పేరుతో ఒక్కో దినం ఉంది. ఏ పేరుతో ఉన్న దినమైనా శ్రమ, శ్రామికుల అభినివేశంతోనే అది దినంగా నడుస్తుంది. గడుస్తుంది. ప్రతిదినమూ శ్రామికుల దినమే!


ఈ పరిస్థితి ఇకనైనా మారాలి. శ్రమకు, శ్రామికుడికి తగిన ఫలం దక్కాలి. 'మేఘాలు తియ్యటి నీరును ఇచ్చినట్టుగా, తేనెటీగలు తేనెను ఇచ్చినట్టుగా నువ్వు పశువుల్లో పాలను సృష్టించావు. అదే విధంగా పగలంతా శ్రమించిన శ్రామికుడికి ధాన్యాది రూపంలో సంపదను ఇవ్వు' అంటూ వేదంలో ఒక దైవ ప్రార్థన ఉంది. శ్రామికుడికి న్యాయం జరగాలన్న ఆకాంక్ష కూడా ఎప్పటి నుంచో వస్తూనే ఉంది. ఇకనైనా శ్రమకు, శ్రామికులకు న్యాయం సాకారం కావాలి.

ఏడాదిలో ఏ ఒక్కరోజునో శ్రామికుల రోజు అనీ, ఆ రోజున ఏదో హడావిడి చేసేసి, ఉపన్యాసాలు ఇచ్చేసి ఆ తరువాత శ్రామికుల్ని నిర్లక్ష్యం చెయ్యడం ఇక చాలు. ప్రతి రోజూ శ్రామికులకు, శ్రమకు న్యాయం చేస్తూ మనం మన మనుగడను సౌందర్యవంతమూ, సౌభాగ్యవంతమూ చేసుకుందాం. శ్రామికులకు, శ్రమకు గౌరవాన్ని, మన్నను ఇస్తూ మనల్ని మనం గౌరవించుకుందాం; మనకు మనం మన్ననను కలిగించుకుందాం.

– రోచిష్మాన్

బౌద్ధవాణి

అజ్ఞానం అరటి ఊచ



వైశాలి నగరానికి దగ్గర్లో మహాకూటాగార శాల ఉంది. అప్పుడు బుద్ధుడు ఆ శాలలో ఉంటున్నాడు. ఆ విషయం ఆ చుట్టుపక్కల ఊళ్ళన్నింటికీ తెలిసింది. ప్రజలు, పండితులు తండోపతండాలుగా వెళ్ళి బుద్ధుని ప్రవచనాలు వింటున్నారు.

వైశాలి నగర శివారు గ్రామంలో సత్యకుడు అనే పండితుడు ఉన్నాడు. అతనికి ఈ విషయం తెలిసింది. 'నేనే మహా పండితుణ్ణి'' అనే అహంభావి. తన పాండిత్యంతో బుద్ధుణ్ణి ఓడిస్తే... మహా గౌరవం తనకే దక్కుతుంది అని అనుకున్నాడు. వెంటనే వైశాలికి వెళ్ళాడు. అక్కడ సత్యకుని అనుయాయులు కొందరున్నారు. వారందర్నీ వెంటబెట్టుకుని దారి పొడవునా గప్పాలు కొట్టుకుంటూ అమితోత్సాహంతో కూటాగార శాలకు వెళ్ళాడు.

''ఓ భిక్షువులారా! మీ గౌతమబుద్ధుడు ఎక్కడ! నేను అతనితో వాదానికి వచ్చాను'' అన్నాడు.

వారు దారి చూపించారు.

సత్యకుడు వెళ్ళే సమయానికి ఒక పున్నాగ చెట్టు కింద కూర్చొని ఉన్నాడు బుద్ధుడు. పున్నాగ పూలు రాలి నేలంతా పరుచుకున్నాయి. వెళ్ళి నమస్కరించాడు. తాను వచ్చిన విషయం చెప్పాడు.

''మిమ్మల్ని ప్రశ్నింపవచ్చా?'' అని అడిగాడు.

బుద్ధుడు కనిపించీ కనిపించని చిరునవ్వుతో సుముఖత తెలిపాడు.

ఆత్మ, జీవుడు, దుఃఖం, సంజ్ఞలు, సంస్కారాలు, రూపం, వేదనలు... ఇలా అనేక విషయాలపై వారిద్దరి మధ్య సంవాదం జరిగింది. మిగిలిన వారంతా మౌనంగా వింటూ ఉన్నారు.

ఇంతలో గాలి వీచింది. పున్నాగ పూలు జలజలా రాలాయి.

చివరగా.. ''సత్యకా! రూపమే నా ఆత్మ అన్నావు గదా! నీ రూపం నీ అదుపులో ఉంటుందా? నీవు కోరుకున్నట్లుగా నీ రూపం నీకు మారుతుందా? నా రూపం ఇలా బాగోలేదు. ఇలా ఉంటే బాగుంటుంది అనుకుని నీవు ఎలా అనుకున్నావో అలా మార్చుకోగలవా? ''నా రూపం ఇలా ఉండకూడదు'' అనుకుంటే ఉండకుండా పోతుందా?'' అని అడిగాడు.

సత్యకుడు చెప్పలేక మౌనం వహించాడు.

''ఐతే... రూపం ఎప్పుడూ మారకుండా ఉంటుందా? పరిణామం చెందదా?'' అని అడిగాడు.

సత్యకుడు మరలా మౌనం వహించాడు. అలాగే దుఃఖం, ఆత్మ ఇతర విషయాలూ అడిగాడు. తన మాటల చాతుర్యంతో తిమ్మిని బమ్మిని చేసే సత్యకుడు బుద్ధుని తత్వం ముందు తలదించాడు. తత్వ జ్ఞానమే శ్రేష్ఠమైందని గ్రహించాడు.

అతని ఇబ్బందిని బుద్ధుడు అర్థం చేసుకుని...

''సత్యకా! ఒకడు బలమైన చేవగల చెట్టు కోసం అన్వేషిస్తూ వెళ్ళాడు. ఒకచోట ఎత్తుగా, వంకలు లేకుండా, బలమైన కాండం, విశాలమైన ఆకులు ఉన్న చెట్టుని చూశాడు. ''దీని ఆకులు పెద్దవి, పైగా మిసమిసలాడుతూ నునుపుదేలి ఉంది. ఇదే నాకు తగింది'' అనుకున్నాడు. ఆ చెట్టుని పడగొట్టాడు. వేళ్ళు నరికాడు. ఆకులు కోశాడు, మొదలు నరికాడు. దానిపై పొర విప్పాడు. అలా ఒక్కొక పొరను విప్పుకుంటూ పోయాడు. చివరికి లోపల ఎలాంటి కాండం లేదు. చేవగల చోటే లేదు. మెత్తగా వీగిపోయే ఊచ మాత్రమే ఉంది. అదే అరటి చెట్టు. మనకు ప్రజ్ఞ లేని పరిజ్ఞానం ఇలాంటిదే! తత్వం ఎరుగని తర్కం కూడా ఇంతే! ఒక్కొక్కటి వీగిపోయాక చివరికి మిగిలేది ఏమీ ఉండదు'' అన్నాడు.

సత్యకునికి అహం వీడింది. మోహం తొలగింది. క్షమాపణలు వేడాడు. శరణు పొందాడు!

– డా. బొర్రా గోవర్ధన్

గురువాణి

పాతకొత్తల గొడవ మనకెందుకు!!!

అభ్యుదయం అంటే సమాజానికి మేలు చేయడం. మనుషులలో మంచి గుణాలు ఏర్పడితే అది అభ్యుదయానికి కారణమవుతుంది. మేలు జరగడానికి పాతదా కొత్తదా అని కాదు... పాతదంతా మంచీ కాదు, కొత్తదంతా చెడూ కాదు. అలాగే పాతదంతా చెడూ కాదు, కొత్తవన్ని మంచివీ కావు. రామాయణ భారతాల్లో అన్నీ ఉన్నాయండీ అని కొత్త వాఙ్మయం దేనికండీ అనడం మంచిదికాదు. కొత్తగా వచ్చిన గ్రంథాలలో ఎన్నో మంచి విషయాలుంటాయి.

''పురాణమిత్యేవ న సాధు సర్వం/ నా చాపి కావ్యం నవమిత్యవద్యమ్/ సంతః పరీక్ష్యాన్యతరత్ భజంతే/ మూఢఃపరప్రత్యయనేబుద్ధిః'' అంటారు మాళవికాగ్నిమిత్రంలో మహాకవి కాళిదాసు. అంటే పాతకాలానికి సంబంధించినది కాబట్టి ఇందులో ఏదీ పనికొచ్చేదీ, మంచిదీ ఉండదు – అనకూడదు. పాతవన్నీ చెడ్డవని ఎలా సిద్ధాంతీకరిస్తారు! ఈ రచన ఇప్పుడు కొత్తగా వచ్చింది, వీటిలో మన మేలు కోరేవి ఏం ఉంటాయి, వీటిని మనం ఆదరించక్కరలేదు... అని చెప్పడమూ కుదరదు. వివేకవంతులు ఏం చేస్తారంటే... అందులో ఏదయినా మంచి చెప్పారా.. అని పరిశీలిస్తారు. జీవితాలకు అభ్యున్నతిని కల్పించే మాటలు ఏవయినా వాటిలో ఉన్నాయా... అని చూస్తారు. కానీ ఎవరో ఏదో చెప్పారని తన స్వంత బుద్ధిని ఉపయోగించకుండా, మంచీ చెడూ విచారణ చెయ్యకుండా వాటినే అనుకరిస్తూ, అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకోవడం మూఢుల లక్షణం. ..అంటున్నాడు కాళిదాసు.

> ఎవరో ఏదో చెప్పారని తన స్వంత బుద్ధిని ఉపయోగించకుండా, మంచీ చెడూ విచారణ చెయ్యకుండా వాటినే అనుకరిస్తూ, అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకోవడం మూఢుల లక్షణం అంటున్నాడు కాళిదాసు.

మనకు పనికొచ్చే విషయాలు ఎన్ని ప్రతిపాదింపబడ్డాయి.. అన్నదానిని పరిశీలించడం నిజమైన అభ్యుదయం. దాని విషయానికొస్తే అది పాతదా, కొత్తదా అని కాదు ఆలోచించాల్సింది, అందులో మంచి ఏముంది, ఇందులో మంచి ఏముంది? అని అంతకన్నా దాటి ఇక పరిశీలన చేయవలసిన అవసరం నాబోటివాడికి అక్కర లేదు. నా వరకు నాకు కావలసినది – అది ఎవరు రాసింది అయినా పాత కాలపుదయినా, కొత్తకాలపుదయినా, ఇప్పుడు సమాజంలో ఉన్న వ్యక్తులు రాసినది అయినా, పాతకాలంలో రుషుల వాఙ్మయం అయినా... అందులో అభ్యుదయానికి చెప్పబడిన మంచి విషయాలు ఏమున్నాయి? అనే. వాటిని స్వీకరించి, జీర్ణం చేసుకుని బాగుపడడానికి ప్రయత్నం చేయడం వరకే. పాతకాలంలో కూడా ఆదరణీయం కానివి, అంగీకార యోగ్యం కానివి, సమాజానికి ఉపయుక్తం కానివి ఎన్నో ఉండవచ్చు. అంతమాత్రం చేత పాతకాలంలో ఉన్న వాఙ్మయంలో పనికొచ్చేవి ఏవీ లేవు.. అని చెప్పడం సాధ్యం కాదు.

'పురాణమిత్యేవ న సాధు సర్వం ...' ఇది... ఆ కాలంలో కాళిదాసు చెప్పిన మాట. ఈ మాట ఇప్పటికి పనికి రాదా!!! ఇది నేర్చుకుంటే అభ్యుదయం కాదా!!! ఇది నేర్చుకున్నవాడి జీవితం ... చేత దీపం పట్టుకుని నడుస్తున్న వాడిలా ఉండదా? పువ్వు పువ్వు లోంచి తేనెబొట్టు స్వీకరించిన తేనెటీగ కాదా !!! అందువల్ల మంచి విషయాలు స్వీకరించడం ప్రధానం కావాలి. అవి ప్రాచీన వాఙ్మయం నుంచి కావచ్చు, కొత్తగా వెలువడుతున్న గ్రంథాలనుంచి కావచ్చు. వ్యక్తులందరూ అలా స్వీకరించాలి, మంచి గుణాలు అలవర్చుకోవాలి, ఆ వ్యక్తుల సమూహమే సమాజ అభ్యుదయానికి కారణమవుతుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

కొత్త కబురు



● అఖిల్

యువ హీరో అఖిల్ నటించిన 'ఏజెంట్' చిత్రం థియేటర్లలో సందడి చేస్తోంది. కాగా ఆయన నటించనున్న తర్వాతి చిత్రం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. కొత్త దర్శకుడు అనిల్ ఇటీవల అఖిల్‌కు ఓ కథ చెప్పారు. ఈ స్టోరీ నచ్చడంతో అఖిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ మూవీ నిర్మించనుందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెల్లడి కానుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్‌ను చిత్ర యూనిట్ సంప్రదించారని భోగట్టా.

క్రైమ్ థ్రిల్లర్

వెంకట్ హీరోగా రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహించనున్న చిత్రం షురూ అయింది. రవీందర్ రెడ్డి, శ్రీహరి, ఆదిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ ఆర్ట్స్ పతాకంపై ప్రవీణ్ రెడ్డి, వాసుదేవరావ్ నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ప్రారంభమైంది. దర్శకుడు వేణు ఊడుగుల కెమెరా స్విచ్చాన్ చేయగా, 'సుచిరిండియా' (రియల్ ఎస్టేట్) కిరణ్ క్లాప్ ఇచ్చారు. మొదటి సన్నివేశానికి దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి గౌరవ దర్శకత్వం వహించారు. రాజ్ తాళ్లూరి మాట్లాడుతూ–''క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ నెల 10 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తాం'' అన్నారు. ''రాజ్ స్క్రిప్ట్ బాగుంది. ఇది అందర్నీ మెప్పించే చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు ప్రవీణ్ రెడ్డి. ఈ మూవీ ప్రారంభోత్సవంలో నటుడు అలీ, నిర్మాత రామ్ తాళ్లూరి, నటుడు శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు.




● వెంకట్, రవీందర్

లవ్ అండ్ యాక్షన్

శేఖర్ అయాన్ వర్మ, వైభవి రావ్ జంటగా ఓ. సాయి దర్శకత్వం వహించిన లవ్ అండ్ యాక్షన్ ఫిల్మ్ 'కళ్యాణమస్తు'. బోయపాటి రఘుబాబు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ సినిమా ట్రైలర్‌ని నటుడు శివ బాలాజీ విడుదల చేసి, మాట్లాడుతూ– ''కళ్యాణమస్తు' ట్రైలర్ బాగుంది. అందరూ బాగా నటించారనిపిస్తోంది. అలాగే సాంకేతిక నిపుణుల ప్రతిభ ఏంటో తెలుస్తోంది'' అన్నారు. ''ప్రేక్షకులు కోరుకునే ప్రతి ఎమోషన్ ఈ సినిమాలో ఉంది'' అన్నారు శేఖర్ వర్మ. ''కళ్యాణమస్తు' మూవీ ఆడియన్స్‌ను మెప్పిస్తుంది'' అన్నారు ఓ.సాయి. ఈ కార్యక్రమంలో హీరోయిన్ వైభవీరావ్, నటుడు కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.



● శేఖర్, వైభవి



● అనుష్క


● నవీన్ పొలిశెట్టి

నా కూతురు పెళ్లి చేసుకోదు!

'పుడ్డేం మ్యాజిక్ కాదు.. ఇట్స్ ఎ సైన్స్' అంటూ 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సినిమా టీజర్ విడుదలైంది. అనుష్కాశెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. పి.మహేశ్‌బాబు దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు. ఈ చిత్రంలో చెఫ్ అన్విత రవళిశెట్టి పాత్రలో అనుష్క, స్టాండప్ కమెడియన్ సిద్ధు పాత్రలో నవీన్ పొలిశెట్టి నటించారు. 'నా కూతురు ఏమన్నా సామాన్యురాలనుకుంటున్నావా.. ఎప్పటికీ పెళ్లి చేసు కోదు.. పోయి ఇంకెవర్నైనా చూసుకోరా...'(జయసుధ), 'హాయ్.. ఐ యామ్ సిద్ధు. ఫుల్లీ ప్రొఫెషనల్ స్టాండప్ కమెడియన్. ఐ కెన్ డు క్రిప్టోకరెన్సీ జోక్స్.. ఆల్దో ఐ హావ్ నో కరెన్సీ..'(నవీన్ పొలిశెట్టి), 'నీ టైమింగ్ ఎప్పుడూ ఇంతేనా..'(అనుష్కా శెట్టి), 'కామెడీ టైమింగ్ మాత్రం పర్ఫెక్ట్‌గా ఉంటుంది మేడమ్' (నవీన్ పొలిశెట్టి)... వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ మూవీకి సంగీతం: రధన్.

రామబాణం మంచి సినిమా

– గోపీచంద్



● వివేక్ కూచిభొట్ల, గోపీచంద్, డింపుల్ హయతి, శ్రీవాస్

''రామబాణం'లాంటి మంచి కథ ఇచ్చిన భూపతి రాజాగారికి థ్యాంక్స్. మంచి కమర్షియల్ ఫార్మాట్‌లో అద్భుతమైన ఎమోషన్స్‌తో ఈ కథ ఉంటుంది.. దాన్ని అంతే బాగా తీశాడు శ్రీవాస్. మా గత చిత్రాలు 'లక్ష్యం, లౌక్యం' లాగా 'రామబాణం' లోనూ మంచి వినోదం, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి'' అని హీరో గోపీచంద్ అన్నారు. శ్రీవాస్ దర్శకత్వంలో గోపీచంద్, డింపుల్ హయతి జంటగా నటించిన చిత్రం 'రామబాణం'. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో గోపీచంద్ మాట్లాడుతూ– ''విశ్వ ప్రసాద్, వివేక్‌గార్లు ఎంత మంచి నిర్మాతలంటే.. ఏది కావాలని అడిగినా.. 'ఇది ఎందుకు?' అని అడగరు.. అలాంటి మంచి మనసున్న వారికి మంచి జరగాలి. 'రామబాణం' చాలా మంచి సినిమా అవుతుంది. ఈ చిత్రం తర్వాత డింపుల్‌కి మంచి భవిష్యత్ ఉంటుంది. 'లక్ష్యం' తర్వాత జగపతి బాబుగారు, నేను మళ్లీ ఈ చిత్రంలో అన్నదమ్ముల్లా చేశాం.. ఆయనతో చేస్తుంటే యాక్టర్ అని కాకుండా సొంత బ్రదర్‌లా అనిపిస్తారు.. అందుకే మా ఇద్దరి మధ్య సన్నివేశాలు, ఎమోషన్స్ బాగా పండాయి. నాది, అలీగారి కాంబినేషన్ చాలా బాగుంటుంది. 5న వస్తున్న 'రామబాణం' మీ అందరికీ (ఫ్యాన్స్, ఆడియన్స్) నచ్చుతుంది'' అన్నారు.

డైరెక్టర్ శ్రీవాస్ మాట్లాడుతూ – ''రామబాణం' నిర్మాతలు విశ్వప్రసాద్, వివేక్‌గార్లు, నా లక్కీ హీరో గోపీచంద్‌గారు.. ఎలాంటి వివాదాలు లేకుండా పాజిటివ్‌గా ఉంటారు. అలా మా అందరి కాంబినేషన్‌లో సినిమా అనగానే ఓ పాజిటివ్ వైబ్రేషన్. హ్యాట్రిక్ కాంబినేషన్ అంటూ మా మనసులో ఓ ఆలోచన తిరుగుతూ ఉండేది.. అది మాకు మరింత నమ్మకాన్ని, సంకల్పాన్ని ఇచ్చింది. 'రామబాణం' ఫస్ట్‌కాపీ చూసిన తర్వాత నా అసిస్టెంట్ డైరెక్టర్స్.. 'టెక్నీషియన్స్ అని మరచిపోయి సినిమా చూశాం' అన్నారు.. అంటే సినిమాలో అంత లీనమయ్యారు.. ప్రేక్షకులు కూడా ఇదే అనుభూతికి లోనవుతారు. మా 'లక్ష్యం, లౌక్యం'లకు మించి 'రామబాణం' పెద్ద హిట్ కావాలి. ఈ సినిమా ఎట్టి పరిస్థితిల్లోనూ గోపీచంద్‌గారి అభిమానుల అంచనాలకు తగ్గదు'' అన్నారు.

సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ–''రామబాణం' లాంటి మంచి సినిమా తీశాం. ఈ చిత్రానికి మీరు(ప్రేక్షకులు) మంచి విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాం'' అన్నారు. ''గోపీచంద్ 30 సినిమాలు చేస్తే దాదాపు 25 సినిమాల్లో తనతో కలిసి నేను నటించాను''అన్నారు **నటుడు అలీ.** ఈ వేడుకలో నిర్మాత కేకే రాధామోహన్, డైరెక్టర్స్ మారుతి, సంపత్ నంది, కార్తీక్ దండు, హర్ష, రచయిత కోనా వెంకట్, నటులు సోనియా చౌదరి, కాశీ విశ్వనాథ్, సప్తగిరి, తరుణ్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షని మించిన హిట్ తీయాలి

– 'దిల్' రాజు

''సాయిధరమ్‌తో నేను మూడు సినిమాలు తీశాను. తన కెరీర్‌లో 'విరూపాక్ష' హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. ఇది నాకు సవాల్‌లాంటిదే. తనతో నేను సినిమా చేస్తే 'విరూపాక్ష' కంటే ఇంకా పెద్ద సినిమాను, దాన్ని మించి హిట్ కొట్టే మూవీ తీయాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు బి.సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 21న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ– ''విరూపాక్ష'ని హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. ఆ మాట చెప్పడంలో ఆనందం ఉంది. మా సినిమాని ఈ నెల 5న హిందీ, తమిళ్, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. అలాగే మే 12న కన్నడలో విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''మా బ్యానర్‌కి 'విరూపాక్ష' లాంటి పెద్ద సక్సెస్ ఇచ్చిన మా టీమ్‌కి, ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు.బి.

''విరూపాక్ష' ని మళ్లీ మళ్లీ చూసి మమ్మల్ని ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు కార్తీక్ దండు. ''విరూపాక్ష' ఇతర భాషల్లోనూ అద్భుతాలు సృష్టిస్తుందని భావిస్తున్నాం'' అని సంయుక్తా మీనన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ శ్యామ్ దత్, చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు, 'విరూపాక్ష' మూవీ పంపిణీదారులు పాల్గొన్నారు.



● బీవీఎస్ఎన్ ప్రసాద్, 'దిల్'రాజు, సాయిధరమ్ తేజ్, కార్తీక్, సంయుక్త, బాపినీడు

వారికి సమాధానమే నరకాసుర

– రక్షిత్ అట్లూరి

''ఒక టీజర్ ఇంపాక్ట్ ఏంటో 'పలాస' సినిమా టైమ్‌లో చూశాను. ఆ మూవీ తర్వాత నాకు గ్యాప్ రావడంతో అందరూ హేళనగా మాట్లాడారు.. అలాంటి వారికి సమాధానమే 'నరకాసుర'' అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. సెబాస్టియన్ దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'నరకాసుర'. సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిల్మ్ మేకర్స్‌పై అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ– ''రక్షిత్‌ని కలిసినప్పుడు యంగ్ డేస్‌లో జగపతి బాబు ఎలా ఉన్నాడో అలాగే ఉన్నాడనిపించింది. 'నరకాసుర' అతన్ని మంచి స్థాయికి తీసుకువెళుతుంది'' అన్నారు. ''నరకాసుర' టీజర్ చూస్తే 'కాంతారా' రేంజ్‌లో ఉందనిస్తోంది'' అన్నారు కెమెరామేన్ సెంథిల్ కుమార్. ''తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మళయాల, కన్నడ భాషల్లో మా చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు అజ్జా శ్రీనివాస్. ''ఈ చిత్రంతో కచ్చితంగా సక్సెస్ అందుకుంటాం'' అన్నారు సెబాస్టియన్. ఈ కార్యక్రమంలో నిర్మాత దామోదర ప్రసాద్, అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, సంగీతం: ఏఐఎస్ నాఫాల్ రాజా.



● సంకీర్తన విపిన్, రక్షిత్, అపర్ణ జనార్దన్



సెర్జియో పెరెజ్‌కు టైటిల్

ఫార్ములావన్ సీజన్‌లో భాగంగా ఆదివారం జరిగిన అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ సెర్జియో పెరెజ్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 51 ల్యాప్‌లను పెరెజ్ అందరికంటే వేగంగా ఒక గంటా 32 నిమిషాల 42.436 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. రెడ్‌బుల్‌కే చెందిన వెర్‌స్టాపెన్‌కు రెండో స్థానం, చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ)కు మూడో స్థానం లభించాయి. ఈ సీజన్‌లో నాలుగు రేసులు జరగ్గా... పెరెజ్‌కిది రెండో విజయం. మిగతా రెండు రేసుల్లో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఐదో రేసు మయామి గ్రాండ్‌ప్రి ఈనెల 7న జరుగుతుంది.

మేరాజ్-గనీమత్ జోడీకి స్వర్ణం



షాట్‌గన్ షూటింగ్ ప్రపంచకప్ టోర్నీ స్కీట్ ఈవెంట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మేరాజ్ అహ్మద్ ఖాన్-గనీమత్ సెఖో (భారత్) జోడీ విజేతగా నిలిచింది. కైరోలో జరిగిన ఫైనల్లో మేరాజ్-గనీమత్ ద్వయం 6-0తో లూయిస్ రౌల్-గాబ్రియేలా రోడ్రిగ్వెజ్ (మెక్సికో) జంటను ఓడించి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.

పంజాబ్ బల్లే బల్లే...

ఆఖరి బంతికి చెన్నైపై గెలుపు

రాణించిన ప్రభ్‌సిమ్రన్, లివింగ్‌స్టోన్

కాన్వే పోరాటం వృథా



సికందర్ రజా సంబరం

చెన్నై: సొంత మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చేసిన స్కోరు 200. లక్ష్యం అంత పెద్దగా ఉంటే ఛేదించే బ్యాటర్స్‌కు ఆద్యంతం ఒత్తిడే ఉంటుంది. భారీ షాట్లు, మెరుపు ఫిఫ్టీలు ఉండాల్సిందే. కానీ పంజాబ్ కింగ్స్ మాత్రం ఒక్క అర్ధశతకం, ఏ ఒక్కరి విధ్వంసం లేకపోయినా... సమష్టి వీరవిహారంతో కొండంత లక్ష్యాన్ని కరిగించి నాలుగుసార్లు చాంపియన్ చెన్నైకు చెక్ పెట్టింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ నాలుగు వికెట్ల తేడాతో నెగ్గి తమ ఖాతాలో ఐదో విజయం నమోదు చేసుకుంది. మొదట చెన్నై 20 ఓవర్లలో 4 వికెట్లకు 200 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కాన్వే (52 బంతుల్లో 92 నాటౌట్; 16 ఫోర్లు, 1 సిక్స్), రుతురాజ్ (31 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్)తో ఓపెనింగ్ వికెట్‌కు 86 పరుగులు జోడించాడు. తర్వాత శివమ్ దూబే (17 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో రెండో వికెట్‌కు 44 పరుగులు జతచేశాడు. అనంతరం క్రీజులో వచ్చిన వారు తక్కువే చేసినా తన జోరుతో కాన్వే భారీస్కోరుకు బాటవేశాడు.

కలిసిమెలిసి ధాటిగా ఆడి...

తర్వాత లక్ష్యానికి తగ్గ దీటైన పోరాటం చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి గెలిచింది. ఇంత పెద్ద లక్ష్యఛేదనలో క్రీజులోకి దిగిన వారంతా భాగస్వాములయ్యారు. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ (24 బంతుల్లో 42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శిఖర్ ధావన్ (15 బంతుల్లో 15; 4 ఫోర్లు, 1 సిక్స్), లివింగ్‌స్టోన్ (24 బంతుల్లో 40; 1 ఫోర్, 4 సిక్సర్లు), స్యామ్ కరన్ (20 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్), జితేశ్ శర్మ (10 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), సికందర్ రజా (7 బంతుల్లో 13 నాటౌట్; 1 ఫోర్) మెరుపులు జత చేయడంతో పంజాబ్ కింగ్స్ గెలిచింది.

ఆఖరి బంతిపై అందరి దృష్టి

ధాటిగా ఆడుతున్న జితేశ్ 19వ ఓవర్లో భారీషాట్ ఆడి పెవిలియన్ చేరాడు. ఇక 8 బంతుల్లో పంజాబ్ విజయానికి 15 పరుగులు కావాలి. సికందర్ రజా బౌండరీ, వైడ్, ఓ పరుగుతో 6 పరుగులొచ్చాయి. సమీకరణం 6 బంతుల్లో 9 పరుగులు. పతిరణ వేసిన ఈ ఓవర్లో తొలి మూడు బంతులకు 2 పరుగులే వచ్చాయి. ఉన్నపళంగా ఉత్కంఠ తారస్థాయికి చేరింది. రజా 4, 5 బంతులకు రెండేసి పరుగుల చొప్పున తీశాడు. ఇక ఆఖరి బంతికి 3 పరుగుల్ని కట్టడి చేసేందుకు ధోని తలమునకలై ఉన్నాడు. కొంత సమయం తర్వాత పడిన ఈ బంతిని రజా స్క్వేర్ లెగ్ దిశగా బాదగా, జడేజా బౌండరీనైతే ఆపాడు. కానీ ఈ లోపే రజా, షారుఖ్‌లు 3 పరుగులు పూర్తి చేయడంతో పంజాబ్ శిబిరం సంబరాలు చేసుకుంది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	0.638
లక్నో	8	5	3	10	0.841
రాజస్తాన్	9	5	4	10	0.800
చెన్నై	9	5	4	10	0.329
పంజాబ్	9	5	4	10	-0.447
బెంగళూరు	8	4	4	8	-0.139
ముంబై	8	4	4	8	-0.502
కోల్‌కతా	9	3	6	6	-0.147
హైదరాబాద్	8	3	5	6	-0.577
ఢిల్లీ	8	2	6	4	-0.898

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో x బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (స్టంప్డ్) జితేశ్ (బి) రజా 37; కాన్వే (నాటౌట్) 92; దూబే (సి)షారుఖ్ (బి) అర్ష్‌దీప్ 28; అలీ (స్టంప్డ్) జితేశ్ (బి) చహర్ 10; జడేజా (సి) లివింగ్‌స్టోన్ (బి) కరన్ 12; ధోని (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 200. వికెట్ల పతనం:** 1-86, 2-130, 3-158, 4-185. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-1, రబడ 4-0-34-0, స్యామ్ కరన్ 4-0-46-1, చహర్ 4-0-35-1, సికందర్ రజా 3-0- 31-1, లివింగ్‌స్టోన్ 1-0-16-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 42; ధావన్ (సి) పతిరణ (బి) తుషార్ 28; అథర్వ (సి అండ్ బి) జడేజా 13; లివింగ్‌స్టోన్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 40; కరన్ (బి) పతిరణ 29; జితేశ్ (సి) సబ్-రషీద్ (బి) తుషార్ 21; షారుఖ్ (నాటౌట్) 2; రజా (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం** : 1-50, 2-81, 3-94, 4-151, 5- 170, 6-186. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-35-0, తుషా ర్ 4-0-49-3, తీక్షణ 4-0-36-0, జడేజా 4-0-32-2, అలీ 1-0-10-0, పతిరణ 4-0-32-1.

సాత్విక్-చిరాగ్ జోడీ కొత్త చరిత్ర

- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో స్వర్ణం నెగ్గిన భారత జోడీగా రికార్డు
- 58 ఏళ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌లో భారత్‌కు పసిడి పతకం



స్వర్ణ పతకాలతో సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి

దుబాయ్: సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. 1965లో పురుషుల సింగిల్స్‌లో దినేశ్ ఖన్నా విజేతగా నిలిచి భారత్‌కు తొలిసారి పసిడి పతకం అందించాడు. 58 ఏళ్ల తర్వాత మళ్లీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ భారత్ పసిడి లోటు తీర్చింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్, మహారాష్ట్రకు చెందిన చిరాగ్ శెట్టి అద్భుత ఆటతీరుతో అదరగొట్టారు. 67 నిమిషాలపాటు జరిగిన హోరాహోరీ ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంక్ సాత్విక్-చిరాగ్ ద్వయం 16-21, 21-17, 21-19తో ప్రపంచ ఎనిమిదో ర్యాంక్ ఒంగ్ యె సిన్-తియో ఈ యి (మలేసియా) జోడీని ఓడించి చాంపియన్‌గా అవతరించింది. తద్వారా ఈ మెగా ఈవెంట్ చరిత్రలో పురుషుల డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకం నెగ్గిన తొలి భారతీయ జోడీగా చరిత్ర సృష్టించింది. 1971లో దీపూ ఘోష్-రమణ్ ఘోష్ ద్వయం భారత్‌కు కాంస్య పతకం అందించింది.

> తొలిసారి ఆసియా చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచినందుకు చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని టైటిల్స్ సాధిస్తాం. ముందుందు మరింత శ్రమించి దేశానికి పేరు ప్రతిష్టలు తెస్తాం. మేమిద్దరం ఈ పతకం కోసం ఎంతో కష్టపడ్డాం. ఎట్టకేలకు మేము ఈ టైటిల్ సాధించాం. మేమీ స్థాయికి చేరుకోవడానికి కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు.
> –సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి

'థౌజండ్'వాలాలో ముంబై మిలమిల

- మెరిపించిన సూర్య, గ్రీన్, టిమ్ డేవిడ్
- యశస్వి విధ్వంసం వృథా
- 6 వికెట్లతో రాజస్తాన్‌పై ముంబై గెలుపు



టిమ్ డేవిడ్



యశస్వి

ముంబై: ఐపీఎల్ 'థౌజండ్' వాలా (1000వ మ్యాచ్)లో యశస్వి జైస్వాల్ విధ్వంసాన్ని ముంబై మెరుపులు ముంచెత్తాయి. దీంతో ముంబై 6 వికెట్ల తేడాతో రాజస్తాన్‌పై గెలిచింది. తొలుత రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీస్కోరు చేసింది. యశస్వి జైస్వాల్ (62 బంతుల్లో 124; 16 ఫోర్లు, 8 సిక్సర్లు) శతక్కొట్టాడు. తర్వాత కష్టమైన లక్ష్యాన్ని ముంబై ఇండియన్స్ 3 బంతులు మిగిలుండగానే 19.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసి ఛేదించింది. గ్రీన్ (26 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యకుమార్ (29 బంతుల్లో 55; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ (14 బంతుల్లో 45 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలకపాత్ర పోషించారు. చివరి ఓవర్లో ముంబై విజయానికి 17 పరుగులు అవసరం కాగా ... హోల్డర్ వేసిన ఈ ఓవర్లో తొలి మూడు బంతులను టిమ్ డేవిడ్ సిక్సర్లుగా మలిచి గెలిపించాడు.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి అండ్ బి) అర్షద్ 124; బట్లర్ (సి) సబ్-రమణ్‌దీప్ (బి) చావ్లా 18; సామ్సన్ (సి) తిలక్ (బి) అర్షద్ 14; పడిక్కల్ (బి) చావ్లా 2; హోల్డర్ (సి) డేవిడ్ (బి) ఆర్చర్ 11; హెట్‌మైర్ (సి) సూర్య (బి) అర్షద్ 8; ధ్రువ్ (సి) తిలక్ (బి) మెరిడిత్ 2; అశ్విన్ (నాటౌట్) 8; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 212. వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-103, 4-143, 5-159, 6-168, 7-205. **బౌలింగ్:** గ్రీన్ 3-0-31-0, ఆర్చర్ 4-0-35-1, మెరిడిత్ 4-0-51-1, చావ్లా 4-0-34-2, కార్తికేయ 2-0-14-0, అర్షద్ 3-0-39-3. **ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** రోహిత్ (బి) సందీప్ 3; ఇషాన్ (సి) బౌల్ట్ (బి) అశ్విన్ 28; గ్రీన్ (సి) బౌల్ట్ (బి) అశ్విన్ 44; సూర్య (సి) సందీప్ (బి) బౌల్ట్ 55; తిలక్ వర్మ (నాటౌట్) 29; డేవిడ్ (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19.3 ఓవర్లలో 4 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-14, 2-76, 3-101, 4-152. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-43-1, సందీప్ 4-0-35-1, అశ్విన్ 4-0-27-2, చహల్ 3-0-32-0, హోల్డర్ 3.3-0-55-0, కుల్దీప్ సేన్ 1-0-20-0.

విజేత సుమిత్ నగాల్



రోమ్: రోమా గార్డెన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు సుమిత్ నగాల్ చాంపియన్‌గా అవతరించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 347వ ర్యాంకర్ సుమిత్ 6-3, 6-2తో ప్రపంచ 234వ ర్యాంకర్ జాస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)పై గెలిచాడు. ఈ విజయంతో 25 ఏళ్ల సుమిత్ యూరోప్‌లో క్లే కోర్టులపై ఏటీపీ చాలెంజర్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. సుమిత్ కెరీర్‌లో ఇది మూడో ఏటీపీ చాలెంజర్ టోర్నీ. గతంలో అతను బెంగళూరు ఓపెన్ (2017లో), బ్యూనస్ ఎయిర్స్ ఓపెన్ (2019లో) టైటిల్స్ సాధించాడు.

చెస్ 'కింగ్' డింగ్ లిరెన్



అస్తానా (కజకిస్తాన్): పురుషుల చెస్‌లో చైనా నుంచి తొలి ప్రపంచ చాంపియన్ అవతరించాడు. ఆదివారం ముగిసిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో 30 ఏళ్ల చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్ ర్యాపిడ్ 'టైబ్రేక్'లో 2.5-1.5తో రష్యా గ్రాండ్ మాస్టర్ ఇయాన్ నెపోమ్‌నిషిపై గెలిచాడు. నిర్ణీత 14 గేమ్‌ల తర్వాత ఇద్దరూ 7-7తో సమంగా నిలువడంతో విజేతను నిర్ణయించడానికి ర్యాపిడ్ ఫార్మాట్‌లో నాలుగు గేమ్‌లను నిర్వహించారు. తొలి మూడు గేమ్‌లు 'డ్రా' కాగా, నాలుగో గేమ్‌లో డింగ్ లిరెన్ 68 ఎత్తుల్లో నిపోమ్‌నిషిని ఓడించాడు.

విద్య,ఉద్యోగ సమాచారం

టీఎస్ డీఈఈసెట్-2023

తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్.. 2023-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డీఈఎల్ఈడీ, డీపీఎస్ఈ కోర్సుల్లో ప్రవేశాలకు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(డీఈఈసెట్)-2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డీఈఈసెట్ ర్యాంకు ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్‌లు/ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (మైనారిటీ, నాన్ మైనారిటీతో సహా)లో ప్రవేశాలు కల్పిస్తారు.

కోర్సులు

- డీఈఎల్ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్); డీపీఎస్ఈ(డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్).
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** కనిష్టంగా సెప్టెంబర్ 1నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** డీఈఈ సెట్‌లో సాధించిన ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.05.2023
- **హాల్‌టిక్కెట్ల జారీ తేది:** 27.05.2023.
- **ప్రవేశ పరీక్ష తేది:** 01.06.2023.
- **వెబ్‌సైట్:** www.deecet.cdse.telangana.gov.in

ఎన్ఎఫ్‌డీసీ, ముంబైలో 35 ఉద్యోగాలు

ముంబైలోని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎఫ్‌డీసీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 35
- **పోస్టుల వివరాలు:** గార్డెనింగ్ సూపర్‌వైజర్, సీనియర్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ మేనేజర్, గ్రాఫిక్ డిజైనర్, ఆఫీస్ అసిస్టెంట్, కంటెంట్ రైటర్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ/గ్రాడ్యుయేట్ డిగ్రీ/డిప్లొమా/సీఏ /ఐసీడబ్ల్యూఏ/డీఓపీ/పోస్టు గ్రాడ్యుయేషన్/బీకాం/బీఎస్సీ/ఎంఎస్సీ/ఎంఏ/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి. 1 నుంచి 5 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 నుంచి 50 ఏళ్ల వయసు ఉండాలి
- **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి రూ.85,000 వరకు చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐదో ఫ్లోర్, ఎన్ఎంఐసీ బిల్డింగ్, ఎన్ఎఫ్‌డీసీ-ఎఫ్‌డీ కాంప్లెక్స్, 24, పెడెర్ రోడ్, కుంబల్లా హిల్, ముంబై-400026 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 01.05.2023.
- **వెబ్‌సైట్:** www.nfdcindia.com

తెలంగాణ జ్యుడిషియల్ సర్వీసులో డిస్ట్రిక్ట్ జడ్జి (ఎంట్రీ లెవల్) పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ హైకోర్టు.. తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ సర్వీసులో డిస్ట్రిక్ట్ జడ్జి(ఎంట్రీ లెవల్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
- **అర్హత:** హైకోర్టు లేదా హైకోర్టు పరిధిలోని న్యాయస్థానాల్లో అడ్వకేట్‌గా కనీసం ఏడేళ్ల పని అనుభవంతోపాటు ఇతర విద్యార్హతలు కలిగి ఉండాలి.
- **వయసు:** 35 నుంచి 48 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.1,44,840 నుంచి రూ.1,94,660 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, రాతపరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**01.05.2023
- **ఎంపిక పరీక్ష తేదీలు:**24.06.2023, 25.06.2023
- **వెబ్‌సైట్:** www.tshc.gov.in

ఆర్‌బీఐ, ముంబైలో 291 ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టులు

ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) సర్వీస్ బోర్డు.. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్‌బీఐ శాఖల్లో గ్రేడ్-బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 291
- **పోస్టుల వివరాలు:** ఆఫీసర్ గ్రేడ్-బి(డీఆర్)-జనరల్-222, ఆఫీసర్ ఇన్ గ్రేడ్-బి(డీఆర్)-డీఈపీఆర్-38, ఆఫీసర్ ఇన్ గ్రేడ్-బి(డీఆర్)-డీఎస్ఎం-31.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(ఫేజ్1, 2),ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**09.05.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**09.06.2023
- **ఆఫీసర్ గ్రేడ్‌బి(డీఆర్) జనరల్-ఫేజ్1 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 09.07.2023, **ఫేజ్2 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 30.07.2023.
- **ఆఫీసర్ గ్రేడ్-బి(డీఆర్) డీఈపీఆర్-ఫేజ్1 ఆన్‌లైన్ పరీక్షతేది:** 16.07.2023, ఫేజ్2 -ఆన్‌లైన్ పరీక్ష తేది: 02.09.2023.
- **ఆఫీసర్ గ్రేడ్‌బి(డీఆర్)-డీఎస్ఐఎం-ఫేజ్1 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 16.07.2023, **ఫేజ్2 -ఆన్‌లైన్ పరీక్షతేది:** 19.08.2023.
- **వెబ్‌సైట్:** www.rbi.org.in

ఫార్మా రంగం.. కెరీర్ షైనింగ్

ఫార్మా రంగంలో ఉజ్వల కెరీర్ స్వాగతం పలుకుతోంది! అందుకు మార్గం.. నైపర్ -జేఈఈ! నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) నిర్వహించే ఈ పరీక్షలో ర్యాంకుతో ప్రముఖ నైపర్ క్యాంపస్‌లలో అడుగు పెట్టొచ్చు! ఇవి అందించే పీజీ, పీహెచ్‌డీ, ఐపీహెచ్‌డీ కోర్సుల ద్వారా ఫార్మా రంగంలో అద్భుత అవకాశాలు అందుకోవచ్చు. తాజాగా నెపర్-జేఈఈ-2023 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. నైపర్ క్యాంపస్‌లు, అందించే కోర్సులు, ప్రవేశ పరీక్ష విధానం, ఎంట్రన్స్‌లో విజయానికి మార్గాలు తదితర వివరాలు..

» నైపర్-జేఈఈ-2023 ప్రక్రియ ప్రారంభం
» నైపర్ క్యాంపస్‌లలో పీజీ, పీహెచ్‌డీ, ఐపీహెచ్‌డీ కోర్సులు
» నైపర్ సర్టిఫికెట్లతో ఫార్మా రంగంలో ఉజ్వల కెరీర్

దేశంలో ఫార్మా రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్.. నైపర్. దేశవ్యాప్తంగా ఏడు నైపర్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో పీజీ, పీహెచ్‌డీ, ఐపీహెచ్‌డీ వంటి అకడమిక్ ప్రోగ్రామ్‌లతోపాటు నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయి. ఫార్మా విద్యను అందించడంలో పేరు గడించిన నైపర్ క్యాంపస్‌ల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష నైపర్-జేఈఈ.

అర్హతలు

బీఫార్మసీ/సంబంధిత కోర్సులు చదువుతూ గేట్, జీప్యాట్, నెట్ వంటి పరీక్షల్లో అర్హత పొందిన వారు ఈ ఎంట్రన్స్‌కు అర్హులుగా పేర్కొన్నారు. బీఫార్మసీ తత్సమాన కోర్సుల్లో 6.75 సీజీపీఏ లేదా అంతకుసమానమైన పర్సంటేజీతో ఉత్తీర్ణత ఉండాలి. జీప్యాట్/గేట్/నెట్‌ల్లో అర్హత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 50% మార్కులు లేదా 5.75 సీజీపీఏ సాధిస్తే సరిపోతుంది. ఈ ఏడాది చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏడు క్యాంపస్‌లు

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఏడు నైపర్ క్యాంపస్‌లు అకడమిక్ బోధన సాగిస్తున్నాయి. వీటిలో 15 పీజీ స్పెషలైజేషన్లలో 1158 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అహ్మదాబాద్-ఎంఎస్ ఫార్మసీ-145 సీట్లు, ఎంబీఏ(ఫార్మసీ)-30 సీట్లు; గువహటి-ఎంఎస్ ఫార్మ సీ-108 సీట్లు, ఎంఫార్మసీ-38 సీట్లు, ఎంటెక్-29 సీట్లు; హాజీపూర్-ఎంఎస్ ఫార్మసీ-82, ఎంఫార్మసీ-18, ఎంటెక్(ఫార్మసీ)-10 సీట్లు; హైదరాబాద్-ఎంఎస్ ఫార్మసీ-109 సీట్లు, ఎంటెక్(ఫార్మసీ)-36 సీట్లు, ఎంబీఏ (ఫార్మా)-42 సీట్లు; కోల్‌కత-ఎంఎస్ ఫార్మసీ-89 సీట్లు,ఎంటెక్(ఫార్మా)-21 సీట్లు; రాయ్‌బరేలి-ఎంఎస్ ఫార్మసీ-110 సీట్లు; మొహాలీ-ఎంఎస్ ఫార్మసీ-171, ఎంఫార్మసీ-25, ఎంటెక్(ఫార్మసీ)-48సీట్లు, ఎంబీఏ(ఫార్మా)-47 సీట్లు.

పీజీ స్పెషలైజేషన్లు

- **ఎంఎస్-ఫార్మసీ:** మెడిసినల్ కెమిస్ట్రీ, నేచురల్ ప్రొడక్ట్స్, ట్రెడిషనల్ మెడిసిన్, ఫార్మాస్యుటికల్ అనాలిసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ఫార్మాస్యుటిక్స్, బయోటెక్నాలజీ, ఫార్మకో ఇన్ఫర్మాటిక్స్, మెడికల్ డివైజెస్, రెగ్యులేటరీ అఫైర్స్.
- **ఎంఫార్మసీ:** ఫార్మాస్యుటికల్ టెక్నాలజీ(ఫార్ములేషన్స్), ఫార్మసీ ప్రాక్టీస్, క్లినికల్ రీసెర్చ్.
- **ఎంటెక్ ఫార్మసీ:**ఫార్మాస్యుటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ); ఫార్మాస్యుటికల్ టెక్నాలజీ(బయో టెక్నాలజీ);ఎంబీఏ(ఫార్మాస్యుటికల్ మేనేజ్‌మెంట్).

ప్రవేశాలు ఇలా

- ఈ కోర్సుల్లో ప్రవేశానికి నైపర్-జేఈఈను నిర్వహిస్తారు. ▪ అభ్యర్థులు జీప్యాట్ లేదా గేట్ లేదా సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ స్కోర్‌లు సొంతం చేసుకుని ఉండాలి.
- 2023 సంవత్సరానికి ఈ స్కోర్స్ కోసం వేచి చూస్తున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- నైపర్-జేఈఈ తర్వాత దశలో సీట్ల కేటాయింపునకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేస్తారు. నైపర్-జేఈఈలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

200 ప్రశ్నలు-200 మార్కులు

- నైపర్ జేఈఈ పరీక్షను మొత్తం 200 ప్రశ్నలు-200 మార్కులకు నిర్వహిస్తారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష జరుగుతుంది.
- నైపర్-జేఈఈలో మెరుగైన ర్యాంకు సాధించాలంటే.. అభ్యర్థులు బీఫార్మసీ స్థాయిలోని అకడమిక్స్‌పై పట్టు సాధించాలి. కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మాస్యుటికల్ అనాలిసిస్ విభాగాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. మొత్తం 200 ప్రశ్నల్లో 70 శాతం మేర ప్రశ్నలు ఈ విభాగాల నుంచే అడుగుతారు. కొన్ని ప్రశ్నలు జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించినవి ఉంటున్నాయి. కోర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బీఫార్మసీలో పొందిన నైపుణ్యం, జీప్యాట్‌కు పొందిన సన్నద్ధతతో రాణించేందుకు వీలుంది.
- ఫార్మకాలజీలో రిసెప్టర్స్ వాటి రకాలు, మెకానిజమ్ ఆఫ్ యాక్షన్, ఔషధాల వర్గీకరణ, క్లినికల్ ట్రయల్స్‌పై అవగాహన, ప్రీ-క్లినికల్ ట్రయల్స్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. డ్రగ్ డిస్కవరీకి సంబంధించి ముఖ్యంగా వాటి ప్రాముఖ్యతలు, దాంతోపాటు రియాక్షన్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

స్టయిఫండ్ సదుపాయం

నైపర్-జేఈఈ ప్రవేశ ప్రక్రియలో ప్రతిభ చూపి తుది విజేతలుగా నిలిచి.. ప్రవేశం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలను కూడా నైపర్ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. ప్రతి విద్యార్థికి నెలకు రూ. 12,400 స్టయిఫండ్ లభిస్తుంది. ఈ స్టయిఫండ్ కొనసాగాలంటే.. ప్రతి సెమిస్టర్‌లోనూ తప్పనిసరిగా జీపీఏ ఆరు పాయింట్లు ట్రాక్ రికార్డ్‌ను కొనసాగించాలి.



నైపర్-జేఈఈ 2023

నైపర్-జేఈఈ 2023 సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మే 16, 2023
- నైపర్ జేఈఈ ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:జూన్ 23, 2023
- వెబ్‌సైట్: www.niperguwahati.ac.in

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఇలా

నైపర్ క్యాంపస్‌లు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు కూడా అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రత్యేకంగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నెపర్-జేఈఈ ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసేటప్పుడే పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

అర్హతలు

అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగాలకు సంబంధించి.. ఎంఎస్, ఎంఫార్మసీ, ఎంటెక్ కోర్సులను సదరు స్పెషలైజేషన్లతో 6.5 సీజీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 6.25 సీజీపీఏ లేదా 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. జీప్యాట్/గేట్/సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఉత్తీర్ణత ఉండాలి. ఎండీ, ఎంవీఎస్‌సీ, ఎండీఎస్, ఫార్మ్-డి ఉత్తీర్ణులకు జీప్యాట్ /నెట్/గేట్ నిబంధన నుంచి మినహాయింపు లభిస్తుంది.

పీహెచ్‌డీ ఎంట్రన్స్

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే నైపర్-జేఈఈ 170 ప్రశ్నలకు ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. మొత్తం మార్కులు 85. కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యుటికల్ సైన్సెస్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

మలిదశలో ఇంటర్వ్యూ

పీహెచ్‌డీ అభ్యర్థులు ఎంట్రన్స్‌లో పొందిన స్కోర్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 15. ఇందులోనూ విజయం సాధిస్తే పీహెచ్‌డీ ప్రవేశం లభిస్తుంది.

ఆర్థిక ప్రోత్సాహకం

పీహెచ్‌డీలో ప్రవేశాలు ఖరారు చేసుకున్న విద్యార్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.31వేలు చొప్పున; మూడు, నాలుగు సంవత్సరాలు నెలకు రూ.35 వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందుతుంది. దీంతోపాటు హెచ్‌ఆర్ఏ కూడా లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీ: మే 16, 2023
- నైపర్ జేఈఈ ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: జూన్ 23
- వెబ్‌సైట్: www.niperguwahati.ac.in

ఐపీహెచ్‌డీ

నైపర్ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయి. మొత్తం ఆరేళ్ల వ్యవధిలో ఉండే ఈ ప్రోగ్రామ్‌లకు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

అర్హత

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్‌ను అనుసరించి బీఫార్మసీ, ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ), బీవీఎస్సీ, ఎంబీబీఎస్, ఎమ్మెస్సీ (ఫార్మకాలజీ/టాక్సికాలజీ/లైఫ్ సైన్సెస్/బయో కెమిస్ట్రీ/మెడిసినల్ బయో కెమిస్ట్రీ/ జువాలజీ /బయలాజికల్ సైన్సెస్), బీటెక్(బయో ఇన్ఫర్మాటిక్స్), ఎమ్మెస్సీ (ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ/ఫిజికల్ కెమిస్ట్రీ/మాలిక్యులర్ బయాలజీ/బయో ఇన్ఫర్మాటిక్స్/మైక్రో బయాలజీ), బీటెక్(కెమికల్ ఇంజనీరింగ్ /ఫార్మాస్యుటికల్ ఇంజనీరింగ్) తదితర కోర్సుల్లో 6.75 సీజీపీఏతో ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు జీప్యాట్/గేట్/నెట్‌లో అర్హత సాధించాలి.

ప్రవేశం ఇలా

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నైపర్ జేఈఈ 200 ప్రశ్నలతో ఉంటుంది. ఈ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి, ఎంపికైన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ రెండింటిలోనూ పొందిన మార్కుల ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. వారికి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు చేస్తారు.

ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మే 16, 2023
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: జూన్ 10
- ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ నైపర్ జేఈఈ పరీక్ష తేదీ: జూన్ 23
- వెబ్‌సైట్: www.nipertuwahati.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	463	61,112
నిఫ్టీ ▲	150	18,065

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,227	▲	84
డోజోన్స్	34,098	▲	272
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,871	▲	39
డాక్స్	15,922	▲	122
షాంఘై	3,323	▲	37
నికాయ్	28,856	▲	399

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

హెల్త్ ప్లాన్.. ఇవి తెలిస్తే నో టెన్షన్?

- బ్లాక్ లిస్ట్ హాస్పిటల్స్ కూడా ఉంటాయ్
- వాటిల్లో చికిత్స పొందితే పరిహారం రాదు
- కొన్ని చికిత్సలకు 24 నెలల వెయిటింగ్
- ముందస్తు వ్యాధులకూ వేచి ఉండాల్సిందే
- లేదంటే అదనపు ప్రీమియం చెల్లించుకోవాలి
- మొదటి 30 రోజుల్లో ప్రమాదానికే పరిహారం

హెల్త్ ఇన్సూరెన్స్ పట్ల అవగాహన పెరుగుతోంది. ఒకవైపు జీవనశైలి వ్యాధులతో అస్పత్రుల్లో చేరాల్సిన అవసరాలు ఏర్పడుతున్నాయి. మరోవైపు మధ్యతరగతి వాసులకు ఆరోగ్యపరమైన సామాజిక రక్షణ ఏదీ ఉండడం లేదు. ఈ పరిస్థితుల్లో అనారోగ్యం పాలైతే ఆర్థికంగా గుల్ల కాకుండా ఉండాలంటే, హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ ప్రతి ఒక్కరికీ కచ్చితంగా ఉండాల్సిందే. కరోనా ముందు నాటితో పోలిస్తే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రాధాన్యాన్ని ఎక్కువ మంది నేడు అర్థం చేసుకుంటున్నారు. దీంతో దీన్ని కొనుగోలు చేసే వారి సంఖ్యలో స్పష్టమైన **వృద్ధి** కనిపిస్తోంది. అయితే ఎవరో చెప్పారనో, ఏదైనా ప్రకటన చూసో హెల్త్ ప్లాన్ తీసుకోవడ**ం కాదు.** ఎంపిక చేసుకునే ప్లాన్‌లో రక్షణ ఏ మేరకు? ఏ ఏ వ్యాధులకు కవరేజీ ఉంది? ఉప పరి**మితులు** ఉన్నాయా? పాలసీ తీసుకున్న వెంటనే క్లెయిమ్ చేసుకోవచ్చా? ఆస్పత్రిలో అన్ని రకాల **చికిత్స**లకు కవరేజీ లభిస్తుందా? ఇలాంటి ముఖ్యమైన అన్నింటి గురించి పాలసీదారులు తెలు**సుకుని** ఉండాల్సిందే. లేదంటే క్లెయిమ్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు చికిత్సకు అయిన బిల్లు **మొత్తంలో** కోతపడుతుంది. పాలసీదారుడు తనవంతు చెల్లించాల్సి వచ్చినప్పుడు విచారిస్తే వచ్చే**దేమీ** ఉండదు. ఇటువంటి కీలక అంశాలను వివరించే కథనమిది...



మన దేశంలో ఎక్కువ మంది హెల్త్ ఇన్సూరెన్స్‌ను పన్ను ఆదా కోణంలో తీసుకుంటూ ఉంటారు. పాలసీదారులకు సాధారణంగా కొన్ని ఫీచర్లపై అవగాహన ఉంటుంది. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని జీవితాంతం రెన్యువల్ చేసుకోవచ్చు. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలో మేటర్నిటీ ప్రయోజనాలు ఉంటాయి. నో క్లెయిమ్ బోనస్ ఉంటుందనే విషయాలపై సాధారణంగా అవగాహన ఉంటుంది. కానీ, ఎక్కువ మందికి తెలియని విషయం బ్లాక్ లిస్టెడ్ హాస్పిటల్స్ గురించి. మీరు కొనుగోలు చేయబోయే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ఎక్కువ ఆస్పత్రుల్లో చికిత్సలకు కవరేజీ ఇచ్చే విధంగా ఉండాలి. ఇంటి సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందినా కవరేజీ వస్తుందని కొందరు భావిస్తుంటారు. కానీ, ఇంటి సమీపంలోని హాస్పిటల్ బ్లాక్ లిస్ట్‌లో ఉంటే, అందులో నగదు రహిత చికిత్స కాదు కదా, ముందే డబ్బులు చెల్లించి తీసుకున్న చికిత్సకు సైతం రీయింబర్స్‌మెంట్ రాదు. ఎందుకంటే సదరు ఆస్పత్రిని బీమా సంస్థ బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వల్లేనని తెలుసుకోవాలి. అందుకనే హెల్త్ పాలసీ కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ ముందుగా బ్లాక్ లిస్టెడ్ హాస్పిటల్స్ జాబితా చూడాలి. అలాగే, మీరు నివాసం ఉండే ప్రాంతంలో నగదు రహిత చికిత్సలను అనుమతి ఉన్న ఎన్ని ఆస్పత్రులు బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ జాబితాలో ఉన్నదీ చూడాలి. కొన్ని చిన్న ఆస్పత్రులు లేదా వ్యక్తులు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. మోసపూరిత క్లెయిమ్‌లు చేస్తుంటారు. అందుకని అన్ని బీమా సంస్థల పరిధిలో సొంతంగా ఓ ఇన్వెస్టిగేషన్ డెస్క్ ఉంటుంది. ఏదైనా ఒక ఆస్పత్రి నుంచి క్లెయిమ్‌లు భారీగా వస్తుంటే అప్పుడు సదరు ఆస్పత్రి**పై** ఓ కన్నేసి ఉంచాలని బీమా సంస్థ తన ఇన్వెస్టిగేషన్ డెస్క్‌ను కోరుతుంది. అప్పుడు సంబంధిత విభాగం క్లెయిమ్‌లు ఎక్కువగా వస్తున్న లేదా అనుమానాస్పద క్లె**యి**మ్‌లు ఎక్కువగా వస్తున్న ఆస్పత్రికి వెళ్లి **విచా**రణ నిర్వహిస్తుంది. తమ విచారణలో **వెలుగు** చూసిన అంశాల ఆధారంగా బీమా సంస్థ **తదుప**రి చర్యలు తీసుకుంటుంది. క్లెయిమ్‌ల వి**షయంలో** చట్టవిరుద్ధమైన చర్యలు లేదా నిబంధనల**కు వ్యతిరే**కంగా, మోసపూరితంగా వ్యవహరిస్తున్న**ట్టు తేలితే** ఆయా ఆస్పత్రిని నిషేధిత జాబితాలోకి **మారుస్తుం**ది. ఇలా బీమా సంస్థలు తాము నిషేధించిన, బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన హాస్పిటల్స్ వివరాలను పాలసీదారులతో ఎప్పటికప్పుడు పంచుకుంటాయి.

వెయిటింగ్ పీరియడ్

హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్న వెంటనే ఏ సమస్య వచ్చినా క్లెయిమ్ చేసుకుంటామంటే నిబంధనలు అంగీకరించవు. కొన్ని రకాల వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్ వేర్వేరుగా ఉంటుంది. ఈ వివరాలు పాలసీ డాక్యుమెంట్‌లో వివరంగా ఉంటాయి. ఉదాహరణకు మెటర్నిటీ (ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరడం) కవరేజీ అనేది చాలా పాలసీల్లో ఉన్నా, మొదటి రోజు నుంచే కవరేజీ వస్తుందనుకోవద్దు. ఇందుకోసం కనీసం 12 నెలలు అంతకుమించి వేచి ఉండే కాలం నిబంధన ఉంటుంది. ఆ తర్వాతే మెటర్నిటీ కవరేజీ క్లెయిమ్ చేసుకోగలరు. మరికొన్ని రకాల వ్యాధులకు 24 నెలల వెయిటింగ్ పీరియడ్ అమల్లో ఉంటుంది. పాలసీ తీసుకునే నాటికే వ్యాధులు కలిగి ఉంటే, వాటిని పాలసీ ప్రపోజల్‌లో వెల్లడించి ఉంటే, కవరేజీ పొందేందుకు 3–4 ఏళ్ల పాటు వేచి ఉండాల్సి వస్తుంది. ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) సేవలకు అన్ని ప్లాన్లలో కవరేజీ ఉండదు. ఇది యాడాన్ కవరేజీగా వస్తుంది. హాస్పిటల్‌లో కనీసం 24 గంటల పాటు చేరి చికిత్స తీసుకుంటేనే ఇండెమ్నిటీ ప్లాన్‌లో క్లెయిమ్ చేసుకోవడానికి అర్హత లభిస్తుంది. డే కేర్ చికిత్సల కోసం అయితే ఆస్పత్రిలో ఇన్ని గంటల పాటు చేరాల్సిన అవసరం ఉండదు. అలా కాకుండా ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకునే వాటికి కనీసం 24 గంటల నిబంధన అమలవుతుంది. కనుక పాలసీదారులు మొదట బ్లాక్ లిస్ట్ హాస్పిటళ్లు, తర్వాత ఏ వ్యాధికి కవరేజీ కోసం ఎంత కాలం పాటు వేచి ఉండాలి, క్లెయిమ్ కోసం ఎంత సమయం పాటు ఆస్పత్రిలో చేరాలనే విషయాలను తెలుసుకోవాలి.

ఫీచర్లపై అవగాహన అవసరం

బీమా సంస్థ ఏదైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల్లో సాధారణ నిబంధనలు అన్నీ ఒకే విధంగా ఉంటాయి. కానీ, ఒక్కో బీమా సంస్థ తమ ఉత్పత్తిని ఆకర్షణీయంగా మార్చేందుకు కొన్ని అదనపు ఫీచర్లు, కవరేజీలను పాలసీల్లో భాగం చేస్తుంటాయి. ఉదాహరణకు రీస్టోరేషన్ ఫీచర్. దీన్ని చాలా సంస్థలు అందిస్తున్నాయి. ఒక ఏడాదిలో కుటుంబంలో ఒకరు ఆస్పత్రిలో చేరడం వల్ల బీమా మొత్తం ఖర్చయిపోయిందని అనుకోండి. అప్పుడు అదే ఏడాది మరో వ్యక్తి లేదా అదే వ్యక్తి మళ్లీ ఆసుపత్రిలో చేరాల్సి వస్తే? అలాంటి సందర్భాల్లో ఆదుకునేదే రిస్టోరేషన్ ఫీచర్. ఏదైనా క్లెయిమ్ కారణంగా బీమా కవరేజీ ఖర్చయిన సందర్భాల్లో బీమా సంస్థలు తిరిగి అంతే మొత్తాన్ని రీస్టోరేషన్ కింద పునరుద్ధరిస్తాయి. దీంతో అదే ఏడాది మరోసారి ఆస్పత్రిలో చేరాల్సి వచ్చినప్పుడు అది ఆదుకుంటుంది. కొన్ని బీమా సంస్థలు అయితే ఒక ఏడాదిలో ఎన్నిసార్లు ఇలా క్లెయిమ్‌లు వచ్చినా, అన్నిసార్లు రీస్టోరేషన్ ఫీచర్‌ను అందిస్తున్నాయి. సాధారణంగా ఒక వ్యక్తి ఒక వ్యాధి కారణంగా ఆసుపత్రిలో చేరి పూర్తి బీమా కవరేజీని క్లెయిమ్ పొందాడనుకుందాం. అప్పుడు అదే వ్యక్తి అదే వ్యాధితో హాస్పిటల్‌లో చేరితే రీస్టోరేషన్ కవరేజీని చాలా ప్లాన్లు ఇవ్వడం లేదు. కొన్ని మాత్రం ఒక వ్యక్తి ఒక వ్యాధి కారణంగా ఎన్ని సందర్భాలు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందినా లేక మరో సమస్యతో చేరాల్సి వచ్చినా రీస్టోరేషన్ కింద కవరేజీని పునరుద్ధరిస్తున్నాయి. కనుక ఈ ఫీచర్ గురించి వివరంగా తెలుసుకున్న తర్వాతే ప్లాన్‌ను ఎంపిక చేసుకోవాలి.

తప్పక తెలిసి ఉండాలి..

ముందు నుంచి ఉన్న వ్యాధులు: అధిక రక్తపోటు, కేన్సర్, మధుమేహం, ఆస్తమా, డిప్రెషన్, స్లీప్ ఆప్నియా, గుండె జబ్బులు, మూత్ర పిండాల సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు (సీవోపీడీ), స్థూలకాయం, లూపస్, అథెరోస్కెలరోసిస్, థైరాయిడ్ తదితర ఆరోగ్య సమస్య ఏదైనా కావచ్చు. పాలసీ కొనుగోలు చేసే నాటికి నాలుగేళ్ల ముందు వైద్యులు నిర్ధారించి, చికిత్స తీసుకున్నవి ముందస్తు వ్యాధుల జాబితాలోకి వస్తాయి. ముందస్తు వ్యాధుల సమాచారం కావాలని వెల్లడించకపోతే.. తర్వాత క్లెయిమ్ సమయంలో బీమా సంస్థ దీన్ని గుర్తిస్తే పరిహారాన్ని నిరాకరిస్తుంది. పాలసీ తీసుకుని ఎనిమిదేళ్లు ముగిసిన తర్వాత క్లెయిమ్ వస్తే అది ముందుగా వెల్లడించని వ్యాధి అయినా సరే తిరస్కరించడం కుదరదు. కనుక పాలసీ దరఖాస్తులో అంతకుముందుగా ఏదైనా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నా, చికిత్స తీసుకున్నా ఆ వివరాలను తప్పకుండా వెల్లడించడం మంచిది.

30 రోజుల వెయిటింగ్: పాలసీ విడుదల చేసిన తేదీ నుంచి మొదటి 30 రోజుల్లో ప్రమాదం లేదా ప్రమాదం కారణంగా తలెత్తే సమస్యలకే క్లెయిమ్ చేసుకోవచ్చు మరే విధమైన చికిత్సకూ క్లెయిమ్‌ను బీమా సంస్థలు అనుమతించవు.

స్పెసిఫిక్ వెయిటింగ్: ముందు నుంచి ఉన్న వ్యాధులు కాకుండా పాలసీ తీసుకున్న తర్వాత 24 నెలల వరకు క్లెయిమ్ చేసుకోలేని ఆరోగ్య సమస్యలు కొన్ని ఉన్నాయి. ఆర్థరైటిస్, గౌట్, రుమటాయిజం, జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోస్కోపిక్ మోకాలు సర్జరీ, చెవి, ముక్కు, గొంతు సమస్యలు లేదా సర్జరీలు (సైనసైటిస్, అడెనాయిడ్స్), ప్రొస్టేటిక్ హైపర్‌ట్రోఫీ, క్యాటరాక్ట్, ఫిస్టులా, హెమరాయిడ్స్, గ్యాస్ట్రిక్ డుయోడినల్ అల్సర్లు, అన్ని రకాల హెర్నియా, హిస్టరెక్టమీ, ఫైబ్రోమయోమా, ట్యూమర్లు, కిడ్నీలో రాళ్లు, యూరెటెరిక్ స్టోన్స్, గాల్ బ్లాడర్‌లో రాళ్లు, వారికోస్ వెయిన్స్, పార్కిన్సన్స్/అల్జీమర్స్/డిమెన్షియా తదితర వాటితో బీమా కంపెనీ డాక్యుమెంట్‌లో 24 నెలల వెయిటింగ్ జాబితా ఉంటుంది. వీటికి రెండేళ్ల తర్వాతే క్లెయిమ్ వస్తుంది.

శాశ్వత మినహాయింపులు: హెల్త్ ఇన్సూరెన్స్ ఉంది కదా, దేనికైనా పరిహారం వస్తుందిలేనని అనుకోవద్దు. కొన్నింటికి శాశ్వతంగా క్లెయిమ్ రాదు. వీటి జాబితా బీమా నియమ, నిబంధనల డాక్యుమెంట్‌లో ఉంటుంది. ఏదైనా వ్యాధి నిర్ధారణ కోసం ఆస్పత్రిలో చేరితే క్లెయిమ్ రాదు. వైద్యుల సిఫారసు లేకుండా బరువు తగ్గేందుకు సొంతంగా తీసుకునే చికిత్సలు, లింగమార్పిడి చికిత్సలు, కాస్మెటిక్ లేదా ప్లాస్టిక్ సర్జరీలకు (ప్రమాదం కారణంగా చేసుకోవాల్సిన వాటికి మినహాయింపు) క్లెయిమ్ రాదు.

మెటర్నిటీ వెయిటింగ్: సాధారణంగా మెటర్నిటీ కవరేజీ కోసం బీమా సంస్థలు ఏడాది నుంచి మూడేళ్ల పాటు వేచి చూడాలనే నిబంధన అమలు చేస్తున్నాయి.



వెయిటింగ్‌ను తగ్గించుకోవచ్చా..?


వేచి ఉండే కాలాన్ని తగ్గించుకునేందుకు చాలా బీమా సంస్థలు ప్రత్యేక రైడర్‌తో అవకాశం కల్పిస్తున్నాయి. ఇందుకు అదనపు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. కొంత అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా ముందస్తు వ్యాధులకు కవరేజీని 2 ఏళ్లకు తగ్గిస్తున్నాయి. పాలసీ తీసుకున్న నాటి నుంచే ముందస్తు వ్యాధులకూ కవరేజీనిచ్చే కంపెనీలు కూడా ఉన్నాయి. గ్రూప్ హెల్త్ ప్లాన్‌లో దాదాపుగా వెయిటింగ్ పీరియడ్ ఉండడం లేదు. వేచి ఉండే కాలంలో కొత్తగా నిర్ధారణయ్యే వ్యాధులను ముందు నుంచి ఉన్నవిగా పరిగణించరు.

సమీప బంధువులకు షేర్ చేయాలి..



ఆస్పత్రిలో చేరిన వెంటనే బీమా సదుపాయం ఉందా? అని అక్కడ సిబ్బంది ప్రశ్నించడం వినే ఉంటారు. తమకు హెల్త్ ఇన్సూరెన్స్ ఉందని చెబితే, అందులో చికిత్స వ్యయాలకు ఎంత మేర కవరేజీ వస్తుంది? రాదనే విషయాలను వారు చెబుతారు. ముందుగా నిర్ణయించుకుని తీసుకునే చికిత్సల విషయంలో కవరేజీ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. లేదంటే డిశ్చార్జ్ సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఎందుకంటే సాధారణంగా పాలసీదారులు చికిత్స తీసుకోవాల్సి వచ్చినప్పుడు వారు ఆస్పత్రిలో చేరగా, వారి సంబంధీకులు బీమా తదితర వ్యవహారాలు చూస్తుంటారు. వారికి కవరేజీ విషయమై అవగాహన ఉండదు. అందుకని పాలసీదారులు తమ బీమా క్లెయిమ్‌కు సంబంధించి తమ కుటుంబ సభ్యులు, సమీప బంధువులకు కొన్ని ఫీచర్లు, ముఖ్యమైన అంశాల గురించి తప్పకుండా చెప్పాలి. అందులో ముఖ్యమైనది రూమ్‌రెంట్ కవరేజీ. రూమ్ రెంట్‌కు ఎలాంటి పరిమితులు లేనట్టయితే అది చెప్పాల్సిన అవసరం లేదు. ఒకవేళ షేర్డ్ రూమ్, సింగిల్ రూమ్ అని నిబంధన ఉంటే మిమ్మల్ని ఆస్పత్రిలో ఆయా వసతుల్లోనే చేర్చాలని సూచించాలి. పాలసీలో చెప్పినదానికంటే ఖరీదైన వసతి తీసుకుంటే బిల్లు ఎక్కువ వస్తుంది. దాంతో ఆ మేరకు బీమా సంస్థ క్లెయిమ్ మొత్తాన్ని తగ్గిస్తుంది. అప్పుడు మిగిలినది పాలసీదారు చెల్లించాల్సి వస్తుంది. ముందు నుంచి వ్యాధులు ఉండి, వాటిని పాలసీ దరఖాస్తులో వెల్లడించి ఉంటే వాటి గురించి వివరంగా చెప్పాలి. లేదంటే లిఖితపూర్వకంగా ఈ విషయాలను ఒక పేపర్‌పై రాసి ఇవ్వడం మంచి నిర్ణయం అవుతుంది. హాస్పిటల్ క్యాష్ ఫీచర్ ఉంటే అది కూడా తప్పకుండా చెప్పాలి. హాస్పిటల్ క్యాష్ అనేది.. చికిత్స కోసం ఆసుపత్రిలో పాలసీదారు చేరినప్పుడు, వారికి సహాయంగా ఉండే వారికి రోజువారీ చెల్లింపులు చేస్తుంది. ఇది రోజువారీ రూ.500 నుంచి రూ.2,000 మధ్య ఉంటుంది. రీస్టోరేషన్ గురించి కూడా చెప్పాలి. హాస్పిటల్ క్యాష్ బెనిఫిట్ అనేది కొన్ని ప్లాన్లలో ఇన్‌బిల్ట్‌గా ఉంటే, కొన్నింటిలో యాడాన్ కవర్‌గా వస్తోంది.

వృద్ధులకు బీవోఐ ప్రత్యేక డిపాజిట్ స్కీమ్



ముంబై: వృద్ధులకు ఆర్థికంగా మరింత రక్షణ అవసరం కావడంతో, దీన్ని దృష్టిలో పెట్టుకుని 'శుభ్ ఆరంభ్ డిపాజిట్' స్కీమ్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. 60 ఏళ్లు నిండిన వృద్ధుల కోసం తీసుకొచ్చిన ఈ డిపాజిట్ పథకంలో అదనంగా 0.50 శాతం రేటును ఆఫర్ చేస్తున్నట్టు తెలిపింది. 80 ఏళ్లు నిండిన వారికి 0.65 శాతం అదనంగా ఇస్తున్నట్టు ప్రకటించింది. 501 రోజుల ఈ డిపాజిట్ స్కీమ్‌లో 60 ఏళ్లు నిండిన వారికి వడ్డీ రేటు 7.65 శాతం, 80 ఏళ్లు నిండిన వారికి 7.80 శాతం లభిస్తుంది. ఇక 7–10 ఏళ్ల కాల వ్యవధుల డిపాజిట్లపైనా ఆకర్షణీయమైన వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నట్టు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
1-5-2023	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
30-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

సాక్షి ప్రో

ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,022 **టార్గెట్:** రూ. 2,415

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో రూ. 300 కోట్ల పన్నుకు ముందు లాభం(పీబీటీ) ఆర్జించే వీలుంది. ఇక పూర్తి ఏడాది(2022–23)కి ఫారెక్స్ ప్రభావం తదుపరి రూ. 2,300 కోట్ల పీబీటీ సాధించవచ్చని అంచనా. విమానయాన రంగంలో ప్రత్యర్థి సంస్థలతో పోటీలో ముందంజలో ఉండటమేకాకుండా పటిష్ట వ్యవస్థాగత డిమాండు నుంచి కంపెనీ లబ్ధి పొందనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 15 శాతంపైగా ఏఎస్‌కే(అవైలబుల్ సీట్ కిలోమీటర్) వృద్ధిపై కంపెనీ దృష్టి పెట్టింది. 2030కల్లా విమానాల సంఖ్యను రెట్టింపునకు పెంచుకునే ప్రణాళికల ద్వారా వృద్ధిని అందుకోవాలని చూస్తోంది. విమానం ప్రయాణించే కిలోమీటర్లతో అందుబాటులోని సీట్ల సంఖ్యతో గుణిస్తారు. తద్వారా ప్రయాణికుల రవాణా సామర్థ్యం ఏఎస్‌కేని మదింపు చేస్తారు. వీటికితోడు అంతర్జాతీయ సంస్థలతో చేతులు కలపడం(ఇంటర్నేషనలైజేషన్) ద్వారా రానున్న రెండేళ్లలో ఏఎస్‌కే వృద్ధిని 30 శాతానికి పెంచుకునే ప్రణాళికలు వేసింది. చౌక ధరలు, అవాంతరాలు లేని సర్వీసులు, సమయానుగుణ నిర్వహణ వంటి అంశాల ద్వారా తాజా లక్ష్యాలను చేరుకోవాలని భావిస్తోంది. సీజనల్‌గా క్యూ4లో మెరుగైన పనితీరును చూపనుంది. 2022–23లో 11,300 ఏఎస్‌కే సాధించవచ్చని అంచనా.

అహ్లువాలియా కాంట్రాక్ట్స్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 516 **టార్గెట్:** రూ. 610

ఎందుకంటే: ప్రస్తుతం సర్దుబాటు చేయని ఆర్డర్ బుక్ విలువ రూ. 9,500 కోట్లకు చేరింది. అయితే దీనిలో కంపెనీ ఇటీవల ఎల్1 పొందిన సీఎస్‌ఎంటీ స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టు(విలువ రూ. 2,450 కోట్లు)ను పరిగణనలోకి తీసుకోలేదు. అయినప్పటికీ ఆర్డర్‌బుక్ విలువ కంపెనీ చరిత్రలోనే గరిష్ట స్థాయికి చేరుకుంది! వెరసి రానున్న మూడేళ్ల కాలంలో కంపెనీ ఆదాయ ఆర్జనను ఇది ప్రతిబింబిస్తోంది. ప్రాంతాలవారీగా చూస్తే ఆర్డర్లలో తూర్పు నుంచి 42 శాతం, ఉత్తరాది నుంచి 36 శాతం చొప్పున లభించాయి. ఈ బాటలో పశ్చిమ ప్రాంతాల నుంచి 12 శాతం, దక్షిణాది నుంచి 5 శాతం, విదేశాల నుంచి మరో 5 శాతం చొప్పున ఆర్డర్లు పొందింది. ప్రభుత్వ రంగం నుంచి ప్రాజెక్టులు ఆర్డర్‌బుక్‌లో 82 శాతం వాటాను ఆక్రమిస్తుండగా.. మిగిలిన 18 శాతం వాటాను ప్రయివేట్ రంగం నుంచి అందుకుంది. ప్రోత్సాహకర ఆర్డర్లబుక్‌కుతోడు, పటిష్ట లిక్విడిటీ పొజిషన్, నైపుణ్యం కలిగిన యాజమాన్య బలిమి వంటి అంశాలు కంపెనీ భవిష్యత్ వృద్ధికి దోహదం చేయనున్నాయి. 2022–25 మధ్యకాలంలో వార్షికంగా కంపెనీ ఆదాయం 15 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 20 శాతం, నికర లాభం 23 శాతం చొప్పున పురోగతిని సాధించగలవని అంచనా.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పెట్టుబడులపై గరిష్ట రాబడులు ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 38 ఏళ్లు. కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్నాను. 40 ఏళ్లకే రిటైర్మెంట్ తీసుకోవాలన్నది నా ప్రణాళిక. కనుక రిటైర్మెంట్ కోసం ఎంత ఫండ్ కావాలో తెలుసుకుందామంటే ఆన్‌లైన్‌లో ఎన్నో రిటైర్మెంట్ కాలిక్యులేటర్లు ఉన్నాయి. వీటిల్లో కచ్చితమైన నంబర్లు చూపించేది ఏదైనా ఉందా?

– విష్ణు నివాస్

ద్రవ్యోల్బణాన్ని విస్మరించడానికి లేదు. ద్రవ్యోల్బణం మీ జీవన వ్యయాలను పెంచుతుంది. రిటైర్మెంట్‌కు ఎంత కావాలనే విషయాన్ని ఇదే క్లిష్టంగా మార్చేస్తుంది. ఇందుకోసం ఓ ఆచరణాత్మక సూత్రాన్ని అనుసరించొచ్చు. ప్రస్తుతం వార్షిక వ్యయాలు ఎంత? ఈ మొత్తానికి ఏటా 6 శాతం ద్రవ్యోల్బణాన్ని రిటైర్మెట్ పీరియడ్ వరకు కలపాలి. రిటైర్మెంట్ తర్వాత జీవించి ఉండే కాలంతో (అంచనా) దీన్ని హెచ్చించాలి. ఉదాహరణకు ప్రస్తుతం మీకు నెలవారీ ఖర్చులు రూ.50వేలు ఉన్నాయనుకుంటే, ఏడాదికి రూ.6 లక్షలు అవుతుంది. పదేళ్లలో రిటైర్ అవుతారు. ఈ పదేళ్ల కాలానికి 6 శాతం ద్రవ్యోల్బణం కలిపి చూస్తే ప్రస్తుతం ఉన్న వార్షిక జీవన వ్యయం రూ.6 లక్షలు కాస్తా, పదేళ్ల తర్వాత 10.74 లక్షలకు పెరుగుతుంది. మీరు 48 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుని, 80 ఏళ్ల వరకు జీవించి ఉంటారని అనుకుంటే, అప్పుడు రిటైర్మెంట్ తర్వాత 32 ఏళ్ల జీవన కాలం ఉంటుంది. 32 ఏళ్లను వార్షిక జీవన వ్యయం 10.74 లక్షలతో లెక్కిస్తే అప్పుడు రూ.3.44 కోట్లు అవుతుంది. ఈ మొత్తం రిటైర్మెంట్ ఫండ్‌గా కావాల్సి ఉంటుంది. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేస్తూ వెళితే ఈ మొత్తం సమకూరుతుంది. దీర్ఘకాలం లక్ష్యాలకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. డెట్ ఆధారిత సాధనాలైన ప్రావిడెంట్ ఫండ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు తగినవి కావు.

నేను రూ.30 లక్షలు ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. గరిష్ట రాబడులు రాబట్టుకోవడం ఎలా?

– కేశవ్ జాదవ్

సంపద వృద్ధి చెందడానికి పెట్టుబడి ఒక మార్గం. ఒక ఇన్వెస్టర్‌గా మీ లక్ష్యం గరిష్ట రాబడి ఒక్కటే కాకూడదు. దీనికి బదులు మెరుగైన రాబడుల కోసం పెట్టుబడుల విషయంలో కొన్ని టిప్స్ అనుసరించొచ్చు. ముందుగా సరైన పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి. కేవలం రాబడి కోణంలోనే పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకుంటే అది నష్టానికి దారితీయవచ్చు. అందుకుని ప్రతీ పెట్టుబడి ఆప్షన్‌కు ముందు సానుకూల, ప్రతికూలతలను చూడాలి. ఈక్విటీ పథకాలు స్వల్పకాలంలో అధిక రాబడులు ఇవ్వగలవు. కానీ అది కచ్చితం అని చెప్పలేం. పైగా అస్థిరతలు ఎక్కువ. మార్కెట్ ఏ సమయంలో అయినా దిద్దుబాటుకు గురికావచ్చు. అత్యవసర పరిస్థితుల్లో మార్కెట్లు కరెక్షన్‌కు లోనై ఉంటే అప్పుడు నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుంది. అందుకుని స్వల్పకాలానికి ఈ తరహా రిస్క్‌ను అధిగమించేందుకు డెట్ సాధనాలను ఎంపిక చేసుకోవాలి. ఈక్విటీ పెట్టుబడులు ఐదేళ్లు, అంతకుమించిన కాలానికి ఉండాలి. ఇక మీ పెట్టుబడులను వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుకోవడం ద్వారా వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ ఏదైనా ఫండ్ బలహీన పనితీరు చూపిస్తే, మరో ఫండ్ మంచి పనితీరుతో రాబడుల్లో స్థిరత్వం ఉంటుంది. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకోవడం మరో మార్గం. ఇందుకు సిప్‌ను ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల స్వల్ప కాలంలో పెట్టుబడులపై మార్కెట్ కరెక్షన్ల ప్రభావాన్ని అధిగమించొచ్చు. చివరిగా అస్సెట్ అలోకేషన్‌ను పాటించాలి. డెట్, ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడంతోపాటు, వాటిని ఏడాదికోసారి సమీక్షించుకోవాలి. మీ లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా డెట్, ఈక్విటీ కేటాయింపుల్లో మార్పులు చేసుకోవాలి.



క్లుప్తంగా...

24న 'నావిక్-01' ఉపగ్రహ ప్రయోగం



నావిక్-01 ఉపగ్రహం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి మే 24వ తేదీన జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ ద్వారా నావిక్-01 (ఐఆర్ఎన్ఎస్ఎస్-1జే) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి దీనిని నిర్వహించేందుకు మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్‌ను అనుసంధానం చేసే పనులు ప్రారంభించారు. షార్‌లో లాంచింగ్ వసతులు పెరిగిన తర్వాత నెలకు ఒక ప్రయోగం చేయాలని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 22న పీఎస్ఎల్వీ సీ55ని ప్రయోగించారు. ఆ ప్రయోగం పూర్తయిన వెంటనే మే 24న జీఎస్ఎల్వీ ఎఫ్12 ద్వారా నావిక్-01 ఉపగ్రహ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (ఐఆర్ఎన్ఎస్ఎస్)ను బలోపేతం చేయడానికి ఈ ప్రయోగం చేస్తున్నారు.

నూతన పారిశ్రామిక విధానాన్ని సవరించాలి

- దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: పెద్ద పరిశ్రమలు, చిన్న పరిశ్రమలను ఒకే విధంగా పరిగణిస్తూ లీజు విధానంలో భూ కేటాయింపులు చేయడం సరికాదని, దీన్ని సవరించి ఎంఎస్ఎంఈలను ఆదుకోవాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. నూతన పారిశ్రామిక విధానం (2023-27) లో 1,000 ఎకరాల వారికీ 1,000 మీటర్లు ఒకే విధంగా 33 లేదా 66 సంవత్సరాలు లీజుకు భూములు కేటాయిస్తామని ప్రకటించారని, దీని వల్ల చిన్న పరిశ్రమలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని సంఘం జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు లీజు కాకుండా అవుట్ రైట్ సేల్ విధానంలో ప్లాట్లు కేటాయించాలని కోరారు. ఎంఎస్ఎంఈల కాలపరిమితి 7-8 ఏళ్లు మాత్రమే కావడంతో లీజు విధానంలో భూములు కేటాయించడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకురావడం లేదన్నారు. ఎంఎస్ఎంఈలు ఎకరం లోపు భూమిలో యూనిట్లు ఏర్పాటు చేస్తాయి కాబట్టి అవుట్ రేట్ సేల్ విధానంలో భూములు కేటాయించాల్సిందిగా కోరారు.

కెనడాలో ప్రతిభ చూపిన ఆంధ్ర విద్యార్థి

- చిన్న వయసులోనే ఏవియేషన్ టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్
- ఆంద్రూ పవర్ మెమోరియల్ అవార్డు అందుకున్న స్వితిన్



చల్లపల్లి(అవనిగడ్డ): కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ కుమారుడు వేములపల్లి స్వితిన్ కెనడాలో తన ప్రతిభ కనబరిచాడు. కెనడాలోని ప్రఖ్యాత యూనివర్సిటీలో స్వితిన్ కేవలం 19 సంవత్సరాల వయసులోనే ఏవియేషన్ టెక్నాలజీ - పైలట్ ప్రో గ్రామ్‌లో పట్టభద్రుడయ్యాడు. ఆదివారం యూనివర్సిటీలో జరిగిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో స్వితిన్ మోస్ట్ ప్యాషనేట్ పైలట్ - లివింగ్ ది డ్రీమ్ అంశంలో కీవాటీస్ ఎయిర్ అవార్డు (ఆంద్రూ పవర్ మె మోరియల్ అవార్డు) అందుకున్నాడు. ఏటా విమానాలు సమర్థవంతంగా నడపటంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన, అర్హత కలిగిన విద్యార్థికి ఈ అవార్డు అందిస్తారు. వివిధ ఏవియేషన్ ప్రోగ్రామ్‌ల నుంచి 247 మంది గ్రాడ్యుయేట్లు పోటీలో పాల్గొనగా వీరిలో స్వితిన్ ఈ మెరిటోరియస్ అవార్డుకు ఎంపికయ్యాడు. 2023 సంవత్సరానికి అత్యంత ప్రతిభ కనబరిచిన గ్రాడ్యుయేటింగ్ పైలట్ గౌరవాన్ని, పురస్కారాన్ని, 1500 డాలర్ల నగదు బహుమతిని స్వితిన్ అందుకున్నాడు. తమ కుమారుడు సాధించిన విజయంపై వేములపల్లి సు రేష్ - రోజా దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

మండు వేసవిలో మెండుగా ముహూర్తాలు



మే, జూన్ నెలల్లో మోగనున్న పెళ్లి బాజాలు ● వివాహాలకు అనువైన తేదీలను ప్రకటించిన పండితులు

సాక్షి, అమరావతి: మండు వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. మే, జూన్ నెలల్లో దాదాపు 24 శుభముహూర్తాలు ఉన్నట్టు పండితులు ప్రకటించారు. గత శుభకృతు నామ సంవత్సరం(2022-23)లో దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత వచ్చిన శుభ ముహూర్తాలకు ఏపీ, తెలంగాణలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ తర్వాత ఆగస్టు నుంచి నవంబర్ నెలాఖరు వరకు సరైన ముహూర్తాలు లేవు. మళ్లీ నవంబర్ 28 నుంచి డిసెంబర్ 12 వరకు పెళ్లిళ్లు జరిగాయి. డిసెంబర్ 16 నుంచి ఈ ఏడాది జనవరి 14 వరకు ధనుర్మాసం కావడంతో వివాహాలు చేయలేదు. జనవరి 19 నుంచి మార్చి 9 వరకు మొత్తం 18 శుభ ముహూర్తాలు ఉండటంతో రాష్ట్రంలో లక్షన్నరకు పైగా వివాహాలు జరిగినట్టు అంచనా. మళ్లీ నెల రోజుల విరామం తర్వాత తాజాగా మే నెలలో 6, 8, 9, 10, 11, 15, 16, 20, 21, 22, 27, 29, 30 తేదీలతో పాటు జూన్‌లో 1, 3, 5, 6, 7, 11, 12, 23, 24, 26, 27 తేదీల్లో శుభముహూర్తాలు ఉన్నాయని పండితులు ప్రకటించారు.

మార్కెట్లకు పెళ్లి కళ..

ఈ ఏడాది మార్చి 10 నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు మూఢం కారణంగా వివాహ వేడుకలకు బ్రేక్



పడింది. మూఢం ముగిసి వైశాఖ శుద్ధదశమి మొదలవుతుండటంతో ఏపీ, తెలంగాణలో పెళ్లి సందడి నెలకొంది. ఇప్పటికే శుభముహూర్తాలను ఎంపిక చేసుకున్న వారంతా కళ్యాణ మండపాలు బుక్ చేసుకోవడం, ఆహ్వాన పత్రికలు పంచడంలో నిమగ్నమయ్యారు. కొత్త దుస్తులు, ఆభరణాల కొనుగోళ్లతో మార్కెట్లు కూడా కళకళలాడుతున్నాయి.

ఇప్పుడు కాకుంటే మరో 2 నెలలు బ్రేక్..

మే మాసం అంతా వరుసగా మంచి ముహూర్తాలున్నాయి. జూన్ నెలలో కూడా 18వ తేదీ వరకు అనువైన ముహూర్తాలు బాగానే ఉన్నాయి. 19వ తేదీ నుంచి ఆషాఢ మాసం మొదలుకానుండటంతో మళ్లీ శుభకార్యాలకు బ్రేక్ పడనుంది. ఆషాఢ మాసం జూలై 18 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత వచ్చే శ్రావణ మాసం, అధిక శ్రావణ మాసం ఆగస్టు 17 వరకు ఉంటుంది. దీంతో జూలై, ఆగస్టు నెలల్లో పెళ్లిళ్లకు బ్రేక్ పడుతుందని పండితులు చెబుతున్నారు.

వివాహాలకే.. గృహ ప్రవేశాలకు అనుకూలించవు

ప్రస్తుత వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో దాదాపు 25 మంచి ముహూర్తాలున్నాయి. వీటిలో చాలా ముహూర్తాలు పెళ్లిళ్లు, ఉపనయనాలకు బాగా అనుకూలిస్తాయి. మే 11 నుంచి 24వ తేదీ వరకు అగ్ని కార్తె ఉండటంతో ఆ సమయంలో వచ్చే ముహూర్తాలు గృహ ప్రవేశాలకు అనుకూలించవు. జూన్ నెలాఖరు వరకు ముహూర్తాలున్నప్పటికీ ఆషాఢం వస్తుంది. ఆ తర్వాత దాదాపు 2 నెలల పాటు ముహూర్తాలు ఉండవు. అందుకే మే, జూన్ నెల మొదట్లోనే వివాహాలు జరిపించేందుకు చాలా మంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

– కొత్తపల్లి సూర్యప్రకాశరావు, పురోహితుడు, భీమవరం

నేటి నుంచి 'సీఎం కప్' ఫైనల్స్

- తిరుపతిలో 5 రోజుల పాటు నిర్వహణ
- టోర్నీలో తలపడనున్న 3,768 మంది క్రీడాకారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'సీఎం కప్' క్రీడా పోటీలు తుది దశకు చేరుకున్నాయి. తిరుపతి వేదికగా ఐదు రోజుల పాటు ఫైనల్స్ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాటుల్ పూర్తి చేసింది. మొత్తం 14 క్రీడాంశాల్లో మే 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పోటీల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. టోర్నీలో 5,500 మంది భాగస్వాములు అవుతుండగా.. ఇందులో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 3,768 మంది క్రీడాకారులు(బాలురు 2,033, బాలికలు 1,735) పోటీ పడనున్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు తలపెట్టిన సీఎం కప్ టోర్నీకి ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రూ.10 లక్షలు కేటాయించింది. ఫైనల్స్‌లో 14 క్రీడాంశాల్లోని మహిళలు, పురుషుల విభాగాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు 84 ట్రోఫీలతో పాటు 1,100 మెడల్స్‌ను ప్రదానం చేయనున్నారు. 1,200 మెరిట్ సర్టిఫికెట్లు, 4,200 పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందించనున్నారు. తుది పోటీల కోసం శాప్ సుమారు రూ.కోటిపైగా నిధులను వెచ్చిస్తోంది. ఫైనల్స్‌కు చేరిన జట్లకు పౌష్టికాహారం కోసం రూ.10 వేలు కేటాయించడం విశేషం.

క్రీడాంశం	పోటీ వేదిక
ఫుట్‌బాల్	ఎస్వీ ఆర్ట్స్ కళాశాల(పురుషులు), పద్మావతి మహిళా వర్సిటీ గ్రౌండ్ (మహిళలు)
హాకీ	ఎస్వీ జూనియర్ కళాశాల (మహిళలు), ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (పురుషులు)
టేబుల్ టెన్నిస్	ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ (టీటీ, పీడీ హాల్‌లో పురుషులు, మహిళలు)
అథ్లెటిక్స్	ఎస్వీ వర్సిటీ స్టేడియం గ్రౌండ్(పురుషులు, మహిళలు)
బాల్‌బ్యాడ్మింటన్,	ఎస్వీ వర్సిటీ గ్రౌండ్
బాస్కెట్‌బాల్	(ప్రకాశం భవన్ ఎదురు-పురుషులు, మహిళలు)
బాక్సింగ్, హ్యాండ్‌బాల్	ఎస్వీయూ మెస్ గ్రౌండ్ (పురుషులు, మహిళలు)
కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నిస్	ఎస్ఎస్ఎస్ కాంప్లెక్స్(పురుషులు, మహిళలు)
ఖోఖో	ఎస్వీయూ స్టేడియం వెనుక గ్రౌండ్ (పురుషులు, మహిళలు)
వాలీబాల్	ఎస్వీయూ క్యాంపస్‌లోని బాలాజీ కాలనీ (పురుషులు, మహిళలు)
వెయిట్ లిఫ్టింగ్	ఎస్వీయూ రిక్రియేషన్ హాల్ (పురుషులు, మహిళలు)

జేఈఈ మెయిన్‌లో గౌతమ్ పూర్వ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఒకటి నుంచి పది లోపు మూడు ర్యాంకులు, వంద లోపు 18 ర్యాంకులు సాధించారని పేర్కొంది. డి.ఫణీంద్ర నాథ్‌రెడ్డి 5వ ర్యాంకు, ఆర్ గ్రేస్ ఏంజల్ బాయ్ 5వ ర్యాంక్, ఎం.అవినాష్ కుమార్ 10వ ర్యాంక్ సాధించారని వివరించింది. 100 లోపు 5, 5, 10, 12, 15, 18, 29, 32, 42, 47, 61, 70, 70, 72, 75, 77, 88, 88 ర్యాంకులు సాధించి విజయ దుందుభి మోగించారని తెలిపింది.విద్యార్థులను, ఉపాధ్యాయులను యాజమాన్యం అభినందించింది.

ఎస్ఆర్ విద్యార్థుల ప్రభంజనం

హన్మకొండ చౌరస్తా: అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ (మెయిన్)-2023 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ కాకాజీకాలనీలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫలితాల వివరాలను వెల్లడించారు. తమ విద్యార్థులు బి.సమీత్ రిజర్వేషన్ కేటగిరీలో 7వ ర్యాంకు, సాత్విక్ 20వ ర్యాంకు, చవాన్ అఖిల 22వ ర్యాంకు, శ్రీవర్షిత్ 34వ ర్యాంకు సాధించారని తెలిపారు. వీరితోపాటు మరో 11 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఎస్ఆర్ కీర్తి ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టారని వివరించారు. ఎస్ఆర్ వి ద్యాసంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

కొనసాగుతున్న ద్రోణి- వచ్చే రెండు రోజులు వర్షాలు

- పిడుగుపాటుకు ఇద్దరు మృత్యువాత.. రెండు ఆవులు, 15 గొర్రెలు మృతి

సాక్షి, అమరావతి/పెళ్లకూరు(తిరుపతి జిల్లా)/ ఒంగోలు: తూర్పు విదర్భ నుంచి ఉత్తర తమిళనాడు వరకు తెలంగాణ, కర్ణాటక మీదుగా ద్రోణి కొనసాగుతున్నదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజులు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం అంబేద్కర్ కోనసీమ, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు మెరుపుల వర్షంతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉన్న దృష్ట్యా ఎవరూ చెట్ల కింద ఉండకూడదని తెలిపారు. కాగా, తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని పునబాక గ్రామ సమీపంలోని ఓ పొలంలో నాట్లు వేస్తున్న కృష్ణా జిల్లా రామాపురం గ్రామానికి చెందిన జల్ల వీరలంకయ్య(49) పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాడు. అలాగే అదే మండలంలో రెండు ఆవులు, ఓ దూడ మృతి చెందాయి. అదే విధంగా ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం మండలం మిరియంపల్లి గ్రామానికి చెందిన రైతు రావెళ్ల పుల్లయ్య (73) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. కొనకనమిట్ల మండలం ఇరసలగుండంలో పిడుగుపడి 15 గొర్రెలు చనిపోయాయి.

● తెలంగాణ

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్: హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. ఇరు మార్గాల్లో వాహనాలు బారులు తీరాయి. వివాహాలు, ఇతర శుభకార్యాలు, గ్రామ దేవతల పండుగల నేపథ్యంలో హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో వాహనాల రద్దీ ఏర్పడింది. జంక్షన్ల వద్ద రోడ్లు దాటేందుకు వాహనదారులు, స్థానికులు అవస్థలు పడ్డారు. అర్ధరాత్రి వరకు రద్దీ కొనసాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆదివారం వారాంతపు సంత ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి.

బాబూ.. ఐ లవ్యూ

పవన్‌కు సీఎం అవ్వాలన్న ఆలోచనే లేదు ● జనసేన నేతలు, కార్యకర్తల్లో అంతర్మథనం

- పవన్ తీరు సీఎం కావాలనుకుంటున్నట్లు లేదు
- పవన్, నాదెండ్ల ఇద్దరూ ఎమ్మెల్యేలైతే చాలేమో
- టీడీపీని పెంచేలా వారి వ్యవహారశైలి
- టీడీపీ బలపడితే లోకేశ్‌కు తప్ప పవన్‌కు ఏం ప్రయోజనం?
- పొత్తు తర్వాత జనసేన నేతల పరిస్థితి సున్నా
- టీడీపీ పొత్తు పెట్టుకున్న పార్టీ ఎదగదన్నదే చరిత్ర
- జనసేన నాయకులు, కార్యకర్తల్లో ఇవే చర్చలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అధికారంలోకి రావాలనిగానీ, ముఖ్యమంత్రి అవ్వాలనిగానీ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఏకోశానా లేదు. రాజకీయంగా బలపడటానికి అవకాశం ఉన్నా.. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ బలహీనమైతేనే రాజకీయంగా కనీసం తమ ఉనికి అయినా ఉంటుందని, ఈ విషయం సాధారణ కార్యకర్తను అడిగినా చెబుతారు. కానీ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ విషయం తెలియనట్లే వ్యవహరిస్తున్నారు. ఈ నేతలిద్దరికీ చంద్రబాబును సీఎంను చేయాలనే తపన తప్ప మరో ఉద్దేశం కనిపించడం లేదు. ఎదగడానికి ఉన్న అవకాశాలను పట్టించుకోకుండా చంద్రబాబుతో పవన్ సమావేశం కావడం, మరిన్ని భేటీలుంటాయని నాదెండ్ల చెప్పటం చూస్తే.. నమ్ముకున్న నాయకుల్ని, కార్యకర్తల్ని మీదారి మీరు చూసుకోండని చెప్పినట్లే ఉంది. కేవలం వాళ్లిద్దరూ ఎమ్మెల్యేలుగా ఎన్నికై చంద్రబాబు సీఎం అయితే చాలని వారు భావిస్తున్నట్లు ఉంది. తాజాగా జనసేన అధినేత తీరుపై అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. చంద్రబాబూ.. ఐ లవ్యూ.. అంటూ ఆయన ఇంటికెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి మీ గెలుపు బాధ్యత నాదే అంటూ భరోసా ఇచ్చి రావడం తమకు తీవ్ర అవమానంగా ఉందని జనసేన నేతలు, కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

సొంత పార్టీ కోసం కాదు.. టీడీపీ కోసమే..

అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది మాత్రమే సమయం ఉన్నా, ఇప్పటికీ రెండు మూడు నెలలకొకసారిగానీ రాష్ట్రానికి రాని పవన్‌కళ్యాణ్ ఇటీవల కాలంలో వెంటవెంటనే మూడుసార్లు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో సమావేశమయ్యారు. తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోవడానికి ఏ మాత్రం ఇష్టం లేని బీజేపీని సైతం ఒప్పించేలా పవన్‌కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇవన్నీ చూస్తుంటే పవన్ సొంత పార్టీ కంటే తెలుగుదేశం పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని అభిమానులు పేర్కొంటున్నారు.

పవన్ సీఎం కావాలంటే టీడీపీ నేతలే కించపరిచారు

పవన్‌కళ్యాణ్ సీఎం కావాలని తాము డిమాండ్ చేసిన సందర్భాల్లో తెలుగుదేశం అధికారిక సోషల్ మీడియా, ఆ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరకరంగా స్పందించినట్లు జనసేన నేతలు గుర్తు చేసుకుంటున్నారు. తెలుగుదేశంతో పొత్తు పెట్టుకున్నా ఉమ్మడి సీఎం అభ్యర్థిగా పవన్ ఉండాలని జనసేన నాయకులు డిమాండ్ చేసినప్పుడు టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి 'క్వింటా కాటా తూగడానికి ఒక్కొక్కసారి కొన్ని వడ్లు అవసరమవుతాయి. కానీ, ఆ కొన్ని వడ్ల వల్లే మొత్తం కాటా తూగింది అనుకుంటే ఎలా సేనాధిపతీ!' అంటూ జనసేన అధినేతను కించపరుస్తూ ట్వీట్‌ను చేశారని గుర్తుచేస్తున్నారు.




రాష్ట్రంలో జనసేనను రాజకీయంగా బలహీనపరచడానికి అధికార వైఎస్సార్‌సీపీ మాదిరే తెలుగుదేశం పార్టీ కూడా ప్రయత్నం చేస్తోందని కాపు సంక్షేమసేన తరఫున మాజీ మంత్రి హరిరామజోగయ్య వంటి నేతలు ఇటీవల పవన్‌కళ్యాణ్‌తో జరిగిన భేటీలో చెప్పిన సంగతి తెలిసిందే. వైఎస్సార్‌సీపీని గద్దె దింపడానికి విపక్షాలన్నీ కలవాలని చెబుతూనే చంద్రబాబు.. జనసేనలో చేరడానికి సిద్ధంగా ఉన్న కన్నా లక్ష్మీనారాయణ, మహాసేన రాజేష్‌లాంటి వారిని తెలుగుదేశంలో చేర్చుకున్నారని హరిరామజోగయ్య నేరుగా పవన్‌కళ్యాణ్ వద్దే ప్రస్తావించారు.

చంద్రబాబును నమ్మి బాగుపడ్డవారు లేరు

తెలుగుదేశంతో పొత్తు పెట్టుకున్న పార్టీలు గానీ, చంద్రబాబును నమ్మినవారుగానీ రాజకీయంగా ఎదిగిన చరిత్ర లేదని పవన్ అభిమానులు గుర్తుచేస్తున్నారు. అలాంటి చరిత్ర ఉన్న చంద్రబాబు తన కుమారుడు లోకేశ్ రాజకీయ ఎదుగుదల కోసం మరొకరిని రాజకీయ సమాధి చేయడానికే చూస్తారనేది తెలిసినా పవన్ ఇలా వ్యవహరిస్తుండటం చూస్తే ఆయనకు ఎదగాలని లేదని అర్థమవుతోందని పేర్కొంటున్నారు. పొత్తుల్లో జనసేనకు ఇచ్చే సీట్ల సంఖ్య నామమాత్రంగానే ఉండే అవకాశం ఉండొచ్చని అభిమానులే అంటున్నారు. 2014 ఎన్నికల సమయంలో 15 సీట్లు బీజేపీకి కేటాయించిన టీడీపీ.. అందులో నా లుగుచోట్ల ఫ్రెండ్లీ పోటీ అంటూ అభ్యర్థుల్ని నిలబెట్టిందని, మరో మూడుచోట్ల టీడీపీ నేతలే ఇండిపెండెంట్లుగా పోటీచేశారని జనసేన నేతలు గుర్తుచేసుకుంటున్నారు. ఎప్పుడైనా టీడీపీ వ్యవహారం అలాగే ఉంటుందని చెబుతున్నారు. టీడీపీ నేతల్నే జనసేనలో చేర్పించి పోటీచేయిస్తారని అనుమానిస్తున్నారు. ఇక మనదారి మనం చూసుకోవాల్సిందేనా అని జనసేన నేతలు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమి కోసమే పొత్తులు

- చంద్రబాబుతో పవన్ భేటీపై అందరిలోనూ ఆసక్తి
- మున్ముందు మరిన్ని భేటీలు, చర్చలు
- జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసమే పొత్తుల ప్రయత్నాలు చేస్తున్నట్టు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఇందుకు ప్రతిపక్షాల ఐక్యత అవసరమన్నారు. విశాఖపట్నంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భేటీపై రాజకీయపరంగా అందరిలోను ఆసక్తి నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం పవన్‌కళ్యాణ్ తపిస్తున్నారని చెప్పారు. ఆ లక్ష్యంగా ఎలా ముందుకెళ్లాలన్న దానిపై వారు చర్చించారని తెలిపారు. ఆ భేటీ సారాంశం ఇదేనని, రాబోయే రోజుల్లో మరిన్ని భేటీలు, చర్చలు జరుగుతాయని చెప్పారు. పొత్తులు అనేది పొలిటికల్ ప్రాసెస్ అని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకుండా వైఎస్సార్‌సీపీని ఓడించాలంటే కలిసొచ్చే పార్టీలతో పొత్తులు కచ్చితంగా అవసరమని జనసేన భావిస్తోందని పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్ పదవుల కోసం కాకుండా రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్నారని చెప్పారు.

నకిలీ వెబ్‌సైట్లు తొలగింపు

యాప్‌లు, కాల్ సెంటర్లు కూడా గుర్తింపు

- మన దేశంతో పాటు విదేశాల నుంచి నిర్వహణ
- ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్న సైబరాబాద్ సీఓఈ
- ఇప్పటివరకు వందకు పైగా వెబ్‌సైట్లు రద్దు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలకు ప్రధాన వేదిక నకిలీ వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లే (యాప్స్). దీంతో వాటిని కూకటివేళ్లతో సహా తొలగించి తద్వారా సైబర్ నేరాలను పెకిలించేందుకు సైబరాబాద్ పోలీసులు పక్కా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. సైబరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ద్వారా నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను గుర్తించి, ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్నారు. ఇప్పటివరకు సీఓఈ ద్వారా వందకు పైగా ఫేక్ సైట్లను తొలగించారు.

విదేశాల నుంచి కూడా..

విదేశాలతో పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్, ఉత్తరాఖండ్, కర్నాటక, జార్ఖండ్ వంటి రాష్ట్రాల నుంచి ఎక్కువగా సైబర్ నేరస్తులు నకిలీ వెబ్‌సైట్లు, కాల్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నేరస్తులు నకిలీ యాప్‌లను అభివృద్ధి చేసి, ప్లే స్టోర్లలో అందుబాటులో ఉంచుతున్నారు. అవి నకిలీవని తెలియక చాలా మంది కస్టమర్లు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని మోసపోతున్నారు. అందుకే పక్కా ఆధారాలతో నకిలీ సైట్లు, యాప్‌లను తయారు చేసే వారిని గుర్తించి, శిక్షలు పడేలా చేస్తున్నారు.

ప్రతీ స్టేషన్‌లో సైబర్ వారియర్లు..

ప్రస్తుతం సైబర్ పోలీసు స్టేషన్‌తో పాటు ప్రతి శాంతి భద్రతల ఠాణాలోనూ ఇద్దరు సైబర్ వారియర్లు ఉన్నారు. వీరికి ఎస్ఐ నేతృత్వం వహిస్తారు. వీరికి సైబర్ నేరాల నియంత్రణపై శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాలలో పెట్టడం కూడా సైబర్ నేరస్తులకు అవకాశంగా మారుతోంది. అవగాహనే సైబర్ నేరాలకు నియంత్రణకు ప్రధాన అస్త్రం. అందుకే కమిషనరేట్ పరిధిలో నివాసిత సంఘాలు, కంపెనీలు, పరిశ్రమలు, విద్యా సంస్థలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలలోనూ సైబర్ నేరాలపై షార్ట్ వీడియో, పోస్టులు చిత్రీకరించి ప్రచారం చేస్తున్నారు.

● తెలంగాణ

తెలంగాణ పునర్నిర్మాణ ప్రతీక

నూతన సచివాలయం ప్రారంభోత్సవంలో తెలంగాణ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున తలెత్తుకుని నిలిచిన కొత్త సచివాలయం రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రతీక అని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, అతి తక్కువ కాలంలో దేశానికే ఆదర్శంగా నిలవడమే తెలంగాణ సాధించిన ప్రగతి అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్ తీరాన నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. చిల్లర విమర్శలు పట్టించుకోకుండా తెలంగాణ ఆకాశమంత ఎత్తుకు ఎదిగిందని చెప్పారు.

వేసవిలోనూ మత్తడి దూకే చెరువులతో..

కాకతీయ రాజుల స్ఫూర్తితో మిషన్ కాకతీయ ద్వారా చెరువులన్నింటినీ పునరుద్ధరించుకున్నామని, గోదావరిపై ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టుకున్నామని చెప్పారు. ఈ యాసంగిలో దేశంలో 94 లక్షల ఎకరాల్లో వరి వేస్తే.. అందులో 56 లక్షల ఎకరాలు తెలంగాణలోనివేనన్నారు. నిరంతర విద్యుత్‌తో గ్రామాలు, పట్టణాలు అద్భుతంగా అలరారుతున్నాయని, అవార్డులు సొంతం చేసుకుంటున్నాయని చెప్పారు. కోల్పోయిన అడవులను తిరిగి తెచ్చుకున్నామన్నారు. వలసపోయిన పాలమూరు కూలీలంతా తిరిగొచ్చి సొంత పొలాల గట్ల మీద కూర్చుంటే.. ఇతర రాష్ట్రాల కూలీలు తెలంగాణ పొలాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరందిస్తున్నామని ఆయన చెప్పారు.



నూతన సచివాలయం ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్

6వ అంతస్తులో 6 ఫైళ్లపై సంతకం

సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్ 6వ అంతస్తులోని తన చాంబర్‌కు వెళ్లి సీట్లో ఆసీనులయ్యారు. తన సెంటిమెంట్ లక్కీ నంబర్ 6కు తగ్గట్టుగా ఆరు ఫైళ్లపై సంతకాలు చేశారు. 2023-24లో దళితబంధు పథకం అమలుకు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. పోడుభూముల పట్టాల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ నిధుల పంపిణీ, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పాలమూరు లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943